# అనగా అనగా కథలు

## వివిధ దేశాల జానపద కథలు

అబ్బూరి ఛాయాదేవి





మంచి పుస్తకం

Anil

# అనగా అనగా కథలు

(వివిధ దేశాల జానపద కథలు)

## అబ్బూరి ఛాయాదేవి



మంచి పుస్తకం

అనగా అనగా కథలు : అబ్బూరి ఛాయాదేవి
(వివిధ దేశాల జానపద కథలు)
ముఖచిత్రం, బొమ్మలు : కొచ్చెర్ల వి. ఆర్

ఇన్నర్ టైటిల్ : తొలిముద్రణ ముఖచిత్రం కోసం
అబ్బూరి గోపాలకృష్ణ వేసిన బొమ్మ
తొలి ముద్రణ : 1955

ప్రచురణ కాలం : అక్టోబరు, 2008
**ISBN** : 978-81-906522-0-9
ప్రతుల సంఖ్య : 2000
వెల : రూ. 40/-

ప్రచురణ, ప్రతులకు :
మంచి పుస్తకం
12-13-450, వీధి నెం.1
తార్నాక, సికింద్రాబాదు 500 017
ఫోన్ : 94907 46614.
email : info@manchipustakam.in
website : www.manchipustakam.in

ప్రతులకు :
జన విజ్ఞాన వేదిక
మాల్యాద్రి, కన్వీనర్, ప్రచురణల విభాగం
8-1-6, బాలాజీరావుపేట
తెనాలి - 522 202
ఫోన్ : 94405 03061

ముద్రణ :
చరిత ఇంప్రెషన్స్,
హైదరాబాదు,
ఫోన్: 27678411.

# విషయ సూచిక


| | |
|---|---|
| మళ్ళీ మీ కోసం | v |
| శ్వేత భల్లూకం | 09 |
| సస్యసుందరి | 18 |
| వింత ఉంగరం | 22 |
| అగ్ని పరీక్ష | 33 |
| మూషిక రంధ్రం | 38 |
| వేలెడు మనిషి - బారెడు మీసం | 45 |
| బుద్ధి కుశలత | 54 |
| పోయిన బల్లెం | 59 |
| మూడు కోరికలు | 68 |
| వీరన్న శౌర్యం | 73 |
| స్వర్ణ పేటిక | 80 |
| చంద్రకాంత | 86 |
| బుద్ధిబలం | 90 |
| అసలు రహస్యం | 96 |

# మళ్ళీ మీ కోసం

అర్ధ శతాబ్దం క్రితం ప్రచురితమైన 'అనగా అనగా' పుస్తకాన్ని మళ్ళీ సజీవం చేసింది మా పక్కింటి అమ్మాయి, నా 'ఫ్రెండ్', ఎనిమిదేళ్ళ అభిజ్ఞ. బాలల కథలు వినడానికి నా దగ్గరికి తరచుగా వస్తూ 'అనగా అనగా' పుస్తకంలోని కథల్ని మళ్ళీ మళ్ళీ చదివి వినిపించమనేది. అంతే కాకుండా, వాళ్ళ స్కూల్లోని తెలుగు టీచర్‌కి జిరాక్స్ కాపీ పట్టుకెళ్ళి చూపించింది. అంతకు ముందు డా. సి. నారాయణ రెడ్డిగారి అమ్మాయి శ్రీమతి గంగ తన మనవరాలు వరేణ్య కోసం ఆ పుస్తకం అడిగితే జిరాక్స్ కాపీ పంపించాను. పాత పుస్తకం నా దగ్గర ఒక్కటే కాపీ ఉంది.

జిడ్డు కృష్ణమూర్తి సెంటర్ ద్వారా నాకు ఆత్మీయురాలైన శ్రీమతి అనూరాధ 'సప్తపర్ణి' అనే సాంస్కృతిక సంస్థని ప్రారంభించి, బాల సాహిత్యాన్ని కూడా ప్రోత్సహించాలనే సంకల్పంతో కృషి చేస్తున్న సందర్భంలో 'అనగా అనగా' పుస్తకం పట్ల ఆసక్తి చూపించారు. ఆమె ద్వారానే ఈ పుస్తక పునర్ముద్రణ బాధ్యతని మంచి పుస్తకం ట్రస్ట్ స్వీకరించింది.

1955లో జరిగిన ప్రథమ ముద్రణకి ముందుమాట రాయమని వరద రాజేశ్వరరావు గారిని అడిగితే, తన పేరు పెట్టకుండా పద్యాల్లో రాసి ఇచ్చారు. ఈ ద్వితీయ ముద్రణలోనైనా ఆయన పేరుని చేర్చడం భావ్యమనిపించింది. ప్రథమ ముద్రణకి నా మరిది అబ్బూరి గోపాలకృష్ణ తయారుచేసిన ముఖచిత్రం ఆధారంగా రాసిన పద్యాలు అవి.

వివిధ దేశాల జానపద గాథలతో కూడిన ఇంగ్లీషు సంకలనాలు చదివి, వాటిలోంచి కొన్నిటిని తీసుకుని తెలుగులోకి 'అనుసరణ' చేసినవి ఈ సంపుటంలోని కథలు. సాహసం, దానశీలత, స్నేహం,

ప్రేమ, దయ, సహకారం మొదలైన మంచి లక్షణాలు కొందరు మనుషుల్లో ఎక్కువగా ఉన్నట్లే, కొన్ని పశుపక్ష్యాదుల్లోనూ ఉంటాయనీ, మంచితనంతో, బుద్ధికుశలతతో, ధైర్యంతో ఎటువంటి దుష్టశక్తులనైనా జయించవచ్చుననీ సూచించే కథలు ఇవి.

ద్వితీయ ముద్రణకి ముఖచిత్రం, బొమ్మలు వేసిన కొచ్చెర్ల వి. ఆర్ గారికీ, లోపలా, బయటా అందంగా తీర్చిదిద్దిన మంచి పుస్తకం ట్రస్ట్‌కీ నా కృతజ్ఞతలు.

అక్టోబరు, 2008 — అబ్బూరి ఛాయాదేవి

అందమయినా పెరటితోటల
ఆవరించిన అరటితోపుల
చాప పరచీ పాపలంతా
సర్దుకున్నారా?

సన్నజాజీ వన్నె చిన్నెల
వెన్నెలింకా విరియలేదా?
చక్కనైనా చుక్కలెన్నో
చాలునన్నారా?

మనిషి గొంతున మాటుమణిగిన
కనులకందని దూరసీమల
తరతరమ్ముల గాథలన్నీ
తవ్విచూస్తారా?

కాలగర్భం తవ్విచూస్తూ
కథలు చెప్పే తాతగారికి
విసుగుపుట్టే ప్రశ్నలేవీ
వెయ్యకుంటారా?

అబ్బూరి వరద రాజేశ్వరరావు

# శ్వేత భల్లూకం

అనగా అనగా ఒక ఊళ్ళో ఒక పేదరైతు ఉండేవాడు. అతనికి ధనం లేదు. పైగా బోలెడు మంది పిల్లలు. వాళ్ళకి తిండికి గడవడం కూడా కష్టమయింది. ఆ పిల్లలందరూ సరైన తిండిలేక చిక్కిపోయి అలా అయిపోయారు కానీ - అసలు చాలా అందమైన వాళ్ళు. అందరిలోకీ ఆఖరి అమ్మాయి కల్పవల్లి ముద్దుల గుమ్మ.

ఆ రోజు గురువారం. చీకటి పడింది. ఆ సాయంకాలం జడివాన కురవడం మూలాన చలిగాలి బాగా వీస్తోంది. తన గుడిసె కూలిపోతుందేమోనని రైతు భయపడ్డాడు. ఇంటి పైన తాటాకులన్నీ ఎగిరిపోయాయి. రాత్రి అతని భార్య, పిల్లలూ కబుర్లు చెప్పుకుంటూ చలి కాచుకుంటున్నారు. ఇంతలో తలుపుతట్టిన చప్పుడయింది. అంత రాత్రివేళ తమ గుడిసెకు వచ్చే వ్యక్తులు ఎవరై ఉంటారా అని ఆశ్చర్యపోతూ రైతు తలుపు తీయడానికి వెళ్ళాడు. తలుపు తీసి చూసేసరికి ఒక పెద్ద తెల్లని ఎలుగుబంటి!

"నమస్కారం!" అంది ఎలుగు. రైతుకూడా "నమస్కారం," అన్నాడు, ఒణుకుతున్న కంఠంతో. "మీ ఆఖరి అమ్మాయిని నాకిస్తారా? మీకు బోలెడంత ధనం ఇస్తాను. ఇంతవరకూ మీరు అనుభవిస్తున్న పేదరికానికి స్వస్తి చెప్పవచ్చు," అంది ఎలుగుబంటి.

ధనం చేతికి వస్తుందంటే పేద రైతుకీ సంతోషమే. కాని, తన కన్న కూతుర్ని విడిచి పెట్టాలంటే అతనికి మనసు ఒప్పలేదు. "ఊఁహూ ఇవ్వను," అన్నాడు రైతు.

" పిచ్చివాడా! కొంచెం ఆలోచించు. నేను మళ్ళీ గురువారం నాటి రాత్రి మీ ఇంటికి వస్తాను. అప్పుడు సమాధానం చెప్పు," అంటూ ఆ శ్వేతభల్లూకం వెళ్ళి పోయింది.

రైతు తలుపు మూసి, లోపలికి వెళ్ళి సంగతంతా భార్యా బిడ్డలతో చెప్పాడు. తల్లిదండ్రులను ఏ విధంగా తను సుఖపెట్టగలదో తెలియగానే కల్పవల్లి ఎలుగుబంటితో సంతోషంగా వెళతానంది. కట్టుకున్న బట్టలు శుభ్రంగా ఉతుక్కుంది. ప్రయాణానికి సిద్ధమై పోయింది.

గురువారం వచ్చింది. ఎలుగుబంటి సాయంకాలం రైతు గుడిసెకి వచ్చింది. కల్పవల్లి దాని వీపు మీదకి ఎక్కి కూర్చుంది. ఆ చీకట్లో అడవుల్లోంచి తీసుకుపోయింది ఎలుగు. దారిలో "నీకు భయంగా ఉందా?" అని అడిగింది ఎలుగు. "నాకేం భయం లేదు," అంది కల్పవల్లి ఉత్సాహంతో.

అలా వెళ్ళగా వెళ్ళగా ఒక పెద్దకొండ ఎదురయింది. ఎలుగుబంటి ఆ కొండ మొదట ఆగి తలుపు తట్టింది. తలుపు తెరుచుకుంది. ఆమెని లోపలికి తీసుకుని వెళ్ళింది ఎలుగు. లోపల ఒక పెద్ద భవనంలా ఉంది. విశాలమయిన గదులు, రంగురంగుల దీపాలు, బంగారపు తలుపులు, వెండి బల్లలు. భవనమంతా దేదీప్యమానంగా వుంది. ఆమె ఇటువంటి వస్తువులను ఇంతకు ముందెప్పుడూ చూడలేదు. అందుకని వాటి వైపు వింతగా చూడటం మొదలు పెట్టింది.

ఎలుగుబంటి కల్పవల్లికి ఒక మోగే గంట ఇచ్చి "నీకు ఏదయినా కావలిస్తే ఈ గంట వాయించు," అని చెప్పి వేరే గదిలోకి వెళ్ళిపోయింది. కల్పవల్లి కడుపునిండా భోంచేసింది. నిద్రపోతే బాగుండును అనుకుంటూ గంట ఎత్తిందో లేదో వెంటనే అక్కడ ఒక గది తయారయింది. దీపాలు ఆర్పేసి ఆమె పక్కమీద పడుకుంది. ఇంతలోకే పక్కగదిలోకి ఎవరో వచ్చినట్లు, మంచంమీద పడుకున్నట్లు అలికిడి అయింది.

ప్రతిరోజు రాత్రీ అలాగే జరుగుతోంది. పగటి పూట మాత్రం ఒక్క మానవమాత్రుడు కూడా ఆమెకు కనబడేవాడు కాదు. రాత్రిళ్ళు దీపాలు ఆరిపోగానే మాత్రం పక్కగదిలో ఎవరో మనిషి ఉన్నట్లు అలికిడి అయ్యేది. మళ్ళీ తెల్లవారాక చూస్తే ఆ గదిలో ఎవరూ ఉండేవారు కాదు.

ఆ భవనంలో అన్ని సదుపాయాలూ ఉన్నాయి కాని, ఆమెతో కబుర్లు చెప్పడానికి ఎవరూలేరు, ఆమెకి ఏమీ తోచడం లేదు. ఎంతో విచారంగా కాలం గడుపుతోంది.

ఒక రోజున ఎలుగుబంటి "కల్పవల్లీ! అలా దిగులుగా ఉంటున్నావేం? ఇక్కడ నీకు లోటు జరగడం లేదుగా?" అంది. "నాకేమీ తోచడం లేదు, నాతో కబుర్లు చెప్పేవారు ఎవ్వరూ లేరు," గుడ్ల నీళ్ళు కుక్కుకుంటూ అంది ఆమె. ఎలుగుబంటి ఏం మాట్లాడలేదు.

కాసేపు ఊరుకుని కల్పవల్లి మళ్ళీ "ఈ పక్కగదిలో రాత్రిళ్ళు ఎవరో మనిషి వచ్చి పడుకుంటున్న అలికిడి అవుతోంది. ఎవరో నీకు తెలుసా?" అని అడిగింది. "నువ్వు ఇటువంటి ప్రశ్నలు అడగకూడదు. కొన్నాళ్ళు పోయాక నీకే సంగతంతా తెలుస్తుంది," అంది ఎలుగుబంటి. "ఎలుగుబంటి చాలా మంచిది," అనుకుంది కల్పవల్లి. అయినా కూడా దాని సంగతి ఏమిటో తెలుసుకోవాలనే కుతూహలం ఎక్కువయింది ఆమెకి.

కల్పవల్లి వెనకటికన్నా విచారంగా ఉంటోంది. పక్క గదిలో ఎవరు పడుకుంటున్నారన్న ఆలోచన తప్ప వేరే ఆలోచన లేదు ఆమెకి. ఎవరు వస్తున్నారు? ఎవరు? ఎవరు? ప్రతినిమిషం అదే ఆ అమ్మాయిని వేధిస్తున్న సమస్య. చాలా కాలంపాటు ఆ విషయం గురించి ఎలుగుబంటిని అడగలేదు. చివరికి ఆగలేక పోయింది.

ఒక రోజున అర్ధరాత్రి లేచి, దీపం పుచ్చుకుని పక్కగదిలోకి వెళ్ళింది. ఆ గదిలో మంచం మీద ఒక అందమైన రాజకుమారుడు నిద్ర పోతున్నాడు.

కల్పవల్లి ఎప్పుడూ అంత అందమైన పురుషుణ్ణి చూడలేదు. ఎంతో విలువైన వస్త్రాలు ధరించి ఉన్నాడు. మెల్లిగా మంచం దగ్గరికి వెళ్ళింది ఆమె. అతని నుదురు మీద ముద్దుపెట్టుకుంది. కల్పవల్లి ఆ రాజకుమారుడిని ఒంగి ముద్దు పెట్టుకుంటూండగా ఆమె చేతిలో ఉన్న కొవ్వొత్తినుంచి మూడు చుక్కలు కారి అతని చొక్కామీద పడ్డాయి. దాంతో అతనికి మెలుకువ వచ్చింది. లేచి



చూసే సరికి తనగదిలో కల్పవల్లి!

"ఎంతపని చేశావు? ఈ ఒక్క సంవత్సరం ఆగితే నాకు ఆ రాక్షసి శాప విమోచనం అయ్యేదికదా. ఇన్నాళ్ళు నువ్వు చూపిన మంచితనమంతా వృథా అయిపోయింది. ఇప్పుడు నేను మళ్ళీ సూర్యునికి తూర్పున, చంద్రునికి పడమటన ఉన్న భవనానికి వెళ్ళిపోవాలి. ఆ భవనానికి వెళ్ళి 'మూరెడు ముక్కు ముసలి రాక్షసి' ని పెళ్ళి చేసుకోవాలి. ఇక ఇంతటితో మన సంబంధం అంతమయింది," అన్నాడు రాజకుమారుడు.

ఆ మాటలు విని కల్పవల్లి వెక్కి వెక్కి ఏడ్చింది. ఏడిస్తే మాత్రం లాభం ఏముంది? అతను వెళ్ళి తీరాలన్నాడు. "పోనీ, నేనుకూడా రావచ్చునా?" అని అడిగింది ఆమె. "రాకూడదు," అన్నాడు రాజకుమారుడు. "అయితే ఆ భవనానికి దారి చెప్పు. నేనే ఎలాగో వెతుక్కుంటూ వస్తాను," అంది కల్పవల్లి. "తోవ నాకూ

తెలియదు. ఆ భవనం సూర్యునికి తూర్పున, చంద్రునికి పడమటన ఉందని మాత్రం తెలుసు," అన్నాడు ఆ రాజకుమారుడు.

తెల్లవారి లేచిచూసేసరికి భవనం లేదు, రాజకుమారుడూ లేడు. కల్పవల్లి మాత్రం తన ఇంటినుంచి తెచ్చుకున్న చింకిగుడ్డల మూటతో మిగిలింది. ఒక మైదానం లాంటి ప్రదేశంలో ఉంది ఆమె. చుట్టూ అడవి. కొంతసేపు ఏడ్చి, చివరికి కళ్ళు తుడుచుకుని ఆ అడవిలో నడక సాగించింది.

చాలా దూరం నడిచింది. దారిలో ఒక చోట ఒక ముసలమ్మ తన గుడిసె ముందర కూర్చుని, బంగారపు బత్తాయి పండుతో బంతాట ఆడుకుంటోంది. కల్పవల్లి ఆ ముసలమ్మ దగ్గరికి వెళ్ళి "అవ్వా, సూర్యునికి తూర్పున, చంద్రునికి పడమటన ఉన్న రాక్షసి భవనానికి దారి తెలుసా నీకు?" అని అడిగింది.

"దారి నాకు తెలియదు. కొంత దూరంపోతే మా అక్కయ్య కనిపిస్తుంది. ఆవిడని అడుగు చెబుతుందేమో . . . ఈ బత్తాయి పండు నువ్వు తీసుకో, నీకు ఉపయోగపడుతుంది," అని ఆ ముసలమ్మ తన బంగారు బత్తాయి పండుని ఆమెకి ఇచ్చింది.

కల్పవల్లి అది పుచ్చుకుని మళ్ళీ నడక సాగించింది. కొంత దూరం పోయేసరికి మరో గుడిసె ముంగిట ఒక ముసలమ్మ బంగారు దువ్వెనతో తల చిక్కు తీసుకుంటోంది. కల్పవల్లి వెళ్ళి అవ్వని అడిగింది "రాక్షసి భవనానికి దారి తెలుసా?" అని.

"నాకు తెలియదు. ఇక్కడికి కొద్ది దూరంలో మా అక్కయ్య ఉంటోంది. ఆవిడని అడుగు – తెలిస్తే చెబుతుంది," అంటూ తన దగ్గరున్న బంగారపు దువ్వెనను ఆమెకి ఇచ్చింది. ఆ బంగారు దువ్వెనను కూడా తీసుకుని ఆమె మళ్ళీ ప్రయాణం సాగించింది.

కొంత దూరం పోయేసరికి ఒక గుడిసె ముందర కూర్చుని ఒక ముసలమ్మ బంగారు కదురుతో నూలు వడుకుతోంది. ఆవిడని కూడా కల్పవల్లి రాక్షసి

భవనానికి దారి తెలిస్తే చెప్పమని అడిగింది. ఆవిడ కూడా తనకు తెలియదు అంది. అయితే ఒక సలహా ఇచ్చింది. "తూర్పు పవనాన్ని అడిగితే అతను చెప్ప గలడేమో," అని తనదగ్గరున్న బంగారపు కదురుని ఆమెకి ఇచ్చింది.

తూర్పు పవనం ఇంటికి వెళ్ళడానికి చాలా రోజులు పట్టింది. కల్పవల్లి తూర్పు పవనాన్ని అడిగింది "రాక్షసి భవనానికి దారి తెలుసా?" అని. అందుకు తూర్పు పవనం "నేను ఆ భవనం గురించి విన్నాను కాని నేను అంత దూరం ఎప్పుడూ వెళ్ళలేదు. అందుచేత నాకు దారి తెలియదు," అన్నాడు.

"కానీ నువ్వు వస్తానంటే నా సోదరుడయిన పడమటి పవనం దగ్గరికి తీసుకుని వెళతాను," అని అన్నాడు తూర్పుపవనం. సరే వస్తానంది కల్పవల్లి. ఆమెని తన వీపుమీద కూర్చోబెట్టుకుని తూర్పుపవనం తన అన్న దగ్గరికి బయలుదేరాడు.

పడమటి పవనం ఇంటికి చేరగానే అతడినీ వెనుకటి ప్రశ్నే అడిగింది కల్పవల్లి. "నాకు తెలియదు. నేను అంత దూరం ఎప్పుడూ ఎగరలేదు. నా అన్న దక్షిణ పవనం నాకంటే బలవంతుడు. అతనికి తెలుసేమో అడుగుదాం." పడమటి పవనం ఆమెని దక్షిణ పవనం వద్దకు తీసుకువెళ్ళాడు.

దక్షిణ పవనం కూడా "నాకు తెలియదు. ఉత్తర పవనం మా అందరి కన్నా బలవంతుడు. అతను అంతదూరం వెళ్ళగలిగి వుంటాడు. అక్కడికి వెళ్ళి అతన్ని అడుగుదాం," రమ్మని ఉత్తర పవనం వద్దకు తీసికెళ్ళాడు.

ఉత్తర పవనానికి కోపం ఎక్కువ. కల్పవల్లిని చూడగానే "ఎందుకు వచ్చావ్?" అన్నాడు గంభీరంగా. ఆమె హడలిపోయింది. మెల్లిగా "సూర్యునికి తూర్పున, చంద్రునికి పడమటన ఉన్న రాక్షసి భవనం నీకు తెలుసా?" అని అడిగింది ఆమె.

"నేను ఎప్పుడో చిన్నతనంలో అంతదూరం పోయాను. కానీ ఇప్పుడు వయసు మళ్ళిపోయింది. అంతదూరం ఎగరగలనో లేదో అనుమానం. అయినా నువ్వు అడిగావు కాబట్టి ప్రయత్నించి చూస్తాను. నా బలాన్ని అంతా ఉపయోగించి

ఎత్తుగా, త్వరగా ఎగురుతాను. నీకు భయం లేదుకదా," అన్నాడు ఉత్తర పవనం. "నాకేం భయంలేదు," అంది కల్పవల్లి.

మర్నాడు ఉదయమే కల్పవల్లిని వీపుమీద కూర్చోబెట్టుకుని బయలుదేరాడు ఉత్తర పవనం. ఆకాశంలో రివ్వుమని ఎగిరి పోతున్నాడు. అతన్ని చూస్తే ఇక ఆగడేమో అనిపించింది. నదులు, పర్వతాలు, లోయలు, పట్నాలు, పల్లెలు దాటి పోతున్నాడు. ఎంత దూరం వెళ్ళారో ఎవరికీ తెలియదు. ఉత్తర పవనం అలిసి పోతున్నాడు. క్రమ క్రమంగా కిందకి వచ్చేస్తున్నాడు. సముద్రం మీద నుంచి ఎగురుతున్నాడు. సముద్రపు అలలు అతని పాదాలకు తగులుతున్నాయ్. "భయం వేస్తోందా?" అని అడిగాడు ఆమెని. ఆ అమ్మాయి భయపడటం లేదు. ఎంత త్వరగా గమ్యస్థానాన్ని చేరుకుంటే అంత మంచిది అని అనుకుంటోంది ఆమె.

అయితే, సముద్రందాటి వాళ్ళు భూమి మీదకు వచ్చేశారు. దూరం నుంచి రాక్షసి భవనం కనిపిస్తోంది. ఉత్తర పవనం ఎలాగో ఓపిక పట్టి ఆమెని భవనం ముందు దించాడు.

పగలంతా భవనం ముందే కూర్చుంది కల్పవల్లి. భవనంలో ఎక్కడా మనుషులున్న అలికిడి లేదు. చీకటి పడుతోంది. ఏం తోచక తన దగ్గరున్న బంగారు బత్తాయి పండుతో ఆడుకోవడం మొదలుపెట్టింది. దాంతో భవనం లోపలి నుంచి 'మూరెడు ముక్కు రాక్షసి' బయటికి వచ్చింది. "నీకు ఏం కావాలో చెప్పు. ఆ బత్తాయి పండు నాకు ఇచ్చేస్తే నీకు ఏం కావాలో అదిస్తాను," అంది రాక్షసి.

"నేను ఈ బత్తాయి పండుని అమ్మదలచుకోలేదు. కానీ రాజకుమారుడిని కలుసుకోనిస్తే పండు నీకు ఇస్తాను," అంది కల్పవల్లి. అలాగే కలుసుకుందువు గాని అంటూ గబుక్కున చేతిలోని పండుని లాగేసుకుంది రాక్షసి.

ఆమెని తన భవనంలోకి అడుగు పెట్టనిచ్చేముందు రాజకుమారుడికి మత్తుమందు కలిపి ఒక పానీయం ఇచ్చింది. తీరా కల్పవల్లి వెళ్ళేసరికి రాజకుమారుడు నిద్రపోతున్నాడు – పలకడు, ఉలకడు. అప్పుడు రాక్షసి వచ్చి

ఆమెని భవనం నుంచి బయటికి గెంటేసింది.

ఆ మరునాడు కూడా అలాగే జరిగింది. పగలంతా భవనంలో ఏవిధమైన అలికిడీ లేదు. రాత్రి అయేసరికి కల్పవల్లి బంగారు దువ్వెనతో తల దువ్వుకో సాగింది. వెంటనే 'మూరెడు ముక్కు రాక్షసి' వచ్చి ఆ దువ్వెనను తనకి అమ్మమంది.

"ఎంత ధనం ఇచ్చినా సరే దీన్ని అమ్మను. కానీ నా రాజకుమారుడిని కలుసుకోనిస్తే ఇస్తాను," అంది ఆమె. ఈ సారి కూడా ఆమె వెళ్ళేసరికి రాజకుమారుడికి స్పృహలేదు. మళ్ళీ రాక్షసి వచ్చి ఆమెని బయటికి గెంటేసింది.

ఆ రాత్రి కొందరు నౌకర్లు రాజకుమారుడితో చెప్పారు – రెండు రోజుల నుండి ఒక అమ్మాయి అతన్ని చూడటానికి వస్తోందనీ, ఆ సమయానికి అతనికి స్పృహలేకుండా రాక్షసి మత్తుమందు ఇస్తోందనీ. అంచేత ఆ మర్నాడు రాక్షసి ఇచ్చిన పానీయాన్ని రాజకుమారుడు రహస్యంగా అవతల పారబోశాడు.

చీకటి పడగానే కల్పవల్లి బంగారు కదురుతో నూలు వడకడం ప్రారంభించింది. రాక్షసి వెళ్ళి దాన్ని తనకి అమ్మమంది. ఆమె ఎప్పటిలాగే రాజకుమారుడిని చూపించమంది. ఈసారి ఆమె వెళ్ళేసరికి రాజకుమారుడు మెలకువగానే ఉన్నాడు. ఆమెకి అపరిమిత ఆనందం కలిగింది. తను అక్కడికి ఎలావచ్చిందీ – జరిగినదంతా పూసగుచ్చినట్లు చెప్పి ఆమె వెక్కి వెక్కి ఏడ్చింది.

"నీకేం పరవాలేదు. రేపు రాక్షసికీ నాకూ వివాహం జరగనున్న రోజు. రేపు చూడు దాన్నెలా పరాభవిస్తానో! నువ్విక్కడికి మంచి సమయానికే వచ్చావు," అని ఓదార్చి, ధైర్యం చెప్పి పంపించాడు రాజకుమారుడు. ఆమె మళ్ళీ భవనం ముంగిట పడుకుంది.

ఆ రోజు పెళ్ళిరోజు. కాని పగలు ఆ రాక్షసులు బయటికి రారు. సూర్యరశ్మి తగిలిందంటే నాశనమయి పోతారు. వాళ్ళు ఈ లోకంలో రాత్రిళ్ళే మసులుతూ ఉంటారు. అంచేత వివాహం రాత్రే ఏర్పాటయింది.

చీకటి పడగానే రాజకుమారుడు మూరెడు ముక్కు రాక్షసితో ఇలా అన్నాడు: "పెళ్ళి చేసుకునే ముందు నేను పెళ్ళికూతుర్ని పరీక్షించాలి. ఇవిగో,

నా చొక్కామీద మూడు కొవ్వొత్తి మరకలున్నాయి. ఆ మరకలు పోగొట్టగలిగితే నేను పెళ్ళి చేసుకుంటాను," అన్నాడు.

"ఓశ్! ఇంతేనా!" అంది రాక్షసి. ఆ చొక్కాని ఉతకడం ప్రారంభించింది. ఉతుకుతున్న కొద్దీ ఆ మరకలు పెద్దవవుతున్నాయి గాని బట్ట శుభ్రపడటం లేదు. అప్పుడు రాక్షసి గుగ్గిలం మంత్రించి పొగ వేసింది. అమాంతం రకరకాల రాక్షసులు అక్కడ పుట్టుకొచ్చారు. వాళ్ళంతా రాజకుమారుడి చొక్కా ఉతకడంలో మూరెడు ముక్కు రాక్షసికి సహాయం చేశారు. ఎన్ని చేసినా మరకలు పోలేదు. పైగా బట్టంతా మురికి అయిపోయింది.

రాజకుమారుడు పక పక నవ్వాడు. "మీరెవ్వరూ నన్ను పెళ్ళి చేసుకోవడానికి తగరు. చూడండి! ఈ బట్టను శుభ్రపరచగల వ్యక్తిని రప్పిస్తాను," అని చెప్పి "కల్పవల్లీ!" అని ఎలుగెత్తి పిలిచాడు. రాజకుమారుడి కేక విని కల్పవల్లి లోపలికి పరుగెత్తుకుంటూ వచ్చింది. రాజకుమారుడు తన చొక్కా ఆమె చేతికి ఇచ్చి ఉతకమన్నాడు. క్షణంలో సునాయాసంగా శుభ్రపరిచింది. మంచులా మిల మిల మెరుస్తోంది చొక్కా. "ఈమే నాకు తగిన భార్య," అన్నాడు రాజకుమారుడు సగర్వంగా.

రాక్షస జనం అంతా కూడా రాజకుమారుడి మీద కలియబడ్డారు. మెల్లిగా తెల్లవారింది. సూర్యకిరణాలు కిటికీ లోంచి ప్రసరిస్తున్నాయ్. ఆ కిరణాలు మూరెడు ముక్కు రాక్షసి మీదకి ప్రసరించగానే నీటి బుడగలా మాయమయింది. ఆ రాక్షసితో పాటు మిగిలిన రాక్షసులు కూడా మాయమయారు.

రాజకుమారుడు, కల్పవల్లీ ఆ భవనాన్ని విడిచి వెళ్ళిపోయారు.

(నార్స్ జానపద గాథ)

# సస్యసుందరి

అనగా అనగా ఒక ఊళ్ళో ఒక రాజుండేవాడు. ఆ రాజుకి పన్నెండుమంది కొడుకులు. వాళ్ళంతా పెరిగి పెద్దవాళ్ళు అయ్యారు.

తండ్రి ఒకసారి వాళ్ళనందరినీ దగ్గరికి పిలిచి "మీ అందరికీ పెళ్ళి ఈడు వచ్చింది. మీరు దేశదేశాలు తిరిగి చక్కని పిల్లల్ని పెళ్ళాడండి," అన్నాడు.

అయితే, రాజు కొడుకులతో మరో సంగతి కూడా చెప్పాడు. వాళ్ళు పెళ్ళి చేసుకునే పిల్లలు ఒక్క రోజులో నూలువడికి, దాన్ని నేసి, దాంతో ఒక చొక్కా కుట్టగలగాలి. ఆ విధంగా చెయ్యలేనివాళ్ళు తన కోడళ్ళు కావడానికి వీలు లేదని కచ్చితంగా చెప్పాడు రాజు. సరేనని రాజకుమారులు పెళ్ళి కూతుళ్ళను వెతకడానికి బయలుదేరారు.

వాళ్ళు కొంత దూరం ప్రయాణించి, అలిసిపోయి ఒకచోట విశ్రమించారు. ఇంతలో మొదటి పదకొండుగురు రాజకుమారులకీ ఒక ఆలోచన తట్టింది. ఆఖరు వాడయిన జయశేఖరుడు ఎందుకూ పనికి రాని దద్దమ్మ కాబట్టి వాడిని తమతో తీసుకు వెళ్ళకూడదని నిశ్చయించుకున్నారు. ఆ తరువాత జయశేఖరుని దారిలో వదిలేసి మిగిలిన అన్నలంతా కలిసి వెళ్ళిపోయారు. పాపం! జయశేఖరుడు! గుర్రాన్ని ఓచెట్టుకు కట్టేసి, తను ఆ గడ్డిమీద కూర్చుని ఏం చెయ్యాలో తోచక ఏడుస్తున్నాడు.

కొంత సేపయిన తర్వాత ఏమయింది! కొంచెం దూరంలో గడ్డిలోంచి ఏదో తెల్లటి పదార్థం బయటికి వస్తున్నట్లు కనిపించింది జయశేఖరుడికి. అతడు దానికేసి తెల్లబోయి నోరు తెరుచుకుని చూస్తున్నాడు. క్రమంగా ఆ తెల్లని పదార్థం అతని దగ్గరికి వచ్చింది. తీరాచూస్తే అది ఒక చక్కని చిన్నపిల్ల! ఎంతో ముద్దొచ్చేలా ఉంది ఆ చిన్న పిల్ల!

ఆ అమ్మాయి అతని దగ్గరికి వచ్చి "నాతో మా భవనానికి వస్తావా?

మా సస్యసుందరిని చూస్తావా," అని సన్నని గొంతుతో అడిగింది. "సరే!" అని ఆ రాజకుమారుడు ఆ అమ్మాయితో కూడా బయలుదేరాడు.

ఒక దిబ్బ మీద గడ్డి ఒత్తుగా మొలిచి ఉంది. ఆ గడ్డిపువ్వుల పాన్పుమీద ఒక ముద్దుల గుమ్మ కూర్చుని ఉంది. ఎంతో నాజూకుగా, ముచ్చటగా, చందనపు బొమ్మలా ఉంది చూడటానికి. రాజకుమారుడిని చూసి చిరునవ్వు నవ్వింది. "ఎక్కడికి వెళుతున్నావు? ఏం పనిమీద వెళుతున్నావు?" అని అడిగింది.

తను ఒక రాజకుమారుడిననీ, తనకి ఇంకా పదకొండుగురు అన్నలున్నారనీ, తమ తండ్రి అందరికీ తలా ఒక గుర్రం ఇచ్చి, ప్రపంచమంతా తిరిగి మంచి పెళ్ళి కూతుళ్ళను చూసుకుని రమ్మన్నాడని చెప్పాడు. పైగా తన ప్రతి కోడలూ కూడా ఒక్క రోజులో నూలు వడికి, నేసి, ఆ బట్టతో ఒక చొక్కా కుట్టగలిగి ఉండాలి అన్న నిబంధనను తన తండ్రి పెట్టాడని రాజకుమారుడు సస్యసుందరితో చెప్పాడు.

అంతేకాదు, "అలా చెయ్యడం నీకు చేతనయితే, నన్ను వివాహం చేసుకోవడానికి అంగీకరిస్తే నేను ఒక్క అడుగుకూడా ముందుకి వెయ్యను," అని కూడా చెప్పాడు జయశేఖరుడు.

ఇదంతా విని సస్యసుందరి నూలు వడకడం ప్రారంభించింది. కొద్ది సేపట్లోనే దాన్ని నేసి చొక్కా కుట్టేసింది. తీరాచూస్తే అది బుల్లి చొక్కా!

ఆ చొక్కాని తీసుకుని జయశేఖరుడు ఇంటికి తిరిగి వచ్చాడు. అప్పటికి అన్నలు ఇంకా తిరిగి రాలేదు. తను తెచ్చిన చొక్కాను తండ్రికి చూపించాడు. తండ్రికి చూపిస్తున్నప్పుడు రాజకుమారుడు ఎంతో సిగ్గు పడ్డాడు. చొక్కా చిన్నదయినా చక్కగా ఉంది. రాజు ఆ అమ్మాయి పనితనాన్ని మెచ్చుకున్నాడు. వెంటనే ఆ అమ్మాయిని ఇంటికి తీసుకురమ్మని కూడా చెప్పాడు. జయశేఖరుడి ఆనందానికి మేరలేదు. తన చిన్న పెళ్ళికూతురు ఉన్న చోటికి వెళ్ళడానికి అతనికి ఎంతో సేపు పట్టలేదు.

సస్యసుందరితో "నిన్ను నాగుర్రంమీద మా ఇంటికి తీసుకుని వెళతాను,"

అని చెప్పాడు. అయితే సుందరి మాత్రం గుర్రంమీద రావడానికి ఒప్పుకోలేదు. తను ఒక వెండి చెంచాలో కూర్చుని ప్రయాణిస్తాను అంది. ఆ చెంచాను మోయడానికి తెల్లని చెవుల పిల్లులు రెండు ఉన్నాయి.

రాజకుమారుడు గుర్రంమీదా, సస్యసుందరి వెండి చెంచాలోనూ కూర్చుని ప్రయాణం సాగించారు. రాజకుమారుడు ఎంతో జాగ్రత్తగా దారి పక్కగా గుర్రాన్ని నడిపించుకుంటూ వెళుతున్నాడు.



కొంత దూరం అలా పోయిన తర్వాత దారిలో ఒక పెద్ద చెరువు ఎదురయింది. ఆ నీరు చూసి రాజకుమారుడి గుర్రం బెదిరి ఆ సుందరి చెంచాను చెదర కొట్టింది. దాంతో సుందరి ఎగిరి నీటిలో పడిపోయింది. జరిగిన ప్రమాదానికి రాజకుమారుడు ఎంతో విచారించాడు. అయితే ఆమెను ఎలా రక్షించాలో తెలియక బాధపడ్డాడు.

కొంత సేపు అయ్యాక ఒక విచిత్రమయిన మనిషి కనిపించాడు – అతని నడుము వరకూ మామూలు మనిషి ఆకారం ఉంది. నడుము కిందనుంచీ చేప ఆకారం ఉంది. ఆ మనిషి నీటిలోనుంచి సస్యసుందరిని తీసుకొని బయటికి వచ్చాడు. ఆశ్చర్యం! సస్యసుందరి వెనుకటిలా లేదు, ఇప్పుడు యుక్తవయస్సు వచ్చిన ఆడపిల్లలా ఉంది. ఎంతో పొడవుగా, వెనుకటికన్నా అందంగా కనిపిస్తోంది. అంచేత ఈసారి జయశేఖరుడు సస్యసుందరిని గుర్రం మీద కూర్చోబెట్టుకుని ఇంటికి తీసుకుని వెళ్ళాడు.

జయశేఖరుడు సస్యసుందరిని తీసుకుని ఇంటికి వెళ్ళే సరికి అన్నలంతా తమతమ పెళ్ళి కూతుళ్ళతో సహా వచ్చిఉన్నారు. అయితే వారు తమ తండ్రి మాట ప్రకారం నడవలేదు. ఒకరోజులో నూలు వడికి, బట్టనేసి, చొక్కా కుట్టగల సామర్థ్యం వాళ్ళలో ఎవరికీ లేదు. జయశేఖరుని దద్దమ్మ అనుకుని వదిలి పెట్టి వెళ్ళారు. కానీ వాళ్ళు తెచ్చుకున్న పెళ్ళి కూతుళ్ళు అందరూ కురూపులే.

రాజు ఒక్కమారు అందరు కోడళ్ళనీ చూశాడు. మొదటి పదకొండుగురు కొడుకులూ తెచ్చిన పిల్లలు అందరూ సస్యసుందరికి దాసీ జనంలా ఉన్నారు. పైగా తనమాట లెక్కచెయ్యనందుకు రాజుకు మొదటి పదకొండుగురు కొడుకుల మీద కోపం వచ్చింది. జయశేఖరుని వినయ విధేయతలకీ, తెలివి తేటలకీ మెచ్చుకుని తన తర్వాత జయశేఖరుడే రాజు అవుతాడని ప్రజలందరికీ తెలియచేశాడు. జయశేఖరుడికీ, సస్యసుందరికీ ఎంతో వైభవంగా వివాహం జరిగింది.

(నార్స్ జానపద గాథ)

# వింత ఉంగరం

"చూడు! నిన్ను ఎంత అదృష్టవంతురాలుగా చేస్తానో," అన్నాడు గోపి ఒక రోజున తల్లితో. ప్రపంచం అంతా తిరిగి బోలెడు ధనం సంపాదించి తీసుకుని వస్తానని కూడా చెప్పాడు. కొడుకుని విడిచి పెట్టడానికి తల్లి మనస్సు అంతగా ఇష్టపడలేదు.

"నేను వెళితే మాత్రం ఏమిటమ్మా? నేను వచ్చేవరకు చెల్లి నిన్ను ఎంతో జాగ్రత్తగా చూస్తూ ఉంటుంది. నీకేం భయంలేదమ్మా. త్వరలోనే తిరిగి వచ్చేస్తాను," అని తల్లికి ధైర్యంచెప్పి గోపి ఇల్లు వదలిపెట్టి దేశాటనకు బయలుదేరాడు.

అలా వెళ్ళగా వెళ్ళగా ఒక పట్నం వచ్చింది. పట్నానికి వెళితే మాత్రం బీదవాళ్ళు కనిపించకుండా ఉంటారా? ఆ పట్నంలో అతన్ని మొట్టమొదట ఆకర్షించింది ఒక ముసలి అవ్వ. పాపం ఆ అవ్వ నడుము బాగా వంగి పోయింది. ఒక పెద్దనూనెజాడీని మోసుకుపోతోంది.ఆ అవ్వను చూస్తే గోపికి జాలేసింది.

గోపి మంచితనానికి అవ్వ చాలా సంతోషించింది. "చాలా అలిసి పోయావు నాయనా, కాస్సేపు విశ్రమిస్తావా ఇక్కడ? నేను బీదదాన్ని, నాది పూరిగుడిసె. అయినా అభ్యంతరం లేకపోతే కొంతసేపు విశ్రాంతి తీసుకో నాయనా," అంది ఎంతో ఆప్యాయంగా.

"నేను చాలాదూరం పోవాలి. అయినా రెండు మూడు నిమిషాలపాటు ఈ చల్లని ప్రదేశంలో విశ్రాంతి తీసుకోవడానికి నాకు అభ్యంతరం లేదు," అని గోపి పొయ్యి దగ్గర కూర్చుని ఆ ఇంట్లో ఉన్న కుక్కతోటీ, పిల్లితోటీ ఆడుకోవడం మొదలుపెట్టాడు.

"ఎందాక వెళుతున్నావు నాయనా?" అంది అవ్వ. "ప్రపంచంలోకి," అని సమాధానం ఇచ్చాడు గోపి. "ప్రపంచంలో అనేక చిత్రవిచిత్రాలు చూస్తావు. కాని దారి మాత్రం సాఫీగా ఉండదు. ఒంటరిగానే వెళుతున్నావా? ఎవరయినా

స్నేహితుడు తోడుగా ఉన్నాడా?" అని అడిగింది అవ్వ. "తోడెవ్వరూ లేరు," అన్నాడు గోపి.

"అయితే నా కుక్కనీ, పిల్లినీ కూడా నీతో తీసుకుని వెళ్ళు. అవి రెండూ కూడా చాలా తెలివైనవి. దారిలో కాస్త తోస్తుంది నీకు, ఏమంటావు?" అందిఅవ్వ. "అంతకంటేనా అవ్వా? తప్పకుండా తీసుకు వెళతాను," సంతోషంతో అన్నాడు గోపి.

"ఒక పొట్ట బదులు మూడు పొట్టలు నిండాలిప్పుడు. ఒక్కొక్కప్పుడు గుక్కెడు మంచినీళ్ళు కూడా దొరకవు ఈ పాడు ప్రపంచంలో! అటువంటిది ఏదైనా సంభవించినప్పుడు సహాయపడే వస్తువు నీకు ఒకటిస్తాను," అంటూ అవ్వ అలమారు దగ్గరికి వెళ్ళింది. అందులోనించి ఒక ఉంగరం తీసుకొచ్చి గోపికి ఇచ్చింది.

"నీకు ఏదైనా అత్యవసరమని తోచినప్పుడు ఈ ఉంగరాన్ని వేలుకి పెట్టుకుని ఒకసారి తిప్పితే కార్యసాఫల్యం అవుతుంది. దీన్ని ఎవరికీ ఇవ్వకు. దీన్ని పోగొట్టుకోకు. లేకపోతే అసహాయస్థితిలో పడిపోతావు. అంతేకాదు ఈ ఉంగరం ఎవరైనా చెడ్డవాళ్ళ చేతుల్లో పడవచ్చు. జాగ్రత్త!" అని చెప్పింది అవ్వ.

'అవ్వ చెప్పింది అంతా విని అవ్వ చాదస్తపు మనిషి,' మనస్సులో నవ్వుకుంటూ అనుకున్నాడు గోపి. అదేదో మామూలు ఉంగరం అయివుంటుందని అనుకున్నాడు.

అవ్వతో "నాకు ఎందుకులే అవ్వా. నువ్వు అట్టిపెట్టుకో," అన్నాడు. అయితే, అవ్వ ఊరుకోలేదు. తీసుకోమని బలవంతపెట్టింది. ఇంక చేసేదిలేక ఉంగరాన్ని జేబులో వేసుకుని అవ్వ దగ్గర శలవు పుచ్చుకుని బయలు దేరాడు. అతనితోపాటు కుక్క, పిల్లీ ఉత్సాహంతో పరుగుతీశాయి.

అలాకొన్ని మైళ్ళు నడిచేసరికి చీకటి పడింది. ఆ రాత్రికి ఎక్కడయినా పడుకునేందుకు చోటు దొరుకుతుందేమోనని చూశాడు గోపి. దగ్గరలో ఎక్కడా ఇళ్ళు కనిపించలేదు. అదంతా ఓ పెద్ద అడవి.

"సరే, ఇంతరాత్రి పూట ఇంకొకరి ఇంటి తలుపులు కొట్టేకన్నా ఈ అడివిలోనే ఎక్కడో అక్కడ పడుకుంటే మంచిది," అనుకున్నాడు. ఓ పెద్ద చెట్టు కింద శుభ్రం చేసుకుని అక్కడ విశ్రమించారు ముగ్గురూ. అయితే గోపికి మాత్రం నిద్ర పట్టలేదు. బాగా ఆకలి వేస్తోంది. ఇక నిద్ర ఎలా పడుతుంది? 'తినడానికి ఏవయినా ఉంటే ఎంత బాగుండును, పడుకోవడానికి చక్కటి ప్రదేశం కూడా దొరికింది!' అనుకుంటూ గోపి యధాలాపంగా జేబులో చెయ్యి పెట్టేసరికి చేతికి ఉంగరం తగిలింది. గోపికి అవ్వ చెప్పిన సంగతి గుర్తుకొచ్చింది.

ఉంగరాన్ని తీసి వేలికి పెట్టుకున్నాడు. ఇటూ అటూ తిప్పుతూ 'నాముందు ఒక విస్తరినిండా భోజనం ఉంటే ఎంత బాగుంటుంది!' అనుకున్నాడు. ఆశ్చర్యం! అవ్వ చెప్పినట్లుగానే జరిగింది.

ఒక్క క్షణంలో అతని ఎదుట ఒక విస్తరి, ఆ విస్తరినిండా భోజనం సిద్ధంగా ఉంది. తన కళ్ళని తనే నమ్మలేక పోయాడు. కుక్క, పిల్లి తోకలాడించుకుంటూ విస్తరి ముందుకు వచ్చాయి. అయినా నమ్మకం తోచక ముట్టుకుని వాసన చూశాడు. పోపు వాసన ఘుమ ఘుమలాడుతోంది. గోపికి నోరూరింది. తన నేస్తాలకు కొంతపెట్టి మిగిలింది తను తిన్నాడు. భోజనం చేసేసరికి ప్రాణం లేచి వచ్చింది. గోపి ఆనందానికి మేరలేక పోయింది.

ఆ ఉంగరం ఇంత మహత్తు కలదని ఊహించనయినా ఊహించలేదు. అవ్వ మాటలను ముందు అతను నమ్మలేదు.'అవ్వ నిజంగా ఎంత మంచిది! ఆవిడ ఒక దేవత అయి వుండాలి,' అనుకున్నాడు గోపి. సరే, కడుపు నిండింది.

ఉంగరం తన వేలికే ఉంది. తను ఏది కోరుకుంటే అది లభిస్తుంది. ఇంకా ఏం కోరుకోవాలో ఆలోచించాడు. బంగారం, వెండి, తన తల్లికి, చెల్లెలికీ మంచి మంచి నగలూ, బట్టలు. గుర్రాలు, ఏనుగులు, బళ్ళు, కత్తులు, తుపాకులూ ఇలా ఎన్నెన్నో అనుకున్నాడు. ఒక్కక్షణంలో అతను అనుకున్నవన్నీ అతని ముందు ప్రత్యక్షమయ్యాయి. అవన్నీ చూసి 'ఏమిటింత తెలివి తక్కువగా ప్రవర్తించాను! ఇవన్నీ నాకు ఇప్పుడు ఎందుకు? అందుకే కాబోలు అదృష్టం అకస్మాత్తుగా

లభిస్తే ఉన్న తెలివి తేటలు కూడా శూన్యమవుతాయని అంటారు,' అనుకున్నాడు. 'ఇవన్నీ నాకు అక్కర్లేదని,' మళ్ళీ ఉంగరాన్ని తిప్పాడు. అన్నీ ఒక్క క్షణంలో మాయమయిపోయాయి. 'అమ్మయ్య' అంటూ ప్రశాంతంగా నడుం వాల్చాడు. కుక్క అతని తల దగ్గరా, పిల్లి కాళ్ళ దగ్గరా పడుకున్నాయి.

మరునాడు పొద్దున్నే లేచాడు. కుక్క, పిల్లీ కూడా లేచి అతని పాదాలముందు కూర్చున్నాయి. అలా ఉదయమే లేచి జనసంచారంలేని ఒక అడవిలో కూచున్నప్పుడు కలిగిన ఆనందాన్ని ఇది వరకు ఎప్పుడూ అనుభవించ లేదు.

గుర్రాలకోసం, జట్కాలకోసం మనసు పడుతున్నాడా అతనిప్పుడు? గుర్రాలని తలచుకొనేటప్పటికి గోపికి నవ్వొచ్చింది. దేవుడిచ్చిన రెండు కాళ్ళూ రాజుగారి సవారీ కన్నా మంచివి అనుకున్నాడు. మైదానాలు, కాలువలు, కొండలు, లోయలూ అన్నిటినీ పరికిస్తూ కులాసాగా తన నేస్తాలతో కలిసి ఆ అడవిలో పయనం సాగించాడు గోపి.

చాలా దూరం నడిచారు. ఒక చోట ఒక పెద్ద భవనం కనిపించింది. అది రాజుగారి భవనంలాగా ఉంది. ఆ భవనం మేడ మీద గది కిటికీలోంచి ఒక అందమైన అమ్మాయి బయటికి తొంగి చూస్తోంది.

గోపి ఆ దారిని పోతూంటే అతనికేసి చూసి చిరునవ్వు నవ్వింది. గోపికి ఆ అమ్మాయిని పలకరించాలని అనిపించింది. అయినా తనవంటి బీదకుర్రాడితో అటువంటి అపురూప సౌందర్యవతి, ధనలక్ష్మీ మాట్లాడుతుందా అనుకుని ఒక నిట్టూర్పు విడిచాడు. మనసులో 'నాకేకనక,' అని అనుకోబోయే సరికి చటుక్కున ఉంగరం మాట గుర్తుకొచ్చింది. ఉంగరం వేలినే ఉంది. ఇకనేం! దాన్ని ఇటూ అటూ తిప్పుతూ 'నాకు ఒక పెద్ద భవనం కావాలి. అది సుందరి భవనం కన్నాకూడా అందంగానూ, సౌకర్యంగానూ ఉండాలి. అంతేకాదు ఈ భవనం ఎదుటనే నా భవనంకూడా ఉండాలి,' అనుకున్నాడు.

కన్నుమూసి తెరిచేటంతలో అతను ఆ రోడ్డుమీద లేడు. ఒక పెద్ద

భవనంలో ఉన్నాడు. ఎదురుగుండా ఉన్న భవనం కిటికీ లోనించి ఆ సుందరి అతని వైపు చూస్తూ ఇంకా చిరునవ్వు నవ్వుతూనే ఉంది.

గోపికి భవనం అయితే వచ్చింది. కాని తను మాత్రం పూర్వం లాగే చింకి గుడ్డలతో ఉన్నాడు. ఆ మాసిపోయిన బట్టలు చూసుకుని గోపి సిగ్గు పడ్డాడు. వెంటనే ఉంగరం తిప్పుతూ 'నాకు రాచ దుస్తులు కావాలి,' అనుకున్నాడు. మంచి మంచి దుస్తులు వచ్చాయి. అతన్ని ముస్తాబు చెయ్యడానికి నౌకర్లు కావాలనుకునే సరికి ఒక్క క్షణంలో వాళ్ళూ ప్రత్యక్షమయ్యారు. గోపికి భోజన సదుపాయాలన్నీ నౌకర్లే చూశారు. గోపి ఇప్పుడో గొప్ప రాజకుమారుడిలా కనిపిస్తున్నాడు.

'ఇప్పుడు నాతో మాట్లాడుతుంది కాబోలు,' అనుకున్నాడు గోపి. అనుకున్నట్లుగానే ఆ సుందరి తల్లిదండ్రులు గోపి భవనానికి వచ్చి వాళ్ళింటికి రమ్మని గోపిని ఆహ్వానించారు. వాళ్ళు గోపితో స్నేహం కలుపుకోవడానికి ప్రయత్నించారు. గోపి భవనంలోని ప్రతి వస్తువూ వారిని ఆకర్షించింది. వాళ్ళు గోపిని ఎంతో పొగిడారు. వాళ్ళెంతో మంచివాళ్ళు అనుకున్నాడు గోపి.

మరునాడు వాళ్ళ ఇంటికి వెళ్ళాడు. వెళ్ళగానే భార్యా భర్తలిద్దరూ గోపిని ఎంతో ఆదరించి వాళ్ళ అమ్మాయిని పిలిచి అతనికి పరిచయం చేశారు. త్వరలోనే కళ్యాణికి గోపి స్నేహితుడు అయ్యాడు.

ఒక రోజు రాత్రి కళ్యాణి తల్లిదండ్రుల దగ్గర పెళ్ళి ప్రస్తావన తెచ్చాడు గోపి. గోపి తమకు అల్లుడయితే తమకి ఎంతో లాభకరంకదా అని కళ్యాణి తల్లిదండ్రులు వివాహానికి వెంటనే అంగీకరించారు.

పెళ్ళిరోజున గోపితో సరదాగా కబుర్లు చెబుతూ కళ్యాణి "అంత అకస్మాత్తుగా భవనాన్ని ఎలా నిర్మించ గలిగావో చెప్పు," అని అడిగింది. గోపి అమాయకుడు. అతని హృదయం ఎంతో నిర్మలమయినది. అంచేత తన కాబోయే భార్య అడిగింది కదా అని తను ఇంటి దగ్గర నుంచి బయలు దేరినప్పటి నుండి జరిగింది అంతా పూసగుచ్చినట్లు చెప్పాడు.

"అయితే ఆ ఉంగరాన్ని ఎప్పుడూ మీ వేలికే పెట్టుకుంటారన్నమాట," అంది కళ్యాణి.

"పగలు, రాత్రి, మెలకువగా వున్నప్పుడు, నిద్రపోతున్నప్పుడు – ఎప్పుడూ నావేలికే ఉంటుంది," అన్నాడు గోపి.

కళ్యాణి తిన్నగా వెళ్ళి తల్లి చెవిలో ఈ రహస్యాన్ని ఊదింది. తల్లి ఏం చేసిందప్పుడు? రాత్రి భోజనాల వేళ గోపికీ, అతని కుక్కకీ, పిల్లికీ భోజనపదార్థంలో ఏదో మత్తుమందు కలిపి పెట్టింది. భోజనం చెయ్యడం పూర్తి అయిందో లేదో గోపి కునికి పాట్లుపడటం ప్రారంభించాడు. అప్పుడే కుక్క, పిల్లీ, గుర్రుపెట్టి నిద్రపోతున్నాయి."మీ అయ్యగారు అలిసిపోయి నిద్రపోయారు. తీసుకుని వెళ్ళి మీ భవనంలో పడుకోబెట్టండి," అని నౌకర్లతో చెప్పాడు కళ్యాణి తండ్రి.

గోపి నౌకర్లు గోపిని తమ భవనానికి తీసుకుపోయారు. కళ్యాణి కూడా వారి వెంట వెళ్ళింది. కళ్యాణి గోపి దగ్గరే కొంతసేపు కూచుని అతనికి బాగా నిద్ర పట్టాక అతని వేలికి ఉన్న ఉంగరాన్ని తీసుకుని తన భవనానికి వెళ్ళిపోయింది.

ఇంటికి వెళ్ళి ఉంగరాన్ని తన వేలికి పెట్టుకుని దాన్ని ఇటూ అటూ తిప్పుతూ 'గోపి భవనం ఎక్కడో మారుమూల మంచుతో కప్పబడిఉన్న ఎత్తయిన పర్వతాలమీద ఉండాలి,' అని కోరుకుంది. మరుక్షణంలో గోపీ భవనం కళ్యాణి భవనం ఎదుటలేదు.

మరునాడు గోపి నిద్రనుంచి లేచాడు. చలికి గజ గజ వణికిపోతున్నాడు. తను ఎక్కడున్నాడో తనకి తెలియ లేదు. తను మాత్రం తన భవనంలోనే ఉన్నాడు. కుక్క, పిల్లీ తన కాళ్ళదగ్గరే ఉన్నాయి. అయితే ఇంత చలి ఎక్కడనుంచి వచ్చింది? ఎదురుగా కళ్యాణి భవనం కనిపిస్తుందేమోనని లేచి వెళ్ళి కిటికీలోంచి బయటకు చూశాడు. కాని పరిసరాలన్నీ మారిపోయాయి. చుట్టూ పర్వత శిఖరాలు, మంచు, ఆకాశంతప్ప మరేమీ కనిపించడంలేదు. అతనికి అంతా అయోమయంగా ఉంది.

కోపంగా గంట కొట్టాడు. వంటవాడు వచ్చాడు. "ఏమిటి ఇదంతా?" అన్నాడు. "నాకేం తెలియదు బాబాయ్యా," అన్నాడు భయంతోనూ, చలితోనూ

బాగా వొణుకుతూ.

మిగిలిన నౌకర్లుకూడా తమకి ఏమీ తెలియదని అన్నారు. "ఇదంతా ఎలా జరిగింది? నాకు ఎవరయినా శత్రువులు ఉన్నారా? ఏమిటి ఇదంతా?" అంటూ వెర్రి కేకలు పెట్టాడు. ఇక అరిచి లాభంలేదని తెలుసుకుని ఉంగరం ఉపయోగిద్దామని అనుకున్నాడు.

అయితే ఉంగరం ఏదీ? అతను నిర్ఘాంతపోయాడు. ఉంగరం ఎలా మాయమయింది? దాన్ని దొంగిలించినవారు ఎవరు? ఆ క్రితం రోజు జరిగినదంతా గుర్తుకు తెచ్చుకోసాగాడు.

భోజనం చేస్తూంటే అతనికి బాగా నిద్ర వచ్చినట్లు, అతిథులెవ్వరినీ తను సాగనంప లేదన్నట్లు, కళ్యాణి తనదగ్గిరే ఉన్నట్లూ గుర్తుంది. ఉంగరం గురించి తెలిసిన వ్యక్తి ఒక్క కళ్యాణి మాత్రమే. అయితే కళ్యాణి అలా మోసం చేస్తుందా?

ప్రస్తుతం భవనం ఒక మంచు పర్వతం మీద ఉంది. ఆ పర్వతాన్ని దిగడం అసాధ్యం. దారీ తెన్నూ లేదు. దారి చేసుకుందామని ప్రయత్నిద్దామన్నా మనుషులు గడ్డకట్టుకుని పోతారు. లేకపోతే ఏ అగాధంలోనైనా పడిపోతారు.

భవనంలో రెండు రోజులకు సరిపడ ఆహారపదార్థాలు కూడా లేవు. తమ యజమాని పరిస్థితి గమనించి కుక్క, పిల్లీ దుఃఖించాయి. అయినా తమ దుఃఖాన్ని అణుచుకుని, గోపితో "అధైర్యపడవద్దు, మానవులు చెయ్యలేని పనులు మేం చెయ్యగలం. మాకు రెండు రోజులు గడువిస్తే వెళ్ళి ఆ ఉంగరాన్ని పట్టుకుని వచ్చి మీకు ఇస్తాం," అన్నాయి.

"ప్రస్తుతం మీ ఇద్దరే నాకు గతి," అని గోపి వాటికి బాగా తిండిపెట్టి సాగనంపాడు. అవి రెండూ బయలుదేరాయి. ఆ మంచు పర్వతంమీద ప్రయాణం ఎంత కష్టభూయిష్టం? ఒక్కొక్కప్పుడు జారిపోయాయి... దొర్లిపోయాయి... ఎక్కాయి... దిగాయి... చలికి వొణికిపోయాయి... అయినా పట్టుదల, ధైర్యం విడవలేదు. అలాగే ప్రయాణం చేసి చివరికి ఒక నది దగ్గరికి వచ్చాయి. అప్పుడు

కుక్క వీపుమీద పిల్లి కూర్చుంది. కుక్క ఈదుకుంటూ నదిని దాటింది.

వెతుక్కుంటూ వెతుక్కుంటూ చివరికి ఆ మోసగత్తె అయిన కళ్యాణి భవనానికి చేరుకున్నాయి. అక్కడికి చేరుకునే సరికి బాగా చీకటి పడిపోయింది. ఇంట్లో అందరూ నిద్రపోతున్నారు. అన్ని ద్వారాలు, కిటికీలూ మూసి ఉన్నాయి. ఒక్క వెనక దొడ్డి తలుపుకి మాత్రం పిల్లి దూరేటంత కన్నం ఉంది.

పిల్లి కుక్కతో ఇలా అంది: "నువ్విక్కడే కాపలాకాస్తూ ఉండు. నేను మేడమీదికి వెళ్ళి మనం వచ్చిన పని ఎలా జరుగుతుందో చూస్తాను," అని చెప్పి నెమ్మదిగా కళ్యాణి గది దగ్గరికి వెళ్ళింది. తీరా చూస్తే గది తలుపులు వేసివున్నాయి. తలుపుకి ఒక చిన్న రంధ్రంకూడా లేదు. 'ఎలాగ లోపలికి పోవడం?' పిల్లి ఆలోచిస్తోంది.

ఇంతలో అటువైపు ఒక ఎలుక చరచరా పరుగెత్తింది. ఆ చీకటిలో పిల్లి ఎలుకను పసికట్టింది. వెంటనే తన పంజాతో దాన్ని నొక్కిపట్టింది. తింటే ఎంత రుచిగా ఉంటుంది! పిల్లిని ప్రాణదానం చెయ్యమని కాళ్ళా వేళ్ళా పడి ఎలుక బతిమాలింది. పిల్లి మెత్తబడింది.

"అయితే సరే... కానీ నువ్వొక కార్యం సాధించాలి. ఏమిటంటే... నువ్వు ఆ గది తలుపుకి ఒక కన్నం చెయ్యాలి. నాకు ముఖ్యమైన పని ఒకటుంది," అంది పిల్లి. పాపం ఎలుక ప్రాణం నిలబెట్టుకోవడంకోసం అంతకష్టమైన పనికి ఒప్పుకుంది. తన బలాన్నంతా ఉపయోగించి తలుపుని కొరికింది... కొరికింది... పళ్ళు విరిగేదాకా కొరికింది... ఎలా అయితేనేం ఒక చిన్న రంధ్రం చెయ్యగలిగింది, కాని అది ఎంతో చిన్నది, అందులో తనే దూరలేదు. ఇక పిల్లిమాత్రం ఎలా దూరుతుంది?

"నీ దగ్గర ఎలుక పిల్లలు ఉన్నాయా?" అని అడిగింది పిల్లి. "ఓ ఏడో, ఎనిమిదో ఉన్నాయి. ఆఖరుది చాలా చిన్నది. ఎంత ముద్దుగా ఉంటుందో," అంది ఎలుక ఉత్సాహంతో. అయితే దాన్ని తీసుకురమ్మంది పిల్లి. ఒక్క క్షణంలో వెళ్ళి తన పిల్లను పట్టుకు వచ్చింది ఎలుక.

"ఇప్పుడు నువ్వు నీ బుద్ధికుశలతతో నీ తల్లి ప్రాణాల్ని రక్షించాలి. ఆ రంధ్రంలోనించి లోపలికి పోయి మంచం మీద పడుకున్న అమ్మాయి చేతి వేలికున్న ఉంగారాన్ని తీసుకురావాలి. నువ్వు తీయలేకపోతే వేలు నెమ్మదిగా కొరుకు – నిద్రలో ఆవిడే తీసేస్తుంది – దాన్ని తీసుకొచ్చి నాకు ఇవ్వు," అని ఆ ఎలుక పిల్లతో చెప్పింది పిల్లి.

ఒక్క నిమిషం పూర్తికాకుండానే ఆ ఎలుక పిల్ల లోపలికి పోయి తిరిగి బయటికి వచ్చేసింది. "ఆ అమ్మాయి వేలికి ఉంగరం లేదు," అని చెప్పింది పిల్లితో.

"అయితే ఆవిడ నోట్లో ఉంటుందది. ఆవిడ ముక్కులో తోక పెట్టి ఆడించు – ఆవిడే నోరు తెరుస్తుంది. ఆ ఉంగరం కిందపడగానే నువ్వు తీసుకుని వచ్చెయ్యి," అని పిల్లి చెప్పింది. ఎలుక పిల్ల మళ్ళీ పరిగెత్తింది. కొద్దిసేపట్లోనే ఉంగరాన్ని పట్టుకుని వచ్చి పిల్లి చేతికి ఇచ్చింది. పిల్లి ఎలుకను వదిలి పెట్టేసింది. తొందరగా మేడ దిగిపోయి కుక్కను కలుసుకుంది. రెండూ కలిసి ఇంటి ముఖం పట్టాయి.

దారిలో పిల్లి కుక్కతో "ఉంగరాన్ని చూడగానే మన యజమాని ఎంతో ఆనందిస్తాడు!" అంది సంతోషంతో. కుక్క మాత్రం ఉత్సాహంగా లేదు. తనంతట తనే ఉంగరాన్ని యజమానికి అందిస్తే తనకి ఎంత ఘనత! నదిని చూడగానే కుక్క పిల్లితో "నాకు ఆ ఉంగరాన్ని యిస్తేనే నదిని దాటిస్తాను," అంది. పిల్లి అందుకు ఒప్పుకోలేదు.

రెండూ దెబ్బలాడుకున్నాయి. ఆ తగువులో ఉంగరం కాస్తా నదిలో పడిపోయింది. నదిలో పడగానే ఏదో పురుగు అనుకుని ఒక చేప దాన్ని మింగేసింది. అది చూసిన కుక్క వెంటనే నీటిలోకి దూకి చేపను పట్టుకుని ఉంగరాన్ని దాని నోటిలోంచి బయటకు తీసింది. ఈ సారి కుక్క సగర్వంగా పిల్లిని తన వీపుమీద ఎక్కమంది. పిల్లి సిగ్గుతో తప్పనిసరిగా ఎక్కింది. నది దాటి ఇంటికి వచ్చేవరకు రెండూ ఒక్క మాటకూడా మాట్లాడుకోలేదు.

వాటిని దూరం నుంచి చూసి గోపి ఒక్క పరుగున వాటికి ఎదురెళ్ళి

ఎంతో ఆత్రంగా "ఉంగరాన్ని తెచ్చారా?" అని అడిగాడు. కుక్క ఉంగరాన్ని గోపి కాళ్ళమీద పడేసింది.

"దాన్ని సంపాదించింది నేను. నా తెలివితేటలు ఉపయోగించి దాన్ని సంపాదించాను," అని అరిచింది పిల్లి ఉక్రోషంతో.

"అసలు నేను నిన్ను నది దాటించక పోతే ఏం చేసే దానివి?" అంది కుక్క మరింత గట్టిగా. "ఆ ఎలుకని పట్టుకుని దానివల్ల ఉంగరం తెప్పించింది నేను," అంది పిల్లి.

"నేను అంత కష్టపడ్డాక నువ్వామాత్రం చెయ్యడం కూడా అబ్బురమేనా?" అంది కుక్క వెటకారంగా.

వీరి వాదన విన్నాడు గోపి. "మీరిద్దరూ అలా దెబ్బలాడుకోకండి. మీ ఇద్దరూ నాకు ప్రియమిత్రులే. ఇద్దరికీ తెలివితేటలు, ధైర్యసాహసాలూ ఉన్నాయి. ఇద్దరికీ నేనంటే విశ్వాసం ఉంది. మీ ఇద్దరూ కలిసి నన్ను రక్షించారు. నేను మీ ఇద్దరినీ సమానంగా ప్రేమిస్తున్నాను," అన్నాడు గోపి వాటి తలలు ఆప్యాయంగా



నిమురుతూ. వాటికి కడుపునిండా భోజనం పెట్టాడు. అంతటితో వెనకటిలాగ కుక్క, పిల్లీ మిత్రులయ్యాయి.

'ఇంక ఈ పర్వతాల్లో బతుక్కి స్వస్తి చెప్పాలి,' అని ఉంగరాన్ని తన వేలికి పెట్టుకుని దాన్ని తిప్పుతూ తన భవనం ఇదివరకున్న స్థలంలో ఉండాలనీ, కళ్యాణి భవనం ఈ మంచు పర్వతాలమీద ఉండాలనీ కోరుకున్నాడు. మరుక్షణంలో అతని కోరికలు రెండూ ఫలించాయి. తను తోటలు, పువ్వులు ఉన్న ప్రదేశంలోనూ, ఆ దుర్మార్గులు ముగ్గురూ శరీరం గడ్డకట్టుకుపోయే మంచు ప్రదేశంలోనూ ఉన్నారు.

మళ్ళీ కళ్యాణి, ఆమె తల్లిదండ్రులూ పర్వతం దిగి కిందికి రాగలరా? ఎంతయినా గోపి ఉదారస్వభావుడు కాబట్టి కొన్నాళ్ళకి కోపం తగ్గించుకొని వాళ్ళమీద దయతలిచి కొన్ని గుడిసెలు, చెట్లువున్న ఒక లోయలో నివసించే సదుపాయం వాళ్ళకి కల్పించాడు. మళ్ళీ వాళ్ళ ముఖం చూడలేదు.

ఒక సంవత్సరం అయ్యేసరికి ఆ భవనంలో ఒంటరి జీవితంతో విసుగు పుట్టింది గోపికి. ఒక రోజు తన మిత్రులు ఇద్దరినీ పిలిచి "మనం ఈ భవనాన్ని విడిచిపెట్టి పోదాం. నాకు మనూరు వెళ్ళి మా అమ్మనీ, చెల్లెలినీ చూడాలని ఉంది," అన్నాడు గోపి. ఉంగరాన్ని తిప్పుతూ తన కోరికను వెల్లడించాడు. వెంటనే కుక్క, పిల్లితో సహా తన ఊరికి వచ్చేశాడు. అక్కడినించి ముసలి అవ్వ ఉంటున్న పట్నానికి కూడా వెళ్ళాడు కానీ ఆ అవ్వ జాడ ఎక్కడా కనిపించలేదు. విచారంతో ఇంటికి వెళ్ళాడు.

తల్లి, చెల్లెలూ గోపిని వెంటనే ఆనవాలు పట్టలేకపోయారు. అతని రాచదుస్తులు చూసి "ఇతను మా గోపీయేనా" అని ఆశ్చర్యపోయారు. "అప్పుడే అదృష్టవంతుడివైపోయావా నాయనా?" అంది తల్లి గోపిని కౌగిలించుకుంటూ.

"నా అదృష్టమంతా నా వేలిమీద వుంది," అంటూ గోపి తల్లికి తన దగ్గరున్న ఉంగరాన్ని చూపించాడు. తల్లి ఆనందానికి అంతులేదు. ఆమెను చూసి ఇరుగు పొరుగు వారిలో అసూయపడని వాళ్ళు లేరు.

(ఇటలీ దేశపు జానపదగాథ)

# అగ్ని పరీక్ష

పూర్వకాలంలో వింధ్య పర్వత ప్రాంతంలో ఒక కోయరాజు ఉండేవాడు. ఆ రాజుకి ఒక కూతురు. ఆమె అపురూప సౌందర్యవతి. ఆమె పేరు భ్రమర. అనేకమంది రాజకుమారులు భ్రమరని పెళ్ళి చేసుకోవాలని ప్రయత్నిస్తూ ఉండేవారు.

భ్రమరకి తగిన వరునికోసం కోయరాజు కూడా ప్రయత్నించసాగాడు. పొరుగు రాజ్యాన్ని ఏలుతున్న మరో కోయరాజు కొడుకు ఒకసారి భ్రమర తండ్రి వద్దకు వచ్చాడు.

ఈ రెండు రాజ్యాలకూ మధ్య ఒక నది అడ్డం ఉంది. అతను ఆ నదిని ఈదుకుంటూ వచ్చాడు. అతను చూడటానికి చాలా అందంగాను, బలంగానూ ఉన్నాడు.

అతను కోయరాజునీ, భ్రమరనీకూడా ఆకర్షించాడు. అతన్ని సగౌరవంగా ఆహ్వానించాడు కోయరాజు. అతనికి వినోదాన్ని కలిగించేందుకు విందులు, ఊరేగింపులు, నృత్య ప్రదర్శనలూ ఏర్పాటు చేయించాడు రాజు.

ఈ రాజ్యంలో కొండడు అనే అసూయపరుడు ఉన్నాడు. రాజకుమారుడిని పిచ్చిగా ప్రేమించింది భ్రమర. అయినా సరే రాజకుమారుడికంటే తనే బలవంతుడినని తెలియచెయ్యాలని కొండడు నిశ్చయించుకున్నాడు.

రాజకుమారుడితో కొండడు సవాలు చేశాడు. పురప్రజల సమక్షంలో మల్ల యుద్ధానికి ఆహ్వానించాడు. ఆ రోజు కోసం ప్రజలు వెయ్యి కళ్ళతో ఎదురు చూడసాగారు.

ఆ రోజు వచ్చింది. ఆ రోజున మల్లయుద్ధాన్ని తిలకించడానికి కోయరాజు, రాజకుమార్తె భ్రమరా కూడా వచ్చారు. చాలాసేపు కొండడు,రాజకుమారుల మధ్య పోరాటం తీవ్రంగా సాగింది. చివరికి రాజకుమారుడు కొండడిని నేలమీదకు

తోసి కాళ్ళతో అదిమి పట్టాడు.



ఈ దృశ్యాన్ని భ్రమర కళ్ళారా చూడటం కొండడు సహించలేక పోయాడు. రాజకుమారుడిని పరాభవించడానికి మరో ఉపాయం ఆలోచించాడు.

కోయప్రజలు తమ రాజుని దైవంతో సమానంగా చూసుకుంటారు. అతని భోజన పదార్ధాలను దొంగిలించడం కన్నా వేరే పాపకర్మ మరొకటి లేదని వాళ్ళ నమ్మకం. అంచేత, ఆ రాత్రి కొండడు రహస్యంగా రాజుగారి భోజనశాలకు పోయి కొన్ని చిలకడదుంపలు దొంగిలించాడు.

మరునాడు రాజుగారి భోజన పదార్ధాలను ఎవరో దొంగిలించారన్న సంగతి ఊరంతా పాకిపోయింది. ఊళ్ళో రాజకుమారుడి గౌరవార్థం జరుగుతున్న విందులు, ఊరేగింపులు, ఉత్సవాలూ అన్నీ ఆగిపోయాయి.

ప్రతి పౌరుడి హృదయంలోనూ క్రోధాగ్ని ప్రజ్వరిల్లింది. అందరూ కూడా రాజకుమారుడే ఈ పని చేసిఉంటాడని అనుమానించారు. ప్రజాభిప్రాయంతో రాజుకూడా ఏకీభవించాడు. కోయరాజు రాజకుమారుడికి ఒక శిక్ష విధించాడు. అది ఒక పరీక్ష. అందులో రాజకుమారుడు నెగ్గినట్లయితే నిరపరాధిగా

నిరూపించబడతాడు.

ఒక భయంకరమైన అగ్ని గుహలోకి అతడు ప్రవేశించాలి. అతను పాపం చేసిన వాడయితే ఆ మంటల్లోనే నశించిపోతాడు. నిరపరాధి అయితే క్షేమంగా బయటికి రాగలడు.

రాజభటులు అతడిని ఒక చీకటి గుహలోకి పంపి గుహలో మంటలు పెట్టారు. గుహ అంతా కూడా పొగతోను, మంటలతోనూ నిండిపోయింది. ఆ గుహలో రాళ్ళ మధ్యనుంచి పాములు బుసలు కొడుతున్నాయి. రాజకుమారుడికి ఆ గుహలో ఊపిరి పీల్చుకునేందుకు కూడా సాధ్యం కాలేదు. వేడికి రాళ్ళు పగులుతూ ఉండటంతో నడక సాగించడం అసాధ్యమయ్యింది.

మధ్య మధ్య గుంటలు, ఆ గుంటల్లో మురికినీరు, కొన్ని కొన్ని చోట్ల బురద, వేడికి భూమి పగిలి పైకి ఉబికి వస్తున్నట్లు లావా– అతను అడుగుతీసి అడుగు వెయ్యలేక పోతున్నాడు. ఎక్కడైనా పొరపాటున కాలుజారితే అంతటితో అతని బతుకు అంతం కావచ్చు. కాని, రాజకుమారుడి హృదయం మాత్రం ఎంతో మంచిది.

అతను అమాయకుడు. అతను ఏ పాపం ఎరగడు. భగవంతుడు అతని పక్షాన ఉన్నాడు. అంచేత సురక్షితంగా గుహలోంచి బయటికి వచ్చేశాడు. వెంటనే తన తండ్రి రాజ్యానికి వెళ్ళిపోయాడు.

ప్రమాదం తప్పిందని అతనికి ఏ మాత్రం సంతోషం తేదు. అతనికి రాజకుమార్తె దక్కలేదు. కొన్ని నెలలు గడిచాయి. రాజకుమారుడికి మాత్రం భ్రమర మరుపుకి రాలేదు. అతను ఆ వియోగాన్ని భరించలేకపోయాడు.

ఒకనాడు నమ్మకమైన ఒక బంటుని పిలిచి రహస్యంగా తన సందేశాన్ని రాజకుమార్తె భ్రమరకి అందచేయమని పంపించాడు. ఆ బంటు నది దాటి రహస్యంగా వెళ్ళాడు. భ్రమరని చాటుగా కలుసుకుని రాజకుమారుడు ఆమె కోసం ఎంతగా పరితపించి పోతున్నదీ వివరంగా చెప్పాడు. ఆమె హృదయం ద్రవించిపోయింది.

"వచ్చే పౌర్ణమినాటి రాత్రి అతన్ని నదికి అవతల ఒడ్డున కలుసుకుంటానని చెప్పు," అంది భ్రమర.

కొండడు సహజంగా దుష్టబుద్ధి ఉన్నవాడు కావడం వల్ల,రాజకుమారుడిపై పగబట్టడం వల్లా భ్రమరకీ, రాజకుమారుడికీ మధ్య జరిగిన రహస్య సంప్రదింపులను కనిపెట్టాడు. వెంటనే జరిగినదంతా రాజుతో చెప్పాలనుకున్నాడు.

ఆనాడు పౌర్ణమి. చంద్రుడు దివ్యంగా వెలుగుతున్నాడు. నదిలోని నీరు వెండి కరిగించి పోసినట్లుగా కనిపిస్తోంది. భ్రమర ఇంటినుంచి పారిపోయి నదివద్దకు వచ్చింది.

తీరా వచ్చేసరికి ఒడ్డుమీద ఎక్కడ చూసినా రక్షక భటులే. తన రహస్యం తండ్రికి తెలిసి ఉంటుంది అనుకుంది భ్రమర. ఎవరో తనని మోసగించారు. అయితే భ్రమర ఇసుమంతయినా వెనుదీయలేదు. తక్షణం నీటిలోకి దూకింది. తన శక్తినంతా వినియోగించి అతి కష్టంమీద వడి వడిగా నదిని ఈదుకుంటూ అవతల ఒడ్డుకి చేరుకుంది.

అప్పుడే సూర్యోదయం అవుతోంది. ఒడ్డున ప్రియుడిని చూసింది. తన కష్టాలు గట్టెక్కాయి అనుకుంది. అయితే ఆమె ఆనందం కూడా క్షణికమే అయింది. నదిలో తన వెనుక లెక్కలేనన్ని నావలు వస్తున్నాయి. ఒక్కొక్క దాంట్లో ముప్ఫయి మంది మనుషులున్నారు.

ఆ సైనికులందరూ మెల్లిగా ఒడ్డుకు చేరుకున్నారు. వారి చేతుల్లో ఆయుధాలున్నాయి. రాజకుమారుడు ఇదంతా ఊహించే తన తరఫు నించి కొంతమంది సైనికులను వెంట పెట్టుకుని వచ్చాడు. యుద్ధం ప్రారంభం అయింది. ఇక రక్తపాతం!

కొండడిని ఒక యువతి మనసారా ప్రేమించింది. రాజుగారి భోజన పదార్థాలను కొండడే దొంగిలించాడని ఆమెకి మాత్రమే తెలుసు. కాని కొండడి మీద ఉండే ప్రేమకొద్దీ ఆ విషయాన్ని రహస్యంగా దాచింది.

అయితే తమ రాజ్యంలోని సైనికులంతా ఒక్క కొండడికోసం, ఒక దుష్టుడి కోసం నాశనం కాబోతూంటే సహించలేక పోయింది. తక్షణం వెళ్ళి కోయరాజువద్ద మొదటనుంచీ జరుగుతున్న కుట్రను వెల్లడించింది. కోయరాజు తన తప్పు తెలుసుకున్నాడు. వెంటనే నావ ఎక్కి బయలుదేరాడు.

అకస్మాత్తుగా కోయరాజు ప్రత్యక్షమయేసరికి యుద్ధం ఆగిపోయింది. అప్పుడు కోయరాజు రాజకుమారుడి తండ్రికి కబురు పంపాడు.

కోయరాజులిద్దరూ గౌరవార్థం కౌగలించుకున్నారు. కొండడు క్రోధంతో పళ్ళు పట పట కొరికాడు.

(న్యూజిలాండ్ జానపద గాథ)



# మూషిక రంధ్రం

అనగా అనగా ఒక రాజు ఉండే వాడు. రాజుకి ముగ్గురు కొడుకులు. వాళ్ళు పెద్ద వాళ్ళయ్యారు. ఒక రోజున తండ్రి దగ్గిరికి వెళ్ళి "దేశాటన చెయ్యడానికి అనుమతి ఇవ్వవలసింది," అని కోరారు.

తండ్రి చిరునవ్వు నవ్వుతూ "మీరు ఎందుకు వెళ్ళాలని అనుకుంటున్నారో నాకు తెలుసు. మీరు భార్యలను వెతుక్కోవడానికి వెళుతున్నారు. నాకు సంతోషమే. కాని నేను ఒక్కటి కోరుతున్నాను. మీరు ప్రేమించిన యువతుల దగ్గర నుంచి ఏమయినా బహుమతులను నాకోసం తీసుకురావాలి. వాటివల్ల మీరు ఎటువంటి కన్యలను ఎన్నుకున్నారో నాకు తెలుస్తుంది," అన్నాడు రాజు.

రాజకుమారులు ముగ్గురూ ఒక నిశ్చయానికి వచ్చారు. ముగ్గురూ మూడు బాణాల్ని గాలిలోకి వెయ్యాలి. ఎవరి బాణం ఏదిక్కుకి పోతే వారు ఆ దిక్కుగా ప్రయాణం సాగించాలి అనుకున్నారు. సరేనంటూ ముగ్గురూ ఒక మైదానంలోకి వెళ్ళారు.

మొదటి రాజకుమారుడు వేసిన బాణం తూర్పు దిక్కుకి పోయింది. రెండవవాడు వేసిన బాణం ఉత్తర దిక్కుకి పోయింది. మూడవ వాడయిన ప్రసేనుడు బాణం ఎక్కుపెట్టాడు. అదే సమయానికి ఒక ఎలుక అతని పాదాల మీదనుంచి పాకింది. వెంటనే అతను కాలుదులుపు కున్నాడు. బాణం వెళ్ళి మూషిక రంధ్రంలో పడింది. అన్నలిద్దరూ ప్రసేనుని హేళన చేశారు. అయినా ప్రసేనుడు అధైర్యపడలేదు. అన్నలిద్దరూ సగర్వంగా గుర్రాలను ఎక్కి ఎవరి దిక్కుకి వారు వెళ్ళిపోయారు.

ప్రసేనుడు కూడా గుర్రాన్ని ఎక్కి మూషికరంధ్రం మీదికి గుర్రాన్ని నడిపించాడు. రంధ్రం వెంటనే పెద్దదయి అక్కడ ఒక రాజమార్గం ఏర్పడింది. అనుమానించకుండా ఆ మార్గంగుండా వెళ్ళాడు ప్రసేనుడు. వెళ్ళగా వెళ్ళగా

ఒక విశాల ప్రదేశంలో ఒక చలువరాతి భవనం కనిపించింది.

ఆ భవన ప్రాంగణంలోకి ప్రవేశించాడు. ప్రవేశించగానే ఒక స్త్రీ అతనికి ఎదురయింది. ఆమె శ్వేతవస్త్రాల్ని ధరించింది. తనతో ఒక శ్వేత అశ్వాన్నికూడా తీసుకువచ్చింది. ప్రసేనుడికి నమస్కరించి తను తెచ్చిన అశ్వాన్ని అధిరోహించమని సంజ్ఞ చేసింది. ఆమె చెప్పినట్లుగా చేశాడతను. అతడు ఆ అశ్వాన్ని అధిరోహించ గానే అది గాలిలోకి ఎగిరింది.



అలా చాలా దూరం ఎగిరి తిరిగి భూమి మీద మరో చలువరాతి భవనం ముందు ఆగింది. ఇది వెనకటి భవనంకన్నా అద్భుతంగా ఉంది. అతను గుర్రం దిగి ఆ భవనం వైపు ఆశ్చర్యంగా చూస్తూండగానే అతను ఎక్కి వచ్చిన అశ్వం గాలిలోకి రివ్వున ఎగిరిపోయింది.

ప్రసేనుడు భవనంలోకి ప్రవేశించి తలుపుతట్టాడు. ఎవరూ పలుకలేదు. కాని, తలుపులు మాత్రం వాటంతట అవే తెరుచుకున్నాయి. ఆ భవనంలో మానవమాత్రులు ఎవరూ అతని కంటబడలేదు. బంగారంతోను, రత్నాలతోనూ

అలంకరింపబడిన పది గదులు చూశాడతను.

పదకొండవ గదిలో ఒక బంగారు తొట్టె ఉంది. స్వచ్ఛమైన నీరు ఒక బంగారు గొట్టంలోనుంచి ఆ తొట్టెలోకి ప్రవహిస్తోంది. పన్నెండవ గది చాలా చిన్నది. అలంకార రహితంగా ఉంది, చిన్నబోయినట్లు ఉంది. గదిలో మధ్యగా ఒక బల్ల ఉంది. దాని మీద అతనికి ఒక భరిణ కనిపించింది. ఆ భరిణ మూతమీద 'నన్ను నీ హృదయంలో దాచుకో. నాకు రోజూ స్నానం చేయించు. నాకు బంధ విముక్తి కలిగించగలవు,' అని రాసిఉంది. ఆ అక్షరాల నిండా వజ్రాలు! ప్రసేనుడికి ఇంకా ఆశ్చర్యం కలిగింది.

ఆ వజ్రాల భరిణ మూతని తీసి చూశాడు. లోపల ఒక బంగారు మూత ఉంది. దాన్ని తీశాడు. వెండి మూత కనిపించింది. ఆ లోపల చూస్తే ఏముంది? దాన్ని చూసేసరికి ప్రసేనుడికి భవనం విడిచిపెట్టి పోవాలనిపించింది. దాని లోపల ఉన్నది ఒక కప్ప. చూడటానికి అసహ్యకరంగా ఉంది. అయినా అతను దాన్ని స్పృశించాడు. అతని ఒళ్ళు ఝల్లుమంది.

ఆ స్పర్శలో అతనికి ఏదో ఆనందం ఉందనిపించింది. దాన్ని పదకొండవ గదిలోకి తీసికెళ్ళి అక్కడున్న బంగారు తొట్టెలోని నీటితో స్నానం చేయించాడు. అప్పుడు దాన్ని తను తొడుక్కున్న కోటు లోపలిజేబులో దాచుకున్నాడు.

అప్పటినుంచీ ప్రతిరోజూ ఉదయమే దానికి స్నానం చేయించడం మొదలు పెట్టాడు. అతన్ని పలకరించడానికి గాని, అతనితో కబుర్లు చెప్పడానికి గాని ఆ భవనంలో ఒక్క మనిషి కూడా లేడు. అలాగే ఒంటరిగా ఒక సంవత్సరం గడిపాడు ప్రసేనుడు.

మనుషులెవరూ లేకపోయినా సమయానికి బల్లమీద భోజనం సిద్ధంగా ఉండేది. పడుకోవడానికి పక్క సిద్ధంగా ఉండేది. అతనికి కావలసిన సదుపాయాలు, పుస్తకాలూ ఉండేవి. అన్నీ బాగానే ఉన్నాయి.

కానీ, తండ్రి దగ్గరకి కానుక పట్టుకు వెళ్ళేరోజులు సమీపిస్తున్నకొద్దీ అతని మనస్సులో ఆందోళన ఎక్కువ కాసాగింది. ఆ కప్పని ఎలా వదిలిపెట్టడం?

రాజుకి ఏ బహుమానం పట్టుకెళ్ళడం?

సంవత్సరాదినాడు అతని బల్లమీద ఒక చీటీ కనిపించింది: 'నా ప్రసేన్! నాకుమల్లే ఓర్పు వహించు. నీ దగ్గర ఉన్న భరిణలో నువ్వు పట్టుకెళ్ళ వలసిన కానుక కనిపిస్తుంది. దాన్ని తీసుకుని వెళ్ళి నీ తండ్రికి ఇవ్వు. నన్ను మాత్రం వెంటనే తిరిగి భరిణలో పెట్టు,' అని ఆ కాగితం మీద రాసి ఉంది.

ప్రసేనుడికి పట్టలేనంత సంతోషం కలిగింది. వెంటనే భరిణ విప్పి చూశాడు. అందులో ఒక చిన్న బంగారపు భరిణ ఉంది. ప్రసేనుడికి అది నచ్చింది. అందులో ఏముందో అతను చూడనేలేదు. దాన్ని తీసుకుని, మళ్ళీ ఆ కప్పను భరిణలో పెట్టేశాడు.

భవనం బయటికి వచ్చాడు ప్రసేనుడు. గుమ్మంలో శ్వేత అశ్వం సిద్ధంగా ఉంది. దాని పైకెక్కగానే అది గాలిలోకి ఎగిరింది. ఎగిరి ఎగిరి మొదటి చలువ రాతిభవనం వద్ద ఆగింది.

అక్కడ వెనుకటి శ్వేత వస్త్రధారిణి కనిపించి ప్రసేనుడి గుర్రాన్ని ప్రసేనుడికి ఇచ్చింది. ప్రసేనుడు తన గుర్రాన్ని ఎక్కి కొంత దూరం పోయాడు. అనుమానంతో ఒకసారి వెనక్కి తిరిగి చూశాడు. అక్కడ మూషిక రంధ్రం మాత్రమే ఉంది!

ప్రసేనుడు తండ్రి దగ్గరికి వెళ్ళాడు. తమ ప్రియురాళ్ళిచ్చిన కానుకలతో ప్రసేనుడి అన్నలిద్దరూ కూడా వచ్చేశారు.

రాజు సంతోషంతో గొప్ప విందు ఏర్పాటు చేశాడు. ఆనాడు సభతీర్చి, కొడుకుల్ని తాము తెచ్చిన కానుకల్ని అందరి ఎదుటా చూపమని అడిగాడు.

పెద్దకొడుకు సగర్వంగా లేచి, "నాప్రియురాలు ఒక మహారాజు ప్రియ పుత్రిక. ఆమెతో కలసి విందుల్లోనూ, వినోదాల్లోనూ, వింతల్లోనూ, పాల్గొంటూ ఎంతో హాయిగా సంవత్సరమంతా గడిపాను," అంటూ తన ప్రియురాలు ఇచ్చిన ఒక భరిణను తండ్రికి ఇచ్చాడు.

ఆ భరిణలో ఒక అద్దం ఉంది. చూడటానికి ముచ్చటగా ఉంది. అరచెయ్యి

అంత అద్దం! దాంట్లో రాజు ముఖమేకాదు... అతని శరీరమంతా కనిపించింది. రాజు సంతోషంతో "బాగానే ఉంది," అన్నాడు.

రెండవ కొడుకు దర్జాగా ముందుకి వచ్చి "నా ప్రియురాలు ఒక రాజాధిరాజు ఏకైక పుత్రిక. ఆమె యిచ్చిన కానుక ఇదిగో," అంటూ ఒక భరిణను అందించాడు రాజుచేతికి. అందులో బెత్తెడు అద్దం ఉంది. అంత చిన్న అద్దంలో కూడా రాజు తన ప్రతిబింబాన్ని చూసుకో గలిగాడు. రాజు "బావుంది," అన్నాడు.

ప్రసేనుణ్ని పిలిచి "నువ్వు తెచ్చిన కానుక ఏదీ?" అని అడిగాడు. ప్రసేనుడు నమ్రతతో తను తెచ్చిన బంగారు భరిణను తండ్రికి ఇచ్చాడు. రాజు దాని మూత తీసి చూశాడు. ఆ భరిణలో బొటనవేలు గోరంత అద్దంవుంది.

రాజు ఆశ్చర్యానికి మేరలేదు. ఆ గోరంత అద్దంలోనూ తన ఒక్క శరీరమే కాదు. తను కూర్చున్న సింహాసనం, సభలో కూర్చున్న వారు, దీపాలు, ఒకటేమిటి, ఆ మహలంతా కనిపించింది.

"ఈ రాజకుమార్తె నిజంగా తెలివైనది. కానుక అంటే వింతగొలిపేటట్లు ఇలా ఉండాలి," అంటూ ప్రసేనుణ్ని ప్రేమతో కౌగలించుకున్నాడు. కొడుకులు ముగ్గుర్నీ మళ్ళీ పిలిచి "మీరు మళ్ళీ ఆ రాజకుమార్తెల దగ్గరికి వెళ్ళి మరో సంవత్సరం పోయాక, వారి ముఖ చిత్రాలను తీసుకురావాలి," అని చెప్పాడు.

పెద్దవాళ్ళిద్దరూ ఉత్సాహంతో బయలుదేరారు. ఒకవేళ ఆ కప్ప ముఖ చిత్రమే తను తీసుకు రావలసి వస్తుందేమోనని ప్రసేనుడికి కొంచెం అధైర్యం కలిగింది. ఏమైతే అవుతుందని ఆ మూషిక రంధ్రంలోనించి మళ్ళీ ప్రయాణం సాగించాడు.

మరుసటి సంవత్సరం కూడా గడిచింది. ప్రసేనుడు జాగ్రత్తగా కప్పని స్నానం చేయిస్తూ తన జేబులో దాచుకుంటున్నాడు. సంవత్సరాదినాడు తన బల్లమీద మళ్ళీ ఒక చీటీని చూసాడు.

'నా ప్రసేన్! ఇంకా ఓర్పు వహించు. ఆ భరిణలో ఒక చిన్న భరిణ కనిపిస్తుంది. దాన్ని తీసుకుపో, మళ్ళీనన్ను నా భరిణలో పెట్టు,' అని అందులో

రాసి ఉంది.

ఆ భరిణని తీసుకుని ప్రసేనుడు తండ్రివద్దకు బయలుదేరాడు. అన్నలిద్దరూ కూడా వచ్చారు. రాజు పెద్దకొడుకులు ఇద్దరూ తెచ్చిన రాజకుమార్తెల ముఖ చిత్రాల్ని చూసి "బాగానే ఉన్నారు కాని, ఇంతకంటే అందకత్తెలు లోకంలో లేకపోలేదు," అన్నాడు.

ప్రసేనుడు భయపడుతూ భరిణను తండ్రి చేతికి అందించాడు. అందులో ఎవరి ముఖచిత్రం ఉందో తనకే తెలియదు. ఒకవేళ కప్ప అయితే తను నలుగురిలోనూ నవ్వుల పాలవడూ?

రాజు ఆ చిత్రాన్ని చూసి ఆశ్చర్య పోయాడు. "ఇటువంటి సౌందర్యరాశిని నేను ఎక్కడా ఇంతకు ముందు చూడలేదు," అన్నాడు. చిత్రాన్ని చూడటానికి సభలోని వారంతా సంభ్రమంతో రాజుచుట్టూ మూగారు. ప్రసేనుడు కూడా తన ప్రియురాలు ముఖ చిత్రాన్ని మొదటిసారిగా చూశాడు. తన కళ్ళను తానే నమ్మలేక పోయాడు. తనవంటి అదృష్టవంతుడు మరొకడు లేడనుకున్నాడు.

మరో సంవత్సరం తర్వాత ఆ రాజకుమార్తెలను వెంట బెట్టుకుని రమ్మని తండ్రి ఆజ్ఞాపించాడు. కొడుకులు ముగ్గురూ బయలుదేరారు.

తను ఈసారి వెళ్ళే సరికి తన ప్రియురాలు ఎదురై తనకు స్వాగతం చెబుతుందనుకున్నాడు ప్రసేనుడు. కాని ఎప్పటిలాగే భరిణలో కప్ప మాత్రమే ఉంది. వెనుకటిలాగే తన ధర్మాన్ని నిర్వర్తించసాగాడు.

సంవత్సరం గడచింది. సంత్సరాదినాడు కప్పని స్నానం చేయిద్దామని జేబు చూసుకునేసరికి అందులో కప్ప లేదు. ఎక్కడ పోయిందోనని రాజకుమారుడు కంగారు పడ్డాడు. అతనికి దుఃఖం ముంచుకొచ్చింది. భరిణ మూతతీసి చూస్తే అందులోనూ లేదు. ఇల్లంతా వెతికాడు. ఏగదిలోనూ లేదు. చివరికి పన్నెండవ గది వద్దకు వచ్చాడు.

ఆ గది వెనకటిలా చిన్నబోయినట్లు లేదు. అలంకార రహితంగా లేదు.

భవనం అంతటిలోకీ ప్రకాశమానంగా తయారయింది. గది మధ్యన నిలబడి ఉంది ఆ సౌందర్యరాశి – తన ప్రియురాలు. ప్రసేనుడిని చూడగానే అతనికి ప్రణమిల్లి, ఇన్నాళ్ళూ తనను కాపాడి, తనకు శాపవిమోచన కలిగించినందుకు కృతజ్ఞత తెలిపింది. ఇద్దరూ భవనం బయటికి వచ్చేసరికి శ్వేత అశ్వాలరథం ఒకటి సిద్ధంగా ఉంది. అందులో కూచుని ప్రసేనుడు తన ప్రియురాలితో సహా తండ్రివద్దకు వెళ్ళాడు. రాజు తన కొడుకులు ముగ్గురికీ అతి వైభవంగా వివాహం చేశాడు.

(ఛెక్ జానపద గాథ)



# వేలెడు మనిషి - బారెడు మీసం

కొన్ని సంవత్సరాల క్రితం మన దేశాన్ని ఒక రాజు పరిపాలిస్తూండేవాడు. ఆ రాజుకి ఒక్కడే కొడుకు. ఆ కొడుకు పేరు ఇంద్రవర్మ. ఇంద్రవర్మ చాలా తెలివైన కుర్రవాడు. విద్యలలో నేర్పరి. చదువు సంధ్యల్లో తోటివాళ్ళల్లోకి మేటి. వయస్సుకి పిన్నవాడే అయినప్పటికీ ధైర్యసాహసాల్లో రాజుగారి ఆస్థానంలో ఉండే వీరుల కంటే కూడా ఇంద్రవర్మ చాలా గొప్పవాడు. అయితే, ఇంత గొప్ప కొడుకు ఉన్నప్పటికీ రాజు, రాణీ ఎప్పుడూ విచారంగా ఉండేవారు.

తల్లిదండ్రుల విచారానికి కారణం ఇంద్రవర్మకి తెలుసు. ఇంద్రవర్మ పుట్టకపూర్వం ఆ రాజుకి ఇద్దరు అందమైన కవల పిల్లలుండేవారు. వాళ్ళిద్దరూ అంటే రాజుకీ, రాణికీ ఎంతో ముద్దు. అందుకని, వాళ్ళకోసం ఒక చలువరాతి భవనాన్ని ప్రత్యేకంగా కట్టించారు. వాటికి బంగారపు తలుపులు అవీ ఉండేవి.

ఆ భవనం చుట్టూ రక్షణకోసం ఎత్తయిన గోడలుకూడా కట్టించాడు రాజు. అంతే కాకుండా ఇంట్లో రాజకుమార్తెల సదుపాయాలు చూడటానికి డెబ్భైమంది నౌకర్లు, రాజకుమార్తెలూ భవనం బయటికి షికారు వెళ్ళినప్పుడు వారికి తోడుగా ఉండేందుకు డెబ్భై మందిని, ఆ భవనాన్ని కాపలా కాయడానికి డెబ్భైమంది సిపాయిలనూ నియమించాడు రాజు.

ఇన్ని చేసినా కూడా తమ దురదృష్టాన్ని తప్పించుకోలేక పోయారు రాజు, రాణీ. ఒక రోజున ఆ సిపాయిలు, నౌకర్లూ పరుగెత్తుకుంటూ రాజు దగ్గరికి వచ్చారు. "ప్రభూ, ప్రభూ! అకస్మాత్తుగా ఒక భయంకరమైన సుడిగాలి వీచింది. గదిలో ఆడుకుంటున్న రాజకుమార్తెలు ఇద్దరూ ఆ గాలిలో ఎగిరి పోయారు. వారిని పట్టుకోవడానికి సాధ్యం కాలేదు," అంటూ మొరపెట్టుకున్నారు.

రాజు, రాణీల దుఃఖానికి అంతులేదు. ప్రపంచంలో ఎవరినైతే వాళ్ళు అమితంగా ప్రేమించారో వాళ్ళే తమకు కాకుండా పోయారు. ఇక వాళ్ళకి ఆనందం

ఎక్కడిది? తన కూతుళ్ళను వెతికి తీసుకు రావడానికి రాజు విశ్వ ప్రయత్నాలు చేశాడు. ఇక లాభంలేక వాళ్ళు చనిపోయి ఉంటారని నిశ్చయించుకుని నిరాశపడ్డారు.

ఇంద్రవర్మ పెద్దవాడయాడు. ధైర్యసాహసాలు పెంపొందాయి. తలుచుకుంటే దేన్నైనా సాధించగలడు. ఒక రోజున తండ్రివద్దకు వెళ్ళి ప్రణమిల్లి, "తండ్రీ! నా అక్కలిద్దరూ చనిపోలేదని నా నమ్మకం. వారిని మాయం చేసింది మామూలు సుడిగాలి కాదు. ఎవడో దుష్టబుద్ధి సుడిగాలిరూపంలో వచ్చి వాళ్ళని తీసుకు పోయిఉంటాడు. వాళ్ళింకా బతికే ఉన్నారని నా నమ్మకం. ఆ దుష్టబుద్ధిని పట్టుకుని వాడిబారినుంచి నా అక్కల్ని రక్షించడానికి అనుమతివ్వండి," అని ప్రార్థించాడు.

"అదేమిటి నాయనా? నువ్వు చిన్నవాడివి. అటువంటి సాహసకృత్యాలకు పూనుకుంటే అపాయం సంభవిస్తుంది. నువ్వు నా సింహాసనాన్ని అధిష్ఠించ బోతున్నావు. నీ అక్కల్ని పోగొట్టుకున్నట్టు నిన్ను కూడా పోగొట్టుకోవడం నాకు ఇష్టం లేదు. అయినా నీ మాటలు నాకు ఉత్సాహాన్ని కలిగించాయి. ఆ దుష్టబుద్ధిని చంపి నా పుత్రికల్ని రక్షించి తీసుకురమ్మని నా దగ్గర ఉన్న వీరుల్ని కొందర్ని పంపిస్తాను," అన్నాడు తండ్రి.

"సరే. మీకు మీ వీరుల్లోనే ఎక్కువ నమ్మకం ఉంది కాబోలు! నేను సవాలు చేస్తున్నాను. ఈ కార్యాన్ని ఏ వీరుడూ కూడా సాధించలేడు. ఒక వేళ సాధించగలిగితే నా సింహాసనాన్ని అతనికి సమర్పించి అతనికి దాసోహం అంటాను," అన్నాడు ఇంద్రవర్మ పౌరుషంతో.

ఏమయినా పుత్రుడిమాటలు పట్టించుకోకుండా రాజు తన సభలోని వీరుల్ని పిలిచి "చాలాకాలం కిందట నా పుత్రికలు ఇద్దరినీ ఒక సుడిగాలి మాయం చేసిందన్న సంగతి మీ అందరికీ తెలుసు. కాని అది సుడిగాలి కాదు – ఎవడో మాంత్రికుడు పన్నిన పన్నాగం అని తెలిసింది. వాడిని పట్టుకుని వాడి బారినుంచి నా కుమార్తెలను మీలో ఎవరు వెళ్ళి రక్షించగలరో చేతులెత్తండి," అన్నాడు

రాజు. అంతే కాకుండా ఆ విధంగా రక్షించగలిగిన వీరుడికి తనకూతుళ్ళలో అతనికి నచ్చిన ఆమెను ఇచ్చి వివాహం చేస్తానని కూడా చెప్పాడు రాజు.

అయితే, ఒక్క వీరుడూ ముందుకి రాలేదు. పైగా అందరూ మౌనం వహించి వెనక్కి తగ్గారు. వారిని చూసి ఇంద్రవర్మ ఫక్కున నవ్వాడు. "చూశారా తండ్రీ! ఇప్పటికైనా గుర్తుంచుకోండి. అటువంటి సాహస కార్యాన్ని మీ వీరుల్లో ఒక్కడూ సాధించలేడు. అంచేత నన్ను ఆశీర్వదించి పంపించండి," అన్నాడు ఇంద్రవర్మ.

"సరే, వెళ్ళు," అన్నాడు రాజు విచారంతో, "నా రాజ్యంలోకల్లా నువ్వొక్కడివే బలపరాక్రమవంతుడివైనప్పుడు నువ్వే వెళ్ళితీరాలి. నీకు సహాయంగా ఉండేందుకు వందమంది సిపాయిల్ని నీతోకూడా తీసికెళ్ళు," అన్నాడు చివరికి రాజు.

"అక్కర్లేదు. నాకే సిపాయిలూ వద్దు. ఇది సిపాయిలకు సంబంధించిన విషయం కాదు. ఈ కార్యం సాధించాలంటే బుద్ధి కుశలత అవసరం కానీ బలపరాక్రమాలుకాదు. అంచేత నాతోకూడా నా తెలివి తేటల్ని మాత్రమే తీసుకువెళతాను. కాలక్షేపానికి నా వీణను కూడా నాతో తీసుకెళతాను," అన్నాడు ఇంద్రవర్మ. ఇంకా ఇలా అన్నాడు: "మూడు సంవత్సరాల లోపు నేను తిరిగి రాకపోయినట్లయితే మీ రాజ్యభారాన్ని మరొకరి చేతికి అప్పగించండి."

తన వీణను తీసుకుని బయలుదేరాడు ఇంద్రవర్మ. ఆ వీణను వాయిస్తూ, కులాసాగా ప్రకృతిని పరికిస్తూ పయనం సాగించాడు. అలా వెళ్ళగా వెళ్ళగా ఒక మహారణ్యం చేరుకున్నాడు. సాయంకాలమయింది. పెద్ద పెద్ద టేకు చెట్లు, ఎత్తయిన సర్వీచెట్లు ఎన్నో కనిపించాయి.

ఆ చెట్లమధ్య ఒకచోట ఒక చిన్న గుడిసె ఉంది. అది ఎంతో వింతగా ఉంది. ఆ గుడిసె కోడి కాళ్ళమీద నిలబడి ఉంది. ఆ కోడి కాళ్ళు గుడిసెతో సహా అటూ, ఇటూ నడుస్తున్నాయి. అది దూరాన్నించి ఒక కోడిలాగే కనిపిస్తోంది. ఇంద్రవర్మ ఆ గుడిసె దగ్గరికి వెళ్ళాడు. అది కదలడం మానలేదు.

"నేను లోపలికి రావాలనుకుంటున్నాను. నీ నడక కట్టిపెట్టి ఒకమాటు ఆగి తలుపు తెరువు," అని బిగ్గరగా అరిచాడు ఇంద్రవర్మ. ఆ మాటలు విని కదలడం మానేసింది గుడిసె. 'ఎవరునువ్వు?' అని అడుగుతున్నట్లుగా ఆ గుడిసె తలుపు ఇటూ అటూ ఊగింది. ఆ ద్వారంలోనించి ఇంద్రవర్మ లోపలికి వెళ్ళాడు.

ఆ గుడిసెలో ఒక మూల ఒక అవ్వ కుంపటి దగ్గర కూర్చుని చలికాచుకుంటోంది. ఇంద్రవర్మని చూడగానే ఆమె నరాలు రౌద్రంతో పొంగాయి. "మానవ మాత్రులెవ్వరూ ప్రవేశించని ఈ కీకారణ్యంలోకి నువ్వెందుకొచ్చావు?" అని గొంతు చించుకుని అరిచింది అవ్వ.

"ఈ పూటకి నన్నేమీ ప్రశ్నించకు అవ్వా. రేపు ఉదయమే అడగ దలుచుకున్నవన్నీ అడుగుదువుగాని. ఈ రాత్రికి నాకు భోజనం పెట్టు," అని ఎంతో సౌమ్యంగా అన్నాడు ఇంద్రవర్మ. అవ్వకి కోపం తగ్గింది. ఓపిక లేకపోయినా, అతనికి అన్నం వండి పెట్టింది. అతన్ని ఆ గుడిసెలో పడుకోమని తను బయటకు వెళ్ళిపోయింది.

ఆ రాత్రి అంతా గుడిసె కొంచెంకూడా కదలలేదు. అంచేత ఇంద్రవర్మకి సుఖంగా నిద్రపట్టింది. తెల్లవారగానే గుడిసె కదలడం మొదలు పెట్టింది. కోడి కాళ్ళు నడుస్తూ మధ్య మధ్య నేలను బరుకుతూ దుమ్ము లేపుతున్నాయి. కోడి కాళ్ళు నడుస్తూంటే గుడిసె ఇటూ అటూ ఉయ్యాలలా ఊగుతోంది. ఇంద్రవర్మకి మెలకువ వచ్చింది. గుడిసెలోనించి బయటికి దూకాడు.

అవ్వ దూరంగా ఒక చెట్టుకింద కూర్చుని జపం చేసుకుంటోంది. ఇంద్రవర్మ అవ్వను సమీపించి ఆవిడికి దణ్ణం పెట్టాడు. "అవ్వా! నేను మా అక్కల్ని వెతకడానికి బయలుదేరాను. వాళ్ళను కనుక్కునే మార్గం చెపుతావా?" అని అడిగాడు. అలాగేనంటూ తల ఊపింది అవ్వ.

"ఇక్కడికి కొద్ది దూరంలో ఒక మంత్రగాడు ఉన్నాడు. వాడు ఎంతో మంది రాజకుమార్తెలను మాయం చేశాడని విన్నాను. మీ అక్కల్ని కూడా వాడే తీసుకొని పోయాడేమో. వాడు ఒక సుడిగాలి రూపంలో తిరుగుతూ ఉంటాడు,"

అంది అవ్వ.

"అయితే మా అక్కల్ని తీసుకుపోయింది వాడే," అన్నాడు ఇంద్రవర్మ.

"వాడు చాలా బలవంతుడు. టేకు చెట్టునుకూడా అతి సునాయాసంగా పెరికి వెయ్యగలడు. వాడిని ఓడించడం కష్టం," అంది అవ్వ.

"వందమంది వీరులకు ఉన్న బలం వాడొక్కడికీ ఉన్నా నాకు భయంలేదు. ఆ దురాత్ముడుండే స్థలానికి దారి చూపించు," అన్నాడు ఇంద్రవర్మ.

"సరే, నీకంత ధైర్యం ఉంది కనక, నా ఇంటి ఎదురుగా ఉన్న తోవగుండా వెళ్ళు తెలుస్తుంది," అంది అవ్వ. ఆ మాంత్రికుడు ఉండే ఇంటి గుర్తులుకూడా చెప్పింది అవ్వ: "వాడిది ఒక చిన్న ఇల్లు. దాని చుట్టూ తోట. ఆ తోటలో ఒక గొర్రెల మంద ఉంటుంది. ఆ మందని ఒక్క ఊపులో ఒక రైతు దగ్గరనుంచి ఎత్తుకొచ్చేశాడు."

అవ్వకి తన కృతజ్ఞత తెలిపి ఇంద్రవర్మ తన వీణపుచ్చుకుని అవ్వ చెప్పిన మార్గంలో బయలుదేరాడు. కొంత సేపటికి అవ్వ వర్ణించిన ఆ తోట, ఇల్లు, గొర్రెల మందా అన్నీ కనిపించాయి. అతను ధైర్యంగా లోపలికి ప్రవేశించాడు. ఆ ఇంటి తలుపు తట్టాడు. లోపల ఎవ్వరూ లేనట్టుంది. ఎవ్వరూ వచ్చి తలుపు తీయలేదు. తనంతట తనే బలంగా ఒక తన్ను తన్ని తలుపు ఊడదీశాడు, లోపలికి ప్రవేశించాడు. అనుకున్నట్లుగానే ఆ మాయలమారి ఇంట్లోలేడు.

ఆ మాయలమారిని ఇంటికి ఎలా రప్పించడమా అని ఇంద్రవర్మ ఆలోచించాడు. ఎదురుగుండా ఒక పొయ్యి కనిపించింది. దానిమీద వొక గిన్నెలో నీళ్ళు మరుగుతున్నాయి. ఇంద్రవర్మ తోటలోకి వెళ్ళి రకరకాల కూరలు కోసి తీసుకుని వచ్చాడు. వాటిని తరిగి ఆ మరుగుతున్న నీళ్ళలో వేశాడు.

అవి ఉడుకుతూంటే ఘుమఘుమ లాడుతూ వాసన బయలుదేరింది. వాసన రావడంతో, భయంకరమయిన సుడిగాలి వీస్తున్న శబ్దం వినిపించిందో లేదో, వెనువెంటనే వీధి తలుపులు బలంగా కొట్టుకున్న శబ్దమయింది. మరు

క్షణంలో ‘బారెడు మీసం – వేలెడు మనిషి’ విసురుగా లోపలికి వచ్చాడు.

అతడు ఉగ్రరూపం దాల్చాడు. అతని కళ్ళు నిప్పుల్లా ఎర్రగా ఉన్నాయి. పళ్ళు పటపట కొరుకుతూ మీసాన్ని మెలివేస్తూ “ఎంత గుండె నిబ్బరంతో నా ఇంట్లోకి అడుగు పెట్టావ్? ఎంత పొగరుతో నా తోటలోని కూరలుకోసి వండుకుంటున్నావ్?” అని గర్జించాడు.

అతని ఆకారాన్ని చూసిగాని, మాటలు వినిగాని చీమంతయినా చలించలేదు ఇంద్రవర్మ. ఎంతో ప్రశాంతంగా ఆ ‘బారెడు మీసం – వేలెడు మనిషి’ వైపు చూస్తూ “అంత బిగ్గరగా అరిచే ముందు దేహాన్ని కూడా కొంచెం పెంచుకుంటే బాగుంటుంది,“ అన్నాడు ఇంద్రవర్మ.

ఇంద్రవర్మ పరిహాసానికి వేలెడు మనిషి ఒళ్ళు భగ్గుమంది. ఇంటితలుపులు రెండింటినీ రెండు చేతులతో పట్టుకుని కోపంతో ఒక్క ఊపు ఊపాడు. భూకంపం వచ్చినట్లుగా ఇల్లంతా దద్దరిల్లిపోయింది. క్రూరంగా ఇంద్రవర్మ మీదికి లంఘించాడు. ఆ వేలెడు మనిషికి వందమంది వీరులకుండే బలం ఉన్నప్పటికీ ఇంద్రవర్మ భయపడలేదు.

ఆ మాయలమారి తెలివితేటలు శూన్యం అని ఇంద్రవర్మకి తెలుసు. యుక్తిగా ఆ మాయలమారి చేతుల్లోనించి తప్పించుకున్నాడు. పైగా తనే ఆ వేలెడు మనిషి బారెడు మీసాన్ని పట్టుకుని ఇంటిచుట్టూ అతన్ని తిప్పడం మొదలుపెట్టాడు.

వేలెడు మనిషి ఇంద్రవర్మ పట్టు విడిపించుకోవడానికి ఎంతో గింజుకున్నాడు. లాభం లేక తనకున్న గొంతంతా పెట్టి అరిచాడు. అయినా ఇంద్రవర్మ వదల్లేదు.

ఇంద్రవర్మ తన బలాన్నంతటినీ వినియోగించి ఏమయితే అవుతుందని గాలిలోకి ఒక్కమాటు ఎగిరాడు. వేలెడు మనిషికున్న బారెడు మీసం తెగిపోయింది. ఆ మీసం కొసలు ఇంద్రవర్మ గుప్పిట్లో ఉండిపోయాయి.

ఆ మాయలమారిని వెంటాడటానికి ప్రయత్నించాడు ఇంద్రవర్మ. కాని వాడు ఆకాశంలోకి ఎగిరి పోయి కొంతసేపటికి మాయమైపోయాడు. చేసేది లేక, ఇక తన అక్కల్ని వెతకడం ఎలాగని ఆలోచించడం మొదలుపెట్టాడు.

దూరంగా ఒక నది కనిపించింది. ఆ నదివైపు నడిచాడు ఇంద్రవర్మ. అక్కడొక పడవ కనిపించింది. ఆ పడవలోకి ఎక్కాడు. "వేలెడు మనిషి ఎక్కడున్నాడో తెలుసా?" అని ఆ పడవలో ప్రయాణం చేస్తున్న ప్రయాణీకులను అందర్నీ దారిపొడుగునా అడిగాడు. ఎవరూ తమకు తెలియదన్నారు. చివరకు అవతల ఒడ్డుకు చేరుకున్నాడు.

ఆ ఒడ్డున ముగ్గురు ముసలి వాళ్ళు పడవ కోసం వేచి ఉన్నారు. వాళ్ళని కూడా అడిగాడు ఇంద్రవర్మ. అందులో ఒకడు "నాకు తెలుసు!" అన్నాడు. ఇంద్రవర్మ ముఖం వికసించింది. వాడెక్కడ ఉన్నాడో చెప్పమని వేడుకున్నాడు.

ఆ ముసలి అతను నవ్వుతూ "వాడు ఎక్కడ ఉండాలని నువ్వు కోరుకుంటే అక్కడే నువ్వూ ఉండగలవు," అన్నాడు. వెంటనే ఇంద్రవర్మ ఆ వేలెడు మనిషి తన అక్కల్ని బంధించిన చోట ఉండాలని కోరుకున్నాడు.

కన్నుమూసి తెరిచినంతలో పెద్దపెద్ద కొండల మధ్య ఉన్నట్లు ఇంద్రవర్మ గ్రహించాడు. అక్కడ చీకటి గుహ ఒకటుంది. ఆ గుహ ద్వారం దగ్గర వేలెడు మనిషి కూచుని ఉన్నాడు. ఇంద్రవర్మని చూడగానే మళ్ళీ ఉగ్ర రూపం దాల్చి "ఇక్కడకి ఎందుకు వచ్చావు?" అని అరిచాడు.

"నా అక్కలకోసం," అన్నాడు ఇంద్రవర్మ.

ఆ మాటలు విని వేలెడు మనిషి వికటాట్టహాసం చేశాడు. ఆ చీకటి గుహలోకి వెళ్ళి తన రెండు హస్తాలతో ఇద్దరు రాకుమార్తెల శిరోజాలను పట్టుకుని బరబరా బయటికి ఈడ్చుకుంటూ వచ్చాడు. ఆ రాజకుమార్తెలు తన అక్కలే అయి ఉంటారని ఊహించాడు ఇంద్రవర్మ. వాళ్ళని సముద్రంలోకి విసిరేస్తానని బెదిరించాడు వేలెడు మనిషి.

కొండల పక్కగా సముద్రపు అలలు ఉప్పొంగుతున్నాయి. కొండలను సముద్రపు అలలు ఢీ కొంటునప్పుడు అవుతున్న శబ్దాలు భయంకరంగా వినిపిస్తున్నాయి. నిజానికి ఆ క్షణంలో వేలెడు మనిషి ఏం చేస్తాడో అని భయపడ్డాడు ఇంద్రవర్మ.

ఇంద్రవర్మ ఉపాయం ఆలోచించాడు. చేతిలోవున్న వీణ మీదకు అతని దృష్టి మళ్ళింది. వెంటనే దాన్ని వాయించడం మొదలు పెట్టాడు. ఆ సంగీతం



వినిపించడంతోనే వేలెడు మనిషి అమాంతం ఆ రాజకుమార్తెలను అక్కడ వదిలేసి నాట్యం చెయ్యడం మొదలు పెట్టాడు. ఎంత ఆగుదామని ప్రయత్నించినా ఆగలేక పోతున్నాడు. ఎంత అరిచినా అతని కాళ్ళు భూమిమీద నిలబడటం లేదు. గాలిలో చక్రంలా తిరుగుతున్నాడు.

అతని బారెడు మీసం గాలి విసురుకి అతని మెడకు బలంగా చుట్టుకుంటోంది. అతనా సుడిగాలిలో కలిసిపోయాడు. ఎంత బలవంతుడయినా, చివరికి తన శరీరాన్ని తనే లోబరుచుకోలేక పోయాడు.

ఇంద్రవర్మ వీణను వదిలేసినా కూడా ఆ వీణ ఇంకా శబ్దం చేస్తూనే ఉంది. ఆ వీణని అక్కడ వదిలేసి తన అక్కల్ని తీసుకుని ఇంద్రవర్మ తన తల్లిదండ్రులవద్దకు వచ్చేశాడు. తన కొడుకు బుద్ధి కుశలతను రాజు మెచ్చుకున్నాడు. ఇంద్రవర్మని ప్రజలు వేనోళ్ళ పొగిడారు.

(రష్యాదేశపు జానపద గాథ)

# బుద్ధి కుశలత

అనగా అనగా ఒక ఊళ్ళో ఒకావిడ ఉండేది. ఆవిడ పేరు నరసమ్మ. ఆవిడకి ఇద్దరు కొడుకులు. వాళ్ళిద్దరికీ కూడా ఆ దగ్గరలోనే ఉండే మరో ఊరు పిల్లలకి ఇచ్చి వివాహం చేసింది. పెళ్ళి ముచ్చట్లు పూర్తి కాగానే నరసమ్మ కోడళ్ళను ఇద్దరినీ తన ఇంటికి తీసుకొచ్చింది.

కోడళ్ళు గంగ, గౌరి ఎంతో వినయ విధేయతలతో మెలుగుతూండేవారు. అత్తగారంటే అమిత భయం. ఎంతో గౌరవం కూడాను. కాపురానికి వచ్చినప్పటి నుంచీకూడా కోడళ్ళిద్దరూ అత్తగారికి ఏ విధమైన పనీ చెప్పకుండా ఇంటి పనంతా చక్కగా చేస్తూ ఉండేవారు. భోజనం, మంచినీళ్ళ దగ్గరనుంచి అన్నీ అత్తగారి గదిలోకి తీసికెళ్ళి పెట్టేవారు.

ఈ విధంగా ఎంతో వినయంగా ఉండేవారు. కానీ, రోజూ అత్తగారు కూర్చున్న చోటికి వెళ్ళి ఆవిడ పాదాలు పట్టుకొని తమ పుట్టిళ్ళకు వెళ్ళేందుకు అనుమతి ఇమ్మని పదేపదే వేడుకుంటూ ఉండేవారు. ఇలా రోజూ పీక్కుతినగా తినగా అత్తగారికి విసుగుపుట్టి చివరికి ఏవిధంగానైనా బుద్ధి చెప్పాలి, మళ్ళీ ఎప్పుడూ పుట్టింటికి వెళతాననకుండా చెయ్యాలని నిశ్చయించుకుంది.

ఒకనాడు కోడళ్ళిద్దరూ అత్తగారికి కడుపు నిండా భోజనం పెట్టి, ఆవిడ పాదాలకు నమస్కరించి పుట్టిళ్ళకు పంపమని వేడుకున్నారు. అత్తగారు చిరునవ్వు నవ్వి "దానికేముంది! అలాగే వెళ్ళిరండి. ఎప్పుడు వెళ్ళాలనుకుంటే అప్పుడే వెళ్లండి," అంది.

కోడళ్ళిద్దరి సంతోషానికీ మేరలేదు. "మా అత్తగారు ఎంత మంచిది!" అనుకున్నారు. వెంటనే అత్తగారు "కాని," అంది. కోడళ్ళకు కంగారు పుట్టింది. "మీరు తిరిగి వచ్చేటప్పుడు నాకు రెండు వస్తువులు తీసుకురావాలి; లేకపోతే మీరింక నా గుమ్మంలో మళ్ళీ అడుగు పెట్టడానికి వీల్లేదు," అంది అత్తగారు.

పుట్టిళ్ళకు వెళుతున్నామనే సంతోషంతో కోడళ్ళిద్దరూ ముందు వెనక ఆలోచించుకోకుండా "అయ్యో, ఈమాత్రానికేనా! తప్పకుండా మీరు కోరే రెండు వస్తువులూ తెస్తాం," అన్నారు.

"అయితేసరే," అంటూ పెద్ద కోడలు గంగతో "ఒక కాగితంలో నిప్పుపెట్టి తీసుకురావాలి," అనీ, చిన్న కోడలు గౌరితో "కాగితంలో గాలిపెట్టి తీసుకురావాలి," అనీ చెప్పింది అత్తగారు.

తమ పుట్టిళ్ళకు వెళదామనే ఆతృతలో తమ మాట ఎలా నిలబెట్టుకోగలమనైనా ఆలోచించకుండా కోడళ్ళు "సరే!" అన్నారు. అప్పుడు భర్తల దగ్గర సెలవు పుచ్చుకుని ప్రయాణమయ్యారు.

సరదాగా కబుర్లు చెప్పుకుంటూ బయలుదేరారు. కొంత దూరం పోయిన తర్వాత, మాటల సందర్భంలో చటుక్కున గంగకి అత్తగారు అడిగిన మాట జ్ఞాపకం వచ్చింది. "గౌరీ, కాగితంలో నిప్పు ఎలా పట్టుకుని వెళ్ళను? మళ్ళీ అత్తవారింటికి వెళ్ళడం ఎలా," అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

గౌరికూడా ఏడవడం ప్రారంభించింది– "నామాటేమిటి? ఒక కాగితంలో గాలిపెట్టి పట్టుకుపోవాలి. ఎవరు మాత్రం చెయ్యగలరాపని? కాగితంలో గాలి పెట్టడం ఎలా?" ఇంక చేతుల్లో ఉన్న సామాను కిందపెట్టి, ఆ రోడ్డు మీద కూర్చుని, తలపట్టుకుని "మన భర్తలకీ మనకీ రుణం తీరిపోయింది. ఇంక మనం కాపురాలకు నీళ్ళు వదులుకోవలసిందే. ఏం గతి భగవంతుడా!" అని వాపోవడం మొదలుపెట్టారు.

కొంతసేపటికి ఒక అమ్మాయి దున్నపోతుమీద ఎక్కి ఆ దారిని పోతూ గంగనీ, గౌరినీ చూసింది. దారిలో కూర్చుని ఏడవడం చూసి ఆశ్చర్యంతో "ఎందుకు ఏడుస్తున్నారు?" అని అడిగింది. వాళ్ళ సమాధానం ఒక్కటే "ఊఁ ...ఊఁ...ఊఁ..." అని.

"ఏడిస్తే కార్యసాఫల్యం కాదు. మన కష్టాలు తీరే ఉపాయం ఏదైనా ఉందేమో ఆలోచించాలి. ఇంతకీ మీకు వచ్చిన కష్టం ఏమిటి?" అంది ఆ చిన్నపిల్ల.

చివరికి గంగ, గౌరి కళ్ళనీళ్ళు తుడుచుకున్నారు.

"మిమ్మల్ని చూస్తుంటే మీ శక్తి చూసుకోకుండా ఎవరికో ఏదో చేసేస్తామని



మాట ఇచ్చినట్లు తోస్తోంది. నాతో మా ఇంటికి రండి. మనందరం బుర్ర ఉపయోగించి మీమాట నిలబెట్టుకునేందుకు ఉపాయం ఆలోచిద్దాం," అని ధైర్యం చెప్పింది ఆ చిన్నపిల్ల.

ఆలోచించి ఏ కార్యాన్ని అయినా సాధించవచ్చునని కలలోకూడా ఊహించలేదు గంగ, గౌరి. ఆ చిన్న పిల్ల తమకు సహాయం చేస్తానని నమ్మించేసరికి సరేనని సంతోషంతో ఆ అమ్మాయితో కూడా బయలుదేరారు.

ఆ అమ్మాయి ఇంటికి వెళ్ళిన తరువాత, ముగ్గురూ దొడ్లో అరుగుమీద కూర్చున్నారు. ఉపాయం ఆలోచించసాగారు.

ఒక్క క్షణం కాగానే ఆ చిన్నపిల్ల ఒక్క పరుగున ఇంట్లోకి దూరింది. ఎందుకెళ్ళిందని గంగ, గౌరి తర్కించుకునే లోపల ఒక లాంతరు పట్టుకుని చక్కా వచ్చింది. ఆ లాంతరు కాగితం లాంతరు. లోపల కొవ్వొత్తి వెలుగుతోంది. దాన్ని చూసిన గంగ సంతోషంతో చప్పట్లుకొడుతూ "భలే దీన్ని మా అత్తగారి దగ్గరికి పట్టుకుపోవచ్చు. కాగితంలో నిప్పు అంటే ఇదే!" అంది.

తను అత్తవారింటికి వెళ్ళే దారి కనిపించక గౌరి చిన్నబుచ్చుకుంది. గౌరి దీనవదనం చూసి ఆ పిల్ల "ఇప్పుడే వస్తాను," అంటూ మళ్ళీ ఇంట్లోకి పరుగెత్తింది. ఏం తెస్తుందోనని గౌరి కళ్ళు ఆశతో ఎదురు చూస్తున్నాయి.

ఒక్క నిమిషంలో విసినకర్ర పుచ్చుకుని బయటకి వచ్చింది. ఆ అమ్మాయి "ఇది పట్టుకుని ఇటూ అటూ గట్టిగా తిప్పు," అని చెప్పింది గౌరితో.

ఆ పిల్ల చెప్పినట్లు ఆ విసినకర్రని ఇటూ అటూ గట్టిగా తిప్పేసరికి గాలి వీచింది. గౌరి హృదయం ఉప్పొంగి పోయింది. "కాగితంలో గాలి," అంటూ అపరిమితానందంతో కేకలు పెట్టింది. ఇంక తనుకూడా భర్త ఇంటికి వెళ్ళగలనంటూ ధైర్యం తెచ్చుకుంది.

ఆ చిన్న పిల్ల బుద్ధి కుశలతను గంగ, గౌరి ఎంతో అభినందించి ఆమెకు కృతజ్ఞత తెలిపి తమ పుట్టిళ్ళకు వెళ్ళిపోయారు.

అక్కడ చాలాకాలం కులాసాగా గడిపి, మళ్ళీ అత్తింటికి బయలుదేరారు. పొద్దున్నే లేచి నరసమ్మ వీధి అరుగులు కడిగి గుమ్మంలో నీళ్ళు జల్లి ముగ్గు పెడుతోంది. దూరం నుంచి బండి చప్పుడు వినిపించింది. బండిలో వచ్చేది ఎవరా అని కొంచెం పరకాయించి చూసేసరికి కోడళ్ళ ముఖాలు కనిపించాయి. ఆశ్చర్యపోయింది నరసమ్మ. వాళ్ళు ఇంటికి వచ్చేవరకూ ఆగలేక పోయింది.

వాళ్ళని దారిలో కలుసుకోడానికి తనే బయలుదేరింది. బండిని ఆపింది. కోడళ్లకేసి ధీమాగా చూస్తూ "అత్తగారి మాటల్ని లెక్క చెయ్యని కోడళ్ళు మళ్ళీ

అత్తింటికి రాగలరా?" అంది. "నేను అడిగిన వస్తువులు రెండూ తెచ్చారా?" అనికూడా అడిగింది.

ఆవిడ అడగడం తడవుగా గంగ తను తెచ్చిన కాగితం లాంతరునీ, గౌరి తను తెచ్చిన కాగితం విసినకర్రనీ బయటకు తీసి చూపించారు.

"అయితే ఎవరో బుర్ర ఉపయోగించి ఉంటారు," అని అరిచింది అత్తగారు. "త్వరగా ఇంట్లోకి వచ్చి అన్నం వండండి," అని కోడళ్ళకి చెప్పి చరచరా తన గదిలోకి వెళ్ళిపోయింది.

(చైనాదేశపు జానపద గాథ)



# పోయిన బల్లెం

అనగా అనగా ఒక కోయరాజు ఉండేవాడు. ఒక రోజు అతను కోయ వీరులను అందరినీ పిలిచాడు. కోయ జాతిలో బలమైన, అందమైన నలుగురు యువకుల మధ్య పోటీ పెట్టాడు. ఈ నలుగురిలో ఎవరైతే తమ బల్లాన్ని ఎక్కువ దూరం విసిరేస్తారో వాళ్ళకి తన చిన్నకూతురు 'కాళి'ని ఇచ్చి పెళ్ళి చేస్తానని తెలియచేశాడు.

ఆ నలుగురిలోనూ ముగ్గురు గొప్ప కోయనాయకుల కొడుకులు. నాలుగవవాడైన శివయ్య మాత్రం ఒక బీద గొర్రెల కాపరి. నలుగుర్నీ దీక్షగా చూసింది కాళి. నలుగురిలోకీ శివయ్య ఆమెకి మొనగాడిలా తోచాడు. శివయ్య మంచి ఆజానుబాహు, విశాలమైన వక్షస్థలం, కండలు తేరి నిగనిగ లాడే శరీరం-- ఎంతో ఆకర్షణీయంగా ఉంటాడు.

పోటీ ప్రారంభమయింది. మొదటి వీరుడు విసిరిన బల్లెం ఎంతో దూరాన ఒక చీమల పుట్టలో పడింది. రెండవవాడు విసిరిన బల్లెం ఆ చీమలపుట్టకు కొంచెం దూరంలో ఉన్న ఒక పత్తి మొక్కలో గుచ్చుకుంది. మూడవవాడు విసిరిన బల్లెం ఇంకా ఎంతో దూరంలో చెట్టుమీద ఎగురుతున్న పక్షికి తగిలింది.

శివయ్య తనకున్న బలాన్నంతనీ ఉపయోగించి విసిరేటప్పటికి ఆకాశంలో ఎంతో ఎత్తున ఎగురుతున్న డేగకు తగిలింది. ప్రేక్షకులందరూ సంతోషంతో చప్పట్లు కొట్టారు. శివయ్యే గెలిచాడని అంతా అనుకున్నారు. కాళి హృదయం ఉప్పొంగిపోయింది.

కానీ, ఒక బీద గొర్రెల కాపరి అయిన శివయ్యను తన కూతురికి భర్తగా చెయ్యడం ఇష్టం లేకపోయింది కోయరాజుకి. రాజు కోపంతో "ఈ శివయ్య బల్లానికి ఏదో మంత్రశక్తి ఉండి ఉంటుంది. అంచేత రేపు పోటీ మళ్ళీ జరుగుతుంది. బల్లేలను నేనే ఇస్తాను," అన్నాడు.

మరునాడు రాజు ఆ నలుగురికీ బంగారపు బల్లాలను ఇచ్చాడు. కాని నాయకుల కొడుకులు ముగ్గురికీ తిన్నని బల్లాలను ఇచ్చి, శివయ్యకి మాత్రం వంకర బల్లాన్ని ఇచ్చాడు రాజు. అయినప్పటికీ మిగిలిన ముగ్గురినీ ఓడించాడు శివయ్య.

తన ఆలోచన ఫలించలేదని రాజు ఉగ్రుడైపోయాడు. ఎలా అయినా శివయ్య ఓడిపోయేటట్లు చెయ్యడానికి మరో ఉపాయం ఆలోచించాడు.



"నువ్వు విసిరిన బల్లాన్ని తిరిగి తీసుకువస్తేగాని నా కూతురుని ఇచ్చి వివాహం చెయ్యను," అని గర్జించాడు.

పాపం అధైర్యంతో కాళి బిగ్గరగా ఏడ్చింది. రాజు జాలిపడలేదు. పైగా మరింత క్రూరంగా "బుద్ధిలేకుండా ఏడుస్తావేం? నువ్వెవర్ని వివాహం చేసుకోవాలో నిర్ణయించేది నేను," అన్నాడు. ఎక్కడో పర్వతాల మీద మేఘాల్లో మాయమైన బల్లెం వెతికి సంపాదించడం అంత సులభమైన పనికాదని శివయ్యకి కూడా తెలుసు.

శివయ్య కాళిని మనసారా ప్రేమించాడు. ఆమె కోసం ఎంతయినా కష్టపడటానికి సంసిద్ధుడయ్యాడు శివయ్య. మూడు రోజులపాటు ఆ భయంకరమైన పర్వత ప్రదేశంలో బల్లెంకోసం వెతికాడు.

నాలుగో రోజున ఆలోచిస్తూ ఆ పర్వతాల మధ్య ఒక లోయలోకి చూస్తున్నాడు. ఇంతలో ఒక డేగ ఒక కప్పని కరుచుకుని అక్కడ వాలింది. రక్షించమని దీనంగా విలపించింది కప్ప. శివయ్య హృదయం కరిగింది. వెంటనే డేగనుంచి కప్పను రక్షించాడు.

కప్ప ఎంతో సంతోషించింది. శివయ్యకి తన కృతజ్ఞత తెలుపుతూ "నువ్వు ఎప్పుడయినా కష్టాల్లో ఉంటే నన్ను తలుచుకో. నాకు చేతనైన సహాయం చేస్తాను," అంది కప్ప. ఆ మాటలు చెప్పి రాళ్ళ మధ్యకు దూరి మాయమైపోయింది కప్ప.

కొంతదూరం పోయేసరికి పసుపు చుక్కలున్న నల్లటి సీతాకోకచిలకని చూశాడు శివయ్య. దానిరెక్క ఒకటి ముళ్ల మొక్కలకి తగులుకుంది. దానినుంచి విడిపించుకోలేక బాధపడుతోంది సీతాకోకచిలుక. రెక్కలో కన్నం పడి పోతోంది. శివయ్య దాన్ని చూసి ఎంతో జాగ్రత్తగా విడిపించాడు.

కప్పలాగే సీతాకోకచిలుక కూడా శివయ్య సహాయానికి సంతోషించి "నువ్వు ఎప్పుడన్నా కష్టాల్లో ఉంటే నేను వచ్చి సహాయం చేస్తానని," చెప్పి ఎగిరిపోయింది.

అయిదవ రోజున శివయ్య ఇంకా అలా తిరుగుతూండగానే చీకటి పడిపోయింది. పోనీ చంద్రుని వెలుగు ఉందా అంటే చంద్రుడిని కాస్తా పొగమంచు మింగేసింది. ఆ రాత్రికి ఏదైనా స్థలం దొరుకుతుందేమోనని వెతకడం ప్రారంభించాడు శివయ్య. అలా వెతుక్కుంటూ వెతుక్కుంటూ వెళ్ళే సరికి ఒక గుహ కనిపించింది. ధైర్యం చేసి శివయ్య ఆ గుహలోకి ప్రవేశించాడు. ఏవో పెద్దపెద్ద నీడలు భయంకరంగా కనిపిస్తున్నాయి. కళ్ళు మూసుకుని అక్కడ శివయ్య మొండిగా నిద్రపోయాడు.

అతనికి మెలకువ వచ్చేసరికి గుహంతా చీకటిమయంగా ఉంది. ఏదో మృదు మధురమైన సంగీతం వినిపిస్తోంది. ఆ ధ్వని వచ్చిన దిక్కుకి పిల్లిలా చప్పుడు చెయ్యకుండా వెళ్ళాడు. అతను ముందుకి అడుగులు వేస్తున్న కొద్దీ ఆ గుహ విశాలం అవుతూ వచ్చింది.

ఆ సంగీతం అడుగడుక్కీ మరింత స్పష్టంగా వినిపించసాగింది. సన్నని వెలుతురు కూడా ప్రసరించింది. ఆ గుహలోని ఆ వెలుతురు క్రమంగా వృద్ధి అయి, చివరికి గుహ అంతా ఒక బ్రహ్మాండమైన వెలుగుతో నిండిపోయింది. స్తంభాలలోని వజ్రాలకాంతి గుహ గోడల నిండా ప్రసరిస్తోంది.

అతని ఎదుట ఒక సరస్సు ప్రత్యక్షమయింది. నీలిరంగు ముఖ్‌మల్ గుడ్డ పరచినట్లుగా ఆ సరస్సు మిలమిల మెరుస్తోంది. ఆ సరస్సు మధ్యగా ఒక ద్వీపం ఉంది. మధ్య ఒక రత్నాల సింహాసనం, దాన్ని ఎక్కేందుకు పచ్చలు పొదిగిన బంగారు సోపానం! గుహ అంతా రకరకాల వెలుగులతో నిండిపోయింది.

ఆ సరస్సు అనంతంగా ఉన్నట్లు తోచింది శివయ్యకి. ఆకాశం, భూమీ కలుసుకునేచోట ఈ సరస్సు అంతమైందేమోనని అనిపిస్తోంది. ఆ నీలిరంగు నీళ్ళల్లో స్వచ్ఛమైన కలువ పువ్వులు నాట్యమాడుతున్నాయి.

ఈ కలువ పువ్వుల వద్ద నుంచే ఆ మృదుమధుర సంగీతం వస్తోంది. అటువంటి ప్రకృతి సౌందర్యాన్ని శివయ్య ఇంతకుముందు ఎప్పుడూ తిలకించలేదు. గగనంలోని నక్షత్రాల్లాగ ఉన్నాయి ఆ కలువలు.

నాట్యం చేసిచేసి చివరికి ఆ కలువలు దేవకన్యల్లా మారాయి. ఆ సరస్సు మధ్య ఉన్న ద్వీపంచుట్టూ జ్యోతులకు మల్లే చేరారు ఆ దేవకన్యలు. ఇదంతా నోరు తెరుచుకుని చూస్తున్నాడు శివయ్య. ఇదంతా కలో నిజమో తెలియటంలేదు అతనికి.

అన్నీ స్పష్టంగా కనిపిస్తున్నాయి గాని ఆ ద్వీపం మధ్య ఉన్న సింహాసనం మీద కూర్చున్న వ్యక్తి మాత్రం అతనికి స్పష్టంగా కనిపించడం లేదు. ఆ సింహాసనం అంతా వెలుగుతో నిండిపోయింది. ఆ వెలుగులో ఆ వ్యక్తి ముఖం కనిపించడం లేదు.

అకస్మాత్తుగా సంగీతం ఆగిపోయింది. సింహాసనం మీద కూర్చున్న ఆ మనిషి సింహాసనం దిగి, మెట్లుదిగి నీటిదాకా నడిచింది. అక్కడ నుంచుని చెయ్యిచాచి ఎలుగెత్తి "శివయ్యా, నీ కోసమే మేమంతా ఎదురు చూస్తున్నాం, ఇటురా," అంటూ పిలిచింది.

తక్షణం ఒక బంగారు నావ శివయ్య ఎదుట ప్రత్యక్షమయింది. అనుమానించకుండా అతను అందులోకి ఎక్కాడు. మెరుపు తీగలా ప్రయాణం చేసింది ఆ నావ. ఒక్క క్షణంలో సరస్సు మధ్యనున్న ద్వీపానికి చేరుకున్నాడు.

ఒడ్డుకి చేరుకున్నాక ఆ వెలుగు మనిషి ఒక దేవకన్యలా అనిపించింది. నల్లటి జుట్టుమీద నక్షత్రాల కిరీటాన్ని ధరించింది. వెండిలా ధగధగలాడే వస్త్రాలు, ముఖంలో సహజంగా ఏదో కాంతి. ఆమె చిరునవ్వు నవ్వితే వెన్నెలలు ప్రసరిస్తున్నాయి!

శివయ్య భుజాన్ని పట్టుకుని "ఈ చంద్రమండలాన్ని పరికించమని నిన్ను హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాం," అంటూ అతన్ని ఆ మెట్లు ఎక్కించి తన సింహాసనం మీద తన పక్కనే కూర్చోబెట్టుకుంది.

"శివయ్యా! నువ్వు పోయిన బల్లాన్ని వెతుకుతున్నావని నాకు తెలుసు. అది లభిస్తేగాని నీకు రాజకుమార్తె భార్యకాదు. నువ్వు బల్లాన్ని విసిరిన తర్వాత చంద్రుడు అయిదు సార్లు భూమిమీద విహరించాడు. ఇది ఆరవరాత్రి... రేపురాత్రి

పూర్తయేలోపుగా ఆ బల్లాన్ని నువ్వు సంపాదించలేకపోతే ఎల్లుండి ఉదయమే ఆ రాజకుమార్తెకు మరొకరితో వివాహం జరిగిపోతుంది," అని చెప్పింది ఆ వెన్నెలరాణి.

శివయ్య "ఓ రాణీ! నీ సేవకుడు ఏం చెయ్యమంటే అది చేస్తాడు. బల్లెం దొరికే ఉపాయం మాత్రం చెప్పు," అని దీనంగా వేడుకున్నాడు.

"బల్లెం నీకు సులభంగా లభిస్తుంది. మా గుహముందే పడింది ఆ బల్లెం. దాన్ని ఖజానాలో దాచాం. పెత్తనం నాదే. వెంటనే దాన్ని నీకు ఇచ్చేసేదాన్ని కానీ, అది మహారాజుది. ఇలా ఫలానా మానవుడు తను విసిరిన బల్లాన్ని వెతుక్కుంటూ వస్తాడు అని ఆయన ఏనాడో మాకు చెప్పాడు. అతని శక్తిని రెండు విధాలుగా పరీక్షించి, ఆ పరీక్షలో అతను నెగ్గినట్లయితేనే అతనికి ఆ బల్లాన్ని ఇవ్వండి అని చెప్పాడు. పైగా ఆ పరీక్షలో ఓడిపోతే తన ప్రాణాల్ని వదులుకోవలసి ఉంటుందని కూడా చెప్పాడు," అంది వెన్నెల రాణి.

అలా చెప్పి ఆ వెన్నెల రాణి సింహాసనం మీదనుంచి లేచింది. వడివడిగా నీటివైపు నడిచి శివయ్య వచ్చిన బంగారు నావలోకి ఎక్కి క్షణంలో మాయమైపోయింది.

ఇంతలో ముగ్గురు వెన్నెల కన్యలు వచ్చి శివయ్యని మరొక బంగారు నావలోకి ఎక్కించి తమతోకూడా ఎక్కడికో తీసుకుని వెళ్ళారు.

వింత తరువాత వింత -- ఆశ్చర్యంలో మునిగి తేలుతున్నాడు శివయ్య. ఆ సరస్సు వెనక అనేక గదులు ఉన్నాయి. అవి అన్నీ రత్నాలు, వజ్రాలతో నిండి ఉన్నాయి. అన్ని గదులూ దాటిన తర్వాత శివయ్యకి మరింత ఆశ్చర్యం కలిగేలాగ అనుకోకుండా ఒక చీకటిగది వచ్చింది. ఆ గదిలో అడుగు పెట్టడానికి భయంకరంగా ఉంది. నిజంగా శివయ్యకి వొణుకు పుట్టింది.

అయినా రాజకుమార్తె వివాహం గుర్తుకు వచ్చేటప్పటికి ఎక్కడలేని ఆవేశం, పట్టుదల, ధైర్యం పుట్టుకుని వచ్చాయి. తనను తిరిగి వెన్నెల రాణి వద్దకు తీసుకుని వెళ్ళమని చెప్పాడు ఆ వెన్నెల కన్యలతో. వెంటనే వాళ్ళు వెన్నెలరాణి

ఎదుట ఉన్నారు.

శివయ్యని చూడగానే ఆ వెన్నెలరాణి లేచి నుంచుని "శివయ్యా, నువ్వు నెరవేర్చవలసిన ప్రథమ కర్తవ్యాన్ని నిశ్చయించాం. ఇప్పుడు నువ్వొక చీకటి గదిని చూశావు. ఆ గదిని తక్కిన గదులకు మల్లే ప్రకాశవంతంగా చెయ్యాలి. తెల్లవారే లోపల ఈపని చెయ్యలేకపోతే నువ్వు నీ ప్రాణాల్ని వొదులుకోవలసి వస్తుంది," అని చెప్పింది.

అంచేత తిరిగి ఆ వెన్నెలకన్యలు శివయ్యని చీకటి గదిలోకి తీసుకుపోయారు. ఆ గదినిండా నీళ్ళున్నాయి. అతనికి ఒక బంగారునావని ఇచ్చి అతన్ని ఆ గదిలో వదిలేశారు.

శివయ్యకి ఏం చెయ్యాలో తోచలేదు. తన బలాన్ని పరీక్షిస్తారేమో అనుకున్నాడు కాని, ఇటువంటి మాయతో కూడిన పనుల్ని సాధించమంటే ఎలా సాధించగలడు? సాధించలేకపోతే తను చచ్చిపోవాలి అని తనలో తను అనుకున్నాడు. ఇక తను ఈ లోకంలోని సౌందర్యాన్ని చూసి ఆనందించలేడు. ఈ లోకంలో చూడదగినవీ, అందమైనవీ ఎన్నో ఉన్నాయి. తన రాజకుమార్తె, పువ్వులు, పక్షులు, రంగురంగుల సీతాకోకచిలుకలు...

'సీతాకోకచిలుకలు,' జ్ఞాపకానికి రాగానే "ఓ సీతాకోకచిలుకా! ఈ సమయంలో వచ్చి సాయం చేయకూడదూ?" అని అనుకున్నాడు. కానీ సీతాకోకచిలుక వచ్చి సహాయం చేస్తుందనే నమ్మకం లేదు అతనికి. తను ఈ కార్యాన్ని ఎలాగూ సాధించలేడని నిశ్చయించుకుని ఆ నావలోనే నిద్రపోయాడు.

అయితే శివయ్య తనకు ఒకప్పుడు చేసిన మేలును సీతాకోకచిలుక మరిచిపోలేదు. శివయ్య పరిస్థితి తెలుసుకుంది. వెంటనే తన బంధువుల్ని, స్నేహితులయిన మిణుగురు పురుగుల్నీ తీసుకుని శివయ్య ఉన్న చీకటి గదిలోకి ప్రవేశించింది. మిణుగురు పురుగులతో గది అంతా వెయ్యి దీపాల కాంతితో నిండిపోయింది. ఆ వెలుగులో రంగు రంగుల సీతాకోకచిలుకలు గదిని రకరకాలుగా అలంకరించాయి.

శివయ్యకు మెలకువ వచ్చి చూశాడు. తన కళ్ళని తానే నమ్మలేక పోయాడు. తెల్లవారగానే శివయ్యని చూడటానికి వెన్నెలరాణీ, రాజు, సహచరులు వచ్చారు.

గదిలో మార్పు గమనించి నిశ్చేష్టులయ్యారు. "మానవుడు గెలిచాడు!" అంటూ ఉత్సాహంతో కేకలు వేశారు. శివయ్యని తమతోబాటు సరస్సుమధ్య ఉన్న ద్వీపం మీదికి తీసికెళ్ళి నాట్యాలతో అతనికి వినోదాన్ని కలిగించారు.

సాయంకాలం కాగానే వెన్నెల రాణి శివయ్యని పిలిచి అతను నెరవేర్చవలసిన రెండవ పనినికూడా చెప్పింది. "నేను ధరించే వస్త్రాల్ని ఈగరెక్కలతోటి తయారుచేశారు. ఇప్పుడా రెక్కలు దొరకడంలేదు. రేపు తెల్లవారే లోపుగా గదిలో వంద నావలను ఈగ రెక్కలతో నింపి వెయ్యాలి," అని చెప్పింది.

ఆ రాత్రి శివయ్యకి ఒక బంగారు నావను, మరో వంద ఖాళీ నావలను ఇచ్చి గదిలోకి పంపారు. ఈ పని వెనకటి పని కన్నా కష్టంగా తోచింది శివయ్యకి. నిరాశతో 'నేనిక తిరిగి సూర్యోదయాన్ని చూడలేను; తిరిగి చిరుతపులులను వేటాడలేను; తిరిగి ఆ పర్వతాలను, వాటి మధ్య ప్రవహించే పిల్ల కాలవలనూ, తిరిగి ఆ నీటి గుంటలో నేను రక్షించిన కప్పనీ చూడలేను,' అనుకొని విచారంగా నిట్టూర్చి నిద్రపోయాడు.


కప్ప శివయ్య మాటలు వింది. కప్ప తన బంధువుల్నీ, స్నేహితులయిన బల్లుల్నీ పిలిచింది. అన్నీ కలిసి లెక్క లేనన్ని ఈగల్ని పట్టి చంపాయి. కొద్దిసేపట్లోనే గదిలోని నావలన్నీ ఈగరెక్కలతో నిండిపోయాయి. ఇవి చేస్తున్న చప్పుడుకి శివయ్య మేలుకున్నాడు. తను చెయ్యవలసిన పని పూర్తి అయిపోయింది. అతని ఆనందానికి అంతులేదు.

మర్నాడు ఉదయమే వెన్నెలరాణి వచ్చి ఈ దృశ్యాన్ని చూసింది. శివయ్య గొప్పతనాన్ని కొనియాడుతూ అతని బల్లాన్ని అతనికి ఇచ్చేసింది.

పోయిన బల్లెం దొరికింది. రివ్వున బాణంలా తన గ్రామానికి వెళ్ళాడు శివయ్య. ఆ బల్లాన్ని తీసుకుని రాజుగారింటికి వెళ్ళాడు. సరిగ్గా అదే సమయానికి

మరో కోయవీరుడికి ఇచ్చి రాజకుమార్తెకు వివాహం చేయబోతున్నాడు కోయరాజు. బల్లాన్ని చూడగానే కోయరాజు తన మాటను నిలబెట్టుకోవలసి వచ్చింది. రాజకుమార్తె కాళిని శివయ్యకి ఇచ్చి వైభవంగా వివాహం చేశాడు.

(దక్షిణాఫ్రికా జానపద గాథ)



# మూడు కోరికలు

చాలాకాలం కిందట పంతులు, సీతమ్మ అనే వృద్ధ దంపతులు ఉండేవారు. వాళ్ళు ఒక చిన్న పల్లెలో ఉండేవారు. వాళ్ళిద్దరికీ కూడా అన్న వస్త్రాదులకి లోటు లేదు. నిజానికి ఈ ప్రపంచంలో వాళ్ళకి కావలసింది ఇంకేమీ లేదు. ఉన్నంతలో సుఖంగానే కాలక్షేపం చేయవచ్చు.

అయితే, ఉన్న దాంతో సంతృప్తి చెంది, భగవంతుడు చేసిన ఆ మాత్రం మేలుకి సంతోషించక నిత్యం ఇద్దరూ కూచుని ఇరుగుపొరుగు వాళ్ళకున్న మంచి మంచి వస్తువులన్నీ వాళ్ళకు కూడా ఉండాలని భగవంతుణ్ణి కోరుతూండేవారు.

ఒక రోజున సీతమ్మ కుంపటి దగ్గర కూర్చుని వంట చేస్తోంది. భార్య పక్కనే కుర్చీపీట వేసుకుని పంతులు కూర్చుని ఉన్నాడు. తన ఇంటివైపు ఒకసారి చూసి, "అబ్బా! వెధవ గుడిసె, ఇది గాడిదలు ఉండవలసిన ప్రదేశం కాని మానవ మాత్రులకు తగినదికాదు. మన కర్మ ఇలా ఉంది. చూడు! మన పొరుగింటి పాపయ్య ఎంత అదృష్టవంతుడో! మంచి పెంకుటిల్లు ఉంది. దానికి తోడు అర ఎకరం భూమికూడా ఉంది. ప్రపంచంలో ఆనందించడానికి అంతకంటే ఏం కావాలి?" అన్నాడు భార్యతో.

సీతమ్మ అన్నం వారుస్తూ భర్త మాటలు వింది. "పాపయ్య ఇల్లు బాగానే ఉంది. కాని, ఉంటే శుభ్రంగా జమిందారు గారి భవనంలాటిది ఉండాలి. అదీ అదృష్టం అంటే," అంది.

పంతులికి కనిపించిన లోటు అదొక్కటే కాదు. "మన దురదృష్టం కాకపోతే వెధవ ముసలి ఆవు మన సొత్తుకావాలా! శుభ్రంగా నిగనిగలాడే పాపయ్య ఎడ్లుచూడు ముచ్చటగా!"

"మీరన్న మాట నిజమే! మన ఆవు కంటే వాళ్ళ ఎడ్లు నయం. అయినా, చక్కగా జమిందారు గారి పెద్ద కొడుకు స్వారీచేసే తెల్లటి గుర్రం ఉంది చూశారా!

దాని వీపుమీద ఎర్రటి ముఖమల్ గుడ్డ కప్పుతారు. బంగారపు కళ్ళెం కూడా ఉంది. అటువంటిది ఉంటే ఎంత బాగుంటుంది!"

"అదేమోగాని కోరకుండానే కొందరికి తంతే బూరెల బుట్టలో పడ్డట్టు అదృష్టం పుట్టుకొస్తుంది. మనం ఎన్ని కోరినా ఆ భగవంతుడు కనికరించడు కదా!" అంది నిరాశపడుతూ సీతమ్మ.

ఆ మాటలు అన్నదో లేదో వాళ్ళు పూజ చేసే దేముడి పటంలోంచి ఒక దేవత అమాంతం వెయ్యి దీపాల వెలుగు విరజిమ్ముతూ ప్రత్యక్షమయింది. ఆ దేవత ఎంత అందంగా ఉందని! ఇంతా చేసి పదంగుళాలు కూడా లేదు ఆ దేవత ఎత్తు. ఆమె ధరించిన శ్వేత వస్త్రాలు చూస్తే వంటినిండా పొగలు కప్పుకుందా అనిపిస్తుంది. ఆవిడ శిరస్సుని అలంకరించిన కిరీటంలో నక్షత్రాలు పొదిగినట్లుగా



కనిపిస్తోంది. ఆవిడ చేతిలో బంగారపు కాగడా ఉంది.

"నేను అదృష్ట దేవతని! నేను మీ బాధ తెలుసుకున్నాను. మీరు కోరినవాటిని ప్రసాదించడానికి నేను ఇక్కడికి వచ్చాను. మీరు ఇద్దరూ మూడు కోరికలు కోరుకోవాలి. ఒకటి నువ్వు, మరొకటి నీ భార్య, మూడవది మీరిద్దరూ కలిసి కోరుకోవాలి. నేను మళ్ళీ రేపు ఉదయమే మీకు కనిపిస్తాను," అని చెప్పింది దేవత. ఇంకా ఏం చెపుతుందా అని వాళ్ళు ఎదురు చూస్తుండగానే ఆ దేవత క్షణంలో మాయమైపోయింది.

ఇంక ఆ వృద్ధ దంపతుల ఆనందానికి మేరలేదు. మూడు కోరికలు! వాళ్ళ ఇష్టం, ఏమైనా కోరుకోవచ్చు. ఏం కోరుకోవాలి అని వాళ్ళు దీర్ఘంగా ఆలోచించడం మొదలు పెట్టారు. పొరిగింటి పాపయ్యకు ఉన్న అదృష్టం తనకూ పట్టాలని పంతులు కోరిక.

అయితే, సీతమ్మ మాత్రం అంత అల్ప సంతుష్టి కాదు. ఆమె కోరికలు రెక్కలు కట్టుకుని ఎంత ఎత్తయినా ఎగురుతాయి. "పెద్ద భవనం! అందులో పెద్ద పెద్ద గదులు, మంచి మంచి తివాసీలు, పట్టె మంచాలు, ఒంటినిండా నగలు, బోలెడు జరీ చీరలు, నౌకర్లు చాకర్లు," ఆవిడ కోరికలకు అంతులేదు.

కానీ వీళ్ళు కోరుకోవలసినవి మూడే. కోరుకోవాలనుకునేవి లక్షలు! వాళ్ళ కోరికల్లో మూడింటిని ఎంచుకోవడం అంత సులభమయిన పనికాదు. అంచేత, "తీరికగా మర్నాడు ఆలోచించుకోవచ్చులే," అనుకుని వేరే విషయాలు మాట్లాడుకోవడం మొదలుపెట్టారు.

"ఇవ్వాళ పొద్దున్న నేను పాపయ్య ఇంటికి వెళ్ళాను. వాళ్ళు చక్కగా పరవాన్నం చేసుకుంటున్నారు. ఏలక్కాయలు, అవీ వేశారు కాబోలు, ఎంత ఘుమఘుమలాడిందనుకున్నావ్! వాళ్ళకేం! వాళ్ళు ఎన్ని పిండివంటలయినా వండుకుంటారు. మనకి మల్లే నానాగడ్డి తినడానికి వాళ్ళ కర్మం ఏం కాలింది!" అన్నాడు భోంచేస్తూ పంతులు.

"నిజమేనండీ పరవాన్నం తిని ఎన్నాళ్ళయిందో! పరవాన్నం ఇప్పుడుంటే

ఎంత బాగుంటుంది!" అంది లొట్టలేస్తూ సీతమ్మ. ఆ మాటలు అనడం పూర్తి చేసిందో లేదో మరుక్షణంలో దేముడిపటం ముందు ఒక గిన్నెతో పరవాన్నం ప్రత్యక్షమయింది. సీతమ్మ నివ్వెరపోయింది. అలాగే నోరు తెరుచుకు చూస్తూ నిలబడిపోయింది. పంతులు ఒళ్ళు భగ్గుమంది.

"నీకెంత దురాశే! వెధవ పరవాన్నం లేకపోతేనేం? చూడు, అప్పుడే ఒక వరం పాడుచేశావు," అంటూ పళ్ళు పటపట కొరుకుతూ "నిన్నేం చేసినా పాపంలేదు. ఆ వెధవ పరవాన్నం నీ ముక్కుకి పట్టుకున్నా బాగుండేది," అన్నాడు.

వెంటనే ఆ పరవాన్నం ముద్దలా అయిపోయి సీతమ్మ ముక్కుకి పట్టుకుంది. ముసలి పంతులు ఆశ్చర్యంతో కెవ్వున కేక వేశాడు. సీతమ్మ మొగుడిని దుమ్మెత్తిపోసింది. తల ఎంత ఆడించినా, ఎంత విదిపినా పరమాన్నం ముద్ద మాత్రం ఊడిపడలేదు. "చూడండి! మీ బుద్ధిహీనతవల్ల ఎంతపని జరిగిందో! పోనీ నేను పరవాన్నం కోరాను. అది దొరికింది. తిన్నా బాగుండేది. మీరు చూడండి!" అని అరిచింది.

అవకాశం దొరికిందని కుక్క, పిల్లి కలిసి పరవాన్నం ముద్ద అందుకునేందుకు సీతమ్మ మీదికి ఉరకడం ప్రారంభించాయి. సీతమ్మని ఇష్టం వచ్చినట్లు రక్కుతున్నాయి. వాటిని తరిమెయ్యడానికి ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదు.

"ఈ వెధవ పరవాన్నంముద్ద నా ముక్కునించి ఊడిపోవాలని నేను కోరుకుంటాను," అంది సీతమ్మ.

"నీకు పుణ్యం ఉంటుంది. ఆ పనిమట్టుకు చెయ్యకు. మనం కావాలనుకుంటున్న పొలం మాటేమిటి?" అన్నాడు పంతులు కంగారుగా.

"నాకు పొలం అక్కర్లేదు, ఏమీ అక్కర్లేదు," అంది సీతమ్మ.

"నామాట వినవే. పొలం కాకపోతే పోనీ, నువ్వు అనుకున్న భవనాన్ని అయినా కోరుకోవే!" అన్నాడు పంతులు.

"నాకదీ అక్కర్లేదు," అంది సీతమ్మ. "నువ్వు ఎంతో మంచిదానివి, నామాట విను. మనం ఎంతో ధనవంతులమయితే నీ ముక్కుకి పట్టుకున్న పరవాన్నాన్ని కప్పేందుకు ఏదైనా ఆభరణం చేయించుకోవచ్చులే," అన్నాడు లాలనగా పంతులు.

ససేమిరా విననంది సీతమ్మ.

"అయితే సరే! మనం మునుపటిలాగే ఉండాలి," అన్నాడు పంతులు. "అవును, అదే నేను కోరేదీ," అంది సీతమ్మ. ఇది భార్యాభర్తలిద్దరూ సంప్రదించుకుని కోరిన కోరిక కాబట్టి వెంటనే వాళ్ళ మూడవ కోరిక కూడా నెరవేరింది. పంతులు, సీతమ్మా ఎప్పటిలాగే ఉండిపోయారు.

(స్పెయిన్ దేశపు జానపద గాథ)

# వీరన్న శౌర్యం

అనగా అనగా వీరన్న అనే కుర్రవాడు ఉండేవాడు. అతని చిన్నతనంలోనే తల్లి చచ్చిపోయింది. అప్పటినుంచీ ఎన్నేళ్ళబట్టో వాళ్ళ ఇంట్లో నమ్మకంగా ఉంటున్న దాసీ రత్తమ్మ వీరన్నని జాగ్రత్తగా పెంచుతూ వచ్చింది. వీరన్నకి చక్కని జుట్టు ఉండేది. వీరన్నకి చిన్నప్పుడు జడవేసి పువ్వులు పెట్టేది రత్తమ్మ. ఆడుకోవడానికి లక్క పిడతలు, గిలకలు, కాగితం గొడుగులు, టమ-టమ బళ్ళూ కొనిపెట్టేది. ఎంతో గారాబంగా పెంచుతోంది.

ఒకసారి వాళ్ళ వీధిలో ఒక ఊరేగింపు వస్తోంది. వీరన్న, రత్తమ్మా అరుగుమీద కూర్చున్నారు. ఒక సవారీలో ఒక అందమైన అమ్మాయి, ఇద్దరు దాసీలూ కూర్చుని ఉన్నారు. వీరన్న తండ్రి ధర్మయ్య ఆ సవారీ వెనక గుర్రం మీద వస్తున్నాడు. ముందు బాజాలు, వెనక ఊళ్ళోని రైతులు, పెద్దలు, పిన్నలు, అంతా వస్తున్నారు. ఆ సవారీ వచ్చి వీరన్న ఇంటి ముందే ఆగింది. "రత్తమ్మా! ఏమిటిది?" అన్నాడు వీరన్న అమాయకంగా.

"మీ నాన్న నీకో మంచి అమ్మని తీసుకొచ్చాడు. ఆ సవారీలోనించి దిగుతున్నావిడే మీ అమ్మ," అంది రత్తమ్మ.

వీరన్న సవతి తల్లి పేరు సత్యవతి. భర్త ఇంటికి వచ్చిన మర్నాటి నుంచీ వీరన్నని చూసి ఏవగించుకోవడం మొదలుపెట్టింది సత్యవతి. భర్తతోటి "వీడు తినడం, పడుకోవడం తప్ప ఏమీ చెయ్యడం లేదు. ఉట్టి సోమరిపోతు. ఎందుకూ పనికి రాడు," అని చాడీలు చెప్పడం మొదలుపెట్టింది.

ఇలా రోజూ చాడీలు చెప్పిచెప్పి చివరికి ధర్మయ్య మనస్సు విగిరిపోయేలా చేసింది. వీరన్న మీద విసుగు, కోపం కలిగాయి ధర్మయ్యకి. కొడుకుని సరిగ్గా ఆదరించడం మానేశాడు. వాడిప్పుడు సవతితల్లి, తండ్రీ తినగా మిగిలిన ఎంగిలి మెతుకులు తింటున్నాడు. మాసిన బట్టలే కడుతున్నాడు.

ఒక రోజున ఆ ఎంగిలి మెతుకులుకూడా వీరన్నకి దొరకలేదు. పైగా సత్యవతి ఒళ్ళు వాచిపోయేలా కొట్టింది. ఇక ఆ కుర్రాడికి దుఃఖం ఆగలేదు. తండ్రి దగ్గరికి వెళ్ళి కాళ్ళ మీద పడి ఏడ్చాడు. ధర్మయ్యకి రవంతకూడా జాలి కలగలేదు. పైగా సమయం దొరికింది కదా అని వీరన్నని ఇంట్లోనించి గెంటేస్తానని బెదిరించాడు.

వీరన్నని రత్తమ్మ ఎంతో ఓదార్చింది. అయితేనేం, రోజురోజుకీ సత్యవతి చెప్పే చాడీలు ఎక్కువైపోయాయి. చివరికి వీరన్న తనకి ఏదైనా అపకీర్తి తెచ్చేలోపలే వాడిని ఏదో విధంగా ఇంట్లోంచి గెంటెయ్యాలని ధర్మయ్య నిశ్చయించుకున్నాడు.

వీరన్న ఒక రోజున ఊరి చివర అడవి ప్రదేశంలోకి నడిచి వెళ్ళాడు. చెట్లకి రకరకాల పువ్వులు సువాసనలను విరజిమ్ముతున్నాయి. అయినా అవి ఆనాడు వీరన్నని ఆకర్షించలేదు. తనమీద తండ్రికి ఎందుకింత అసహ్యం కలిగింది అనే వీరన్న ఆలోచిస్తున్నాడు. అక్కడ ఒక చిన్న కాలవ ఉంది. ఆ కాలవగట్టున చెట్టుకింద కూర్చుని వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టాడు.

ఇంతలోకే అక్కడికి ధర్మయ్య వచ్చాడు. తండ్రిని చూడగానే వీరన్న లేచి నుంచున్నాడు. తండ్రిముఖం చూసి వీరన్న భయపడ్డాడు. ధర్మయ్య కోపంతో పళ్ళు పటపట కొరుకుతూ "నా వంశ గౌరవం నిలబెట్టి, నా పరువు, కీర్తీ వృద్ధి చేస్తావనుకున్నాను. అయితే, నా కర్మ కొద్దీ ఈ పాపిష్ఠికొడుకు పుట్టాడు," అంటూ వీరన్న కాళ్ళూ చేతులూ తాళ్ళతో కట్టేసి కాలవలోకి విసిరేశాడు.

"నాన్నా, నాన్నా!" అంటూ జాలిగా వీరన్న గోల పెట్టాడు. ధర్మయ్య ఆ కేకలు వినిపించుకోలేదు.

ఈ లోపల వీరన్న కాలవలో కొట్టుకుపోయాడు. అలా కొట్టుకుపోతూ ఉండగా దారిలో ఒక మొసలి, ఒక పెద్దచేపా కనిపించాయి. వాటిని చూడగానే వీరన్న ఏడుస్తూ "నన్ను మింగి చంపెయ్యకూడదూ? నాకేమీ విచారం లేదు... ఈ లోకంలో నాకోసం బాధపడేవాళ్ళు ఎవరూ లేరు," అన్నాడు.

ఆ మాటలు విని మొసలి, చేపా "ఇంకా నయం. నీవంటి అమాయకుడిని,

మంచి కుర్రవాడినా చంపడం? అలా ఎన్నటికీ జరగదు... పైగా నీకేం సహాయం కావల్సినా మమ్మల్ని అడుగు," అన్నాయి.

"నువ్వు ఈ లోకంలో సాధించవలసిన ఘనకార్యాలు ఎన్నో ఉన్నాయి," అంటూ వీరన్నని మొసలి, చేపా కలిసి ఒడ్డుకి చేర్చాయి. వీరన్నకి కట్టిన తాళ్ళని కొరికేసింది మొసలి. అతన్ని అక్కడే ఉండమని, తను ఎక్కడికో వెళ్ళి ఎన్నాళ్ళనుంచో దాస్తున్న ఒక మాయచెప్పుల జతను తీసుకుని వచ్చి వీరన్నకి ఇచ్చింది.



"ఈ చెప్పులు తొడుక్కుని భూమిమీద కంటే త్వరగా నీటిలో ప్రయాణం చెయ్యొచ్చు," అని వాటి ఉపయోగాన్ని గురించి కూడా చెప్పింది. మొసలి ఇచ్చిన చెప్పులు తొడుక్కుని నీటి మీద ధైర్యంగా నడక సాగించాడు.

ఆ కాలవ క్రమంగా ఒక నదిలో కలిసింది. ఆ నదిని కూడా అదేవిధంగా దాటాడు. కొంతసేపటికి ఒక సముద్రం అడ్డం వచ్చింది. ఆ సముద్రంలో ప్రయాణం చేస్తున్న ఒక ఓడని చూశాడు. ఆ ఓడను నడుపుతున్న నావికుడు దూరం నుంచి ఒక కుర్రవాడు నీటిమీద నడవడం చూశాడు. తన కళ్ళని తనే నమ్మలేకపోయాడు.

వీరన్న ఓడని సమీపించగానే నావికుడు వీరన్నని ఎంతో ఆప్యాయంగా దగ్గరికి పిలిచాడు. అతనికి కడుపునిండా భోజనం పెట్టించాడు! భోజనం చేస్తూండగా, వీరన్న తనకు వచ్చిన కష్టాలన్నిటినీ నావికుడికి చెప్పాడు. నావికుడు వీరన్న దగ్గరినుంచి ఆ మాయ చెప్పుల్ని సంగ్రహించడం ఎలాగా అని ఆలోచించడం మొదలు పెట్టాడు.

"అబ్బాయీ, చెప్పులు ఉపయోగకరమైనవే అయినప్పటికీ ఎప్పుడైనా చెప్పు జారిపోయిందంటే నువ్వు సముద్రంలో పడి మునిగిపోతావు. అందుకని వాటిని వదిలేసెయ్యి. నా దగ్గర ఒక కోటు ఉంది. దాన్ని తొడుక్కుని హాయిగా నీటిమీద విహంగంలా ఎగిరిపోవచ్చు. నీకే ఆపదా సంభవించదు," అన్నాడు. పాపం నావికుని మాటలు నిజమేనని నమ్మాడు వీరన్న.

"సరే! నాకేం అభ్యంతరం లేదు," అంటూ వీరన్న తన చెప్పుల్ని నావికుడికి ఇచ్చి కోటుని తను తీసుకున్నాడు. అయితే, మోసంచేసే అభిప్రాయంతోటే ఆ కోటుని వీరన్నకి ఇచ్చాడు. ఆ మాయకోటుని పూర్వం ఆ నావికుడికి ఎవరో ఇచ్చారు. దాంట్లో మహత్తు ఉన్నమాట నిజమే. అదేమి గమ్మత్తోగాని, ఆ కోటు తొడుక్కున్నా నావికుడు ఎగరలేక పోయాడు. అందుచేత ఆ కోటు నిరుపయోగం కదా అని వీరన్నకి ఇచ్చేశాడు. అదేం విచిత్రమో వీరన్న తొడుక్కోగానే గాలిలో ఎగరడం మొదలు పెట్టాడు.

నావికుడు అనుమానంతో జోళ్ళు తొడుక్కుని నీటిమీద నిలబడ్డాడు. వెంటనే లోపలికి మునిగిపోయాడు. అయితే, నావిడుడికి బాగా ఈతవచ్చు కాబట్టి మళ్ళీ తన ఓడని చేరుకోగలిగాడు. తనని మోసంచేసి వెళ్ళిపోయాడని వీరన్నని దుమ్మెత్తి పోశాడు.

నావికుడిని చూసి వీరన్న అమాయకంగా నవ్వాడు. నావికుడు ఉన్న ఓడమీదే వీరన్న పావురంలా ఎగురుతున్నాడు. "నువ్వు కిందికి వస్తే చెబుతాను. నీ సంగతి," అంటూ నావికుడు వీరన్నతో సవాలుచేశాడు.

నావికుడిని మంచి మాటలతో శాంతపరుద్దామని వీరన్న కిందికి

దిగివచ్చాడు. నావికుడు మంచీ చెడూ ఆలోచించే స్థితిలో లేడు. "రా, దగ్గరికి రా," అంటూ నావికుడు మొలలోని కైజారుతీసి అతని మీదికి ఉరికాడు.

వీరన్న చిన్నవాడే అయినప్పటికీ ధైర్యంగా, ప్రశాంతంగా ఉన్నాడు. న్యాయంగా యుద్ధం చేసి నావికుడు తన కాళ్ళమీద పడి క్షమించమని ప్రాధేయపడేలా చేశాడు. నావికుడు వీరన్న కాళ్ళమీద పడి తనే నిజంగా వీరన్నని మోసం చెయ్యడానికి ప్రయత్నించిన సంగతి చెప్పి క్షమాపణ వేడుకున్నాడు.

తిరిగి ఆకాశంలో ఎగరడం ప్రారంభించాడు వీరన్న. తన తండ్రి ఇంటికి పోవాలని అతని ఉద్దేశం. అతను పర్వతాల మీదనుంచీ, లోయల మీదనుంచీ ఎగురుతున్నాడు. అలా ఎగిరి ఎగిరి, చివరికి ఒక వింత ప్రదేశంలోకి వచ్చి ఆగాడు. పెద్ద పెద్ద వృక్షాలు, వాటి కొమ్మలూ వింతగా ఉన్నాయి. చిన్న చిన్న గోతులతో నిండి ఉంది ఆ ప్రదేశం.

ఆ గోతుల్లో ఏముంటుందో చూద్దామని వీరన్న ఒక గోతిలోకి తొంగి చూశాడు. అంతా చీకటిమయం. ఆశ్చర్యంగా దానివైపే చూస్తూ ఉండగా, అకస్మాత్తుగా ఒక వ్యక్తి అక్కడ ప్రత్యక్షమయింది.

ఆ వ్యక్తి రాకతో ఆ ప్రదేశమంతా ఎర్రనికాంతితో నిండిపోయింది. క్రమంగా ఆ వ్యక్తి అతనికి దగ్గరగా వచ్చింది. ఆమె ఒక వృద్ధురాలు, ఒళ్ళంతా ముడతలు పడిపోయింది. నడుము బాగా వంగిపోయింది. ఆ ముసలమ్మ చేతిలో ఒక నల్లటి పక్షి ఉంది. చూడటానికి అది ఎంతో అసహ్యంగా ఉంది.

ఏవో మాటలు గొణుగుతూ ఆ ముసలమ్మ ఆ నల్ల పక్షిని గాలిలోకి వదిలింది. అది వాళ్ళ తలలమీద గుండ్రంగా తిరిగి తిరిగి చివరికి ఒక మానవాకారాన్ని పొందింది. అక్కడ ఒక మనిషి విచారగ్రస్థుడై, చేసిన పాపానికి అవమానం పొందుతున్నట్లు తలవొంచుకుని నిలబడి ఉన్నాడు. అంతా వింతగా తోచింది వీరన్నకి. అయినా ధైర్యంగా అక్కడే నిలబడ్డాడు.

ఆ ముసలమ్మ చిన్న చిన్న గులకరాళ్ళను నేల మీదికి విసిరింది. అవన్నీ మరుక్షణంలో తలలులేని మరుగుజ్జుల్లా తయారయ్యాయి. ఆ మరుగుజ్జు

మనుషులు నాట్యం చెయ్యడం మొదలుపెట్టారు. వీరన్నకి అసహ్యంవేసి నాట్యాన్ని ఆపండి అన్నట్లు చెయ్యి చాపాడు. వెంటనే వాళ్ళు మాయమైపోయారు.

వాళ్ళు పోగానే ఒక అందమయిన అమ్మాయి ప్రత్యక్షమయింది. ఆ అమ్మాయి నగలన్నీ పువ్వులే. చిరునవ్వు నవ్వుతోంది. ముచ్చటగా ఉంది. ఆ అమ్మాయిని ఇంకా చూడాలనిపించింది వీరన్నకి. అయితే, ఆమె కూడా వెంటనే మాయమైపోయింది. ఆ ముసలమ్మ కూడా మాయమైపోయింది.

వీరన్న అక్కడ ఒంటరిగా ఉన్నాడు. ఇదంతా ఆ ముసలమ్మ చేసిన మాయ, మోసం అనుకున్నాడు. నెమ్మదిగా ఆ చీకటిలోనే అక్కడినించి నడిచిపోవడానికి ప్రయత్నించాడు. ఆ రాళ్ళమీద కాలు జారింది. కాని ఒక దేవత అతడిని కనిపెడుతూ ఉంది. వీరన్న ధైర్యసాహసాలను గుర్తించి రెండు పెద్దపులులను అతనికి తోడుగా పంపింది. ఆ చీకటిలో పెద్దపులుల కళ్ళు వెలుగుని ఇస్తూ దారిని చూపిస్తున్నాయి. వాటి సహాయంతో ఆ అడవిని దాటిపోయాడు.

తండ్రి ఊరివైపు నడక సాగించాడు వీరన్న. కాలవగట్టు దాకా వచ్చేసరికి ధర్మయ్య మళ్ళీ ఎదురయ్యాడు. అయితే, ఈసారి చూడగానే వీరన్నకి తండ్రిమీద పట్టలేనంత కోపం వచ్చింది. తండ్రిని చంపేద్దామని మొలలోనుంచి కైజారు తీశాడు. తీరా తండ్రి తల ఎత్తేసరికి ఆ ముఖాన్ని చూస్తే వీరన్న గుండె కరిగిపోయింది.

వీరన్నకి జాలి, ఆశ్చర్యం కలిగాయి. ఇంతకుముందు ఆ విచిత్ర ప్రదేశంలో నల్లకాకి పొందిన మానవాకారం, తన తండ్రీ ఒకేలా ఉన్నారు. ఇద్దరూ ఒకటే. చూస్తే జాలేసింది. చేసుకున్న పాపఫలాన్ని తండ్రి అనుభవిస్తున్నాడు. కైజారుని తిరిగి మొలలో పెట్టేసుకున్నాడు.

"నిజంగా నువ్వు నీ పాపానికి ప్రాయశ్చిత్తాన్ని కోరుకుంటున్నట్లు అయితే ఆ పవిత్ర నదీ జలంలో ఒక్కసారి స్నానం చేసిరా," అన్నాడు తండ్రితో. అలాగేనంటూ ధర్మయ్య నదివైపు వెళ్ళిపోయాడు.

వీరన్న అక్కడి నుంచి ఇంటికి వెళ్ళాడు. గుమ్మంలోనే సవతితల్లి

ఎదురయింది. ముస్తాబుచేసుకుని భర్తకోసం కాబోలు ఎదురు చూస్తోంది. వీరన్న హృదయం క్రోధంతో నిండిపోయింది. కైజారు తీశాడు! మళ్ళీ ఆలోచించాడు.

ఆకస్మాత్తుగా తిరిగివచ్చిన సవతి కొడుకుని చూసి సత్యవతి ఆశ్చర్యపోయింది. తను అతనికి చేసిన అన్యాయాన్ని తలుచుకుని అవమానంతో తల వంచుకుంది.

తనను అతిగారాబంతో పెంచిన రత్తమ్మ కోసం లోపలికి వెళ్ళాడు వీరన్న.

అవమానం భరించలేక ఆ రాత్రే ఇల్లువిడిచి అడవుల్లోకి వెళ్ళిపోయింది సవతితల్లి.

తిరిగి రత్తమ్మ వీరన్నని ప్రేమతో పెంచడం ప్రారంభించింది.

వీరన్న శౌర్యం సంగతి ఊరంతా పాకింది. వీరన్న ధైర్యసాహసాల గురించి అందరూ వేనోళ్ళ చెప్పుకున్నారు. ఈ సంగతి రాజుగారికి కూడా తెలిసింది. ఆయన వీరన్నని తమ ఆస్థానానికి పిలిపించి తమ భవనంలోనే అతన్ని ఉండి పొమ్మని అన్నారు.

ఇదివరకు అడవిలో చూసిన ఆ అందమైన అమ్మాయిని ఆ భవనంలో మళ్ళీ చూశాడు. ఈ రాజుగారి కూతురే ఆ అమ్మాయి. కొద్ది కాలంలోనే వీరన్నకి రాజకుమార్తెని ఇచ్చి వివాహం చేశారు. కొద్దికాలం తర్వాత వీరన్న ఆ ఊరికి రాజుకూడా అయ్యాడు.

(జావా ద్వీపపు జానపద గాథ)

# స్వర్ణ పేటిక

అనగా అనగా ఒక రాజు. ఆ రాజుకి ఒక్కతే కూతురు. ఆమె అపురూప సౌందర్యవతి. ఆ అమ్మాయిపేరు సుందరి. ఆ రాజుకి కొడుకులు లేకపోవడం వల్ల ఉన్న ఒక్క కూతుర్నీ ఎంతో గారాబంగా పెంచుతున్నాడు. పురుషులకు చెప్పించే విద్యలు కూడా చెప్పించాడు సుందరికి. సుందరి పెద్దది అవుతున్న కొద్దీ ఆమె అందం వృద్ధి అవుతోంది. ఎంతో ఆకర్షణీయంగా తయారవుతోంది. సుందరికి తగిన వరునికోసం వెయ్యి విధాల ప్రయత్నం చేస్తున్నాడు రాజు.

సుందరికి విద్య నేర్పే రాజగురువు సుందరిని ప్రేమించాడు. అయితే రాజగురువు బ్రాహ్మణుడు, వయసు మళ్ళినవాడు. సుందరిని అతనికి ఇచ్చి రాజుగారు ఎలా వివాహం చేస్తారు? తన మనస్సులో ఉన్న విషయాన్ని రాజుకి ఎలా చెప్పడమా అని రాజగురువు లోలోపల బాధపడుతూ ఉండేవాడు. సుందరి కూడా తనమీద గురుభక్తి చూపిస్తోంది కాని ప్రేమమాత్రం లేదు. ఇటు సుందరినీ అడగలేడు, అటు రాజునీ అడగలేడు. ఇలా చాలా రోజులు గడిచాయి. రాజుగారు సుందరికి సంబంధాలు చూస్తున్నారు. చివరికి ఒక రాజకుమారుణ్ణి వరించింది సుందరి. రాజుగారు సంబంధం నిశ్చయించారు. తమ రాజ్యానికి రమ్మని ఆ రాజకుమారుడికి కబురు పంపారు.

ఇక సుందరికి కొద్ది కాలంలో వివాహం జరిగిపోతుంది. ఈ వివాహాన్ని ఎలా అయినా ఆపాలని నిశ్చయించుకున్నాడు రాజగురువు. ఉపాయం ఆలోచించ సాగాడు. సుందరిని చూడటానికి రాజకుమారుడు వచ్చేలోపలే సుందరిని మాయం చెయ్యాలని అనుకున్నాడు.

ఒక రోజున రాజు దగ్గరికి వెళ్ళి "మహారాజా! నాది ఒక విన్నపం," అన్నాడు. "సెలవియ్యండి," అని రాజు గౌరవంతో అన్నాడు. "మీ అమ్మాయి జాతకంలో కొంత విశేషం ఉంది. ఇన్నాళ్ళబట్టీ మీతో చెప్పలేక ఊరుకున్నాను.

కానీ ఇప్పుడు చెప్పక తప్పదని తోచింది," అన్నాడు. రాజగురువు గొప్ప జ్యోతిష్కుడు.

ఆ రాజ్యంలో ఆయన కన్నా గొప్ప జ్యోతిష్కులు లేరు. ఆయన చెప్పింది జరిగి తీరుతుందని ప్రతీతి కూడా ఉంది. అందువల్ల రాజగురువు మాటలువిని రాజు కంగారు పడ్డాడు.

"ఏమిటి మహాశయా? మా అమ్మాయి జాతకం గురించి ఏం చెప్పదలుచుకున్నారు?" అని ఆత్రుతగా అడిగాడు.

"మీ అమ్మాయివల్ల మీ రాజ్యానికి గొప్ప ముప్పు సంభవిస్తుంది..." అన్నాడు రాజగురువు.

రాజు నిర్ఘాంతపోయాడు. తనకున్న ఒక్క ముద్దుల కూతురువల్ల తన రాజ్యానికి ముప్పు వస్తుందంటే నమ్మలేక పోయాడు. అయినా, రాజగురువు చెప్పినప్పుడు నమ్మకుండా ఉండడం ఎలా? "ఏమవుతుంది?" అన్నాడు రాజు.

రాజగురువు గంభీరంగా ముఖం పెట్టాడు. "ఇంతవరకు ఏమీ ఫరవాలేదు. కానీ మీ అమ్మాయికి వివాహం చెయ్యబోతున్నారు. రాజకుమారుడు కొద్ది రోజుల్లో మన రాజ్యానికి రాబోతున్నాడు కదా! అతను సుందరిని కలుసుకోవడంతో ప్రారంభమవుతుంది ఈ అనిష్టం," అన్నాడు రాజగురువు.

ఏం మాట్లాడాలో అర్థంకాక రాజగురువు ముఖంలోకి రాజు వెర్రిగా చూస్తున్నాడు. రాజగురువు ఇంకా ఇలా అన్నాడు: "మీ అమ్మాయి వివాహం మూలంగా మీరు రాజ్యభ్రష్టులు కూడా కాగలరు. మీకు ఈ దురదృష్టం సంభవించకుండా ఉండాలంటే ఒక పని చెయ్యాలి," అన్నాడు.

"ఏం చెయ్యాలో సెలవియ్యండి," అన్నాడు రాజు కుతూహలంతో.

రాజు దారిలోకి వస్తున్నందుకు రాజగురువు సంతోషించాడు. తను చెప్పినట్లు రాజు చేస్తాడనే ధైర్యం అతనికి వచ్చింది. అందువల్ల మరింత ధీమాగా రాజగురువు "ఆ రాజకుమారుడు వచ్చేలోపుగా మీ అమ్మాయిని ఈ రాజ్యంనుండి

బయటకి పంపించెయ్యాలి... మీ రాజ్యం నిలబడాలంటే అదొక్కటే మార్గం,” అన్నాడు.

రాజుకి ఏం చెయ్యాలో తోచలేదు. తన రాజ్యాన్ని వదులుకోవడమా? తన కుమార్తెను వదులుకోవడమా? “సరే, మా సుందరితో ఈ విషయం చెబుతాను. మళ్ళీ మీకు కబురు పంపుతాను,” అన్నాడు రాజు.

ఆ రాత్రి రాజు విచారంగా ఉండడం గమనించింది సుందరి. వెళ్ళి కారణం చెప్పమని అడిగింది. రాజు తనకూ రాజగురువుకీ మధ్య జరిగిన సంభాషణ అంతా పూసగుచ్చినట్లు చెప్పాడు.

సుందరి విచారించలేదు. “ఎవరి అదృష్టానికి ఎవరు కర్తలు? నా దురదృష్టం ఇలా ఉంటే మీరు మాత్రం ఏం చెయ్యగలరు? నా కోసం మీ రాజ్యానికి భంగం కలగడం ఎందుకు? నా గురించి మీరేం భయపడకండి,” అని తన త్యాగబుద్ధిని వెల్లడించింది. రాజు కూతురిని విడిచిపెట్టవలసి వచ్చినందుకు బాధపడుతున్నా సుందరి మంచితనానికి మెచ్చుకున్నాడు.

రాజగురువు సలహా ప్రకారం సుందరిని ఒక స్వర్ణపేటికలో పెట్టి తాళం వేసి ఊరు చివర ప్రవహిస్తున్న నదిలో వదిలేశారు. పెట్టె వడివడిగా కొట్టుకుపోతోంది. రాజు ఆ దృశ్యాన్ని చూసి కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు. చేసేదిలేక దిగులుతో ఇంటికి వచ్చేశాడు.

పెట్టె అలా నదిలో కొట్టుకుపోతోంది. రాజగురువు ఎక్కడికో ప్రయాణం అయ్యాడు.

రాజుకి తెలియకుండా నది అవతల ఒడ్డుకి రాజగురువు తన శిష్యునితో సహా చేరుకున్నాడు. పెట్టెకోసం రెండు రోజులపాటు వేచి ఉన్నాడు. చివరికి మూడవ రోజున ఆ స్వర్ణపేటిక అవతల ఒడ్డుకి చేరుకుంది. ఆ పెట్టెను చూడగానే రాజగురువు మహదానందంతో నీటిలోకి వెళ్ళి పెట్టెను అందుకున్నాడు.

పెట్టె చాలా బరువుగా ఉంది. సుందరిని సర్వాభరణాలతో అలంకరించి

పెట్టెలో పెట్టారు. చక్కగా ఆ వస్తువులు అన్నింటిని అమ్ముకుంటే బోలెడు ధనం వస్తుంది అని ఎంతో మురిసిపోయాడు రాజగురువు.

ఇంక సుందరి తన సొత్తు. ఆమెని మరోగ్రామానికి తీసుకుపోయి తను వివాహం చేసుకోవచ్చు. సుందరి ఏం చెయ్యగలదు? తప్పకుండా తను సుందరిని వివాహం చేసుకుంటాడు! సుఖంగా కాలం గడుపుతాడు!! శిష్యుడి సహాయంతో ఆ పెట్టెను మోసుకుని ఊరి చివర ఉన్న ఒక పాడు దేవాలయంలోకి తీసుకుని వెళ్ళాడు రాజగురువు.

పెట్టెను గర్భ గుడిలో పెట్టాడు. శిష్యుడిని పిలిచి "ఒరే, నువ్వు ఈ దేవాలయం తలుపులు బయటనించి బంధించు. లేకపోతే ఈ రాజకుమార్తె నాతో పోరాడి పారిపోగలదు. అందువల్ల నేను పిలిచేవరకూ నువ్వు తలుపు తెరవవద్దు. నువ్వు బయటనే కూర్చో," అని చెప్పాడు. శిష్యుడు సరేనని తలుపుని బయటనుంచి బంధించి బయటనే కూర్చున్నాడు. రాజగురువు గర్భగుడిలో ప్రవేశించాడు.

ఒకమూల ఏదో తప్పుచేశాననే భయం! మరోమూల రాజకుమార్తెను తను వివాహం చేసుకోబోతున్నాననే సంతోషం!

మొత్తం మీద చేతులు భయంతో వొణుకుతున్నా, లోలోపల మురిసిపోతూ తలుపు తాళం తీశాడు. పెట్టెమూత తెరుస్తూ ప్రేమగా "సుందరీ!" అని పిలిచాడు. తలుపు తెరిచి చూసి కెవ్వుమని కేకవేశాడు. ఆ పెట్టెలో ఒక భయంకరమైన పెద్ద ఎలుగుబంటి ఉంది!

రాజగురువుని చూడగానే అతని మీదికి ఒక్క ఉరుకు ఉరికింది. రాజగురువు భయం వర్ణించడానికి సాధ్యంకాదు. అతని ఒంటిమీద బట్ట ఊడిపోయినా అతను గుర్తించే పరిస్థితిలో లేడు. గర్భగుడి తలుపు తెరుచుకుని శిష్యుణ్ణి బయటి తలుపులు తియ్యమని పొలికేకలు వేశాడు.

ఒక మూల ఎలుగుబంటి రాజగురువుపై పడి ఇష్టం వచ్చినట్లు రక్కుతోంది. రాజగురువు దేవాలయంలో పరుగులెడుతున్నాడు. వీధి తలుపు

కటకటాల్లోనించి లోపల జరుగుతున్న భీభత్సాన్ని చూశాడు శిష్యుడు. తలుపు తీస్తే ఇంకేమైనా ఉందా? తన ప్రాణాల్ని కూడా బలి చెయ్యవలసిందే.

శిష్యుడు అక్కడ ఒక నిమిషం కూడా ఆగలేదు. జనాన్ని పిలుచుకు రావటానికి ఊళ్ళోకి పరిగెత్తాడు. జనాన్ని తీసుకుని శిష్యుడు తిరిగి వచ్చేలోపలే ఎలుగుబంటి రాజగురువుని చిత్రవధ చేసింది. రాజగురువు శరీరమంతా తునాతునకలై దేవాలయమంతటా పడింది. రక్తం మడుగులు కట్టింది. రాజగురువు చనిపోగానే ఎలుగుబంటి ప్రశాంతంగా ఒక మూల పడుకుంది.

సుందరిని చూడటానికి బయలుదేరిన రాజకుమారుడు బంగారు నావలో ప్రయాణంచేస్తూ ఆ నదిలో కొట్టుకొస్తున్న పెట్టెను చూస్తాడు. ఆ స్వర్ణపేటికలో ఏముందో తెలుసుకుందామని కుతూహలం కలుగుతుంది అతనికి. తన నౌకర్లచేత ఆ పెట్టెను తీయించి, తాళం బద్దలుకొట్టి మూత తెరచి చూస్తాడు.



కన్నులు మిరుమిట్లు గొలిపే అందాల రాణి ఆ స్వర్ణపేటికలో ఉంది. ఊపిరి సలపక కొట్టుకుపోతోంది. పెట్టెమూత తెరవగానే రాజకుమారుణ్ణి చూసి సిగ్గుపడుతూ కృతజ్ఞతను తెలిపింది.

జరిగిన సంగతి రాజకుమార్తె ద్వారా విన్నాడు ఆ రాజకుమారుడు. తను చూడబోయే సుందరి ఆమే అని తెలుసుకుని ఎంతో సంతోషించాడు. మళ్ళీ ప్రయాణం సాగించాడు. సుందరి రాజ్యానికి చేరుకోగానే ఆ పెట్టెలో ఒక ఎలుగుబంటిని పెట్టి యథాప్రకారం పెట్టెకి తాళం వేసి నదిలో వదిలేశాడు.

రాజగురువుకి జరిగిన పరాభవాన్ని తరవాత కొద్దిరోజులకు రాజు తెలుసుకున్నాడు. రాజగురువు తలపెట్టిన మోసానికి తగిన శిక్ష పడింది అని ఎంతో సంతోషించాడు. తన కుమార్తెకి ఎంతో వైభవంగా ఆ రాజకుమారుడితో వివాహం చేసి రాజ్యభారం ఆ నూతన దంపతులకి అప్పచెప్పాడు.

(హిందూ దేశపు జానపద గాథ)



# చంద్రకాంత

అనగా అనగా ఒక ఊళ్ళో పుల్లలు కొట్టుకునే వెంకన్న, అతని భార్య చంద్రమ్మా ఉండేవారు. రోజూ అడవికి పోయి పుల్లలు కొట్టుకుని వచ్చి, వాటిని అమ్మి డబ్బు సంపాదించేవారు. ఎంతో న్యాయంగా బతుకుతూ ఉండేవారు. వాళ్ళిద్దరికీ ఒకళ్ళ మీద ఒకళ్ళకి ఎంతో ప్రేమ.

అయితే, వాళ్ళకి ఒక్కటే దిగులు. వాళ్ళకి పిల్లలు లేరు. అప్పుడప్పుడు భర్తతో అనేది భార్య: "ఎన్ని వసంత కాలాలు వస్తే ఏం? ఎన్ని పండుగలు వస్తే ఏం? నాకు ఒక్క బిడ్డ ఉంటే ఎంత హాయిగా ఉంటుంది! భగవంతుడికి మన మీద ఎప్పుడు దయగలుగుతుందో!"

ఒక రోజు సాయంకాలం చంద్రమ్మ తన గుడిసె ముందర నుంచుంది. దూరంగా కొండల మీద కురుస్తున్న మంచుని చూసింది. నేలమీద బోర్లా పడుకుని ఆ మంచు కొండల్ని ప్రార్థించింది: "తల్లీ! నాకున్న విచారాన్ని పోగొట్టు. నా గుండెల మీద పడుకోబెట్టుకుని జోకొట్టుకునేందుకు ఒక్క చిన్నపాప కూడా లేదు. ఇల్లు కలకలలాడేలా చేసే ఒక్క చిన్నపాప అయినా లేదు. నాకు మనశ్శాంతిని కలుగచేసే ఒక చిన్న తల్లిని ప్రసాదించు," అంటూ దీనంగా వేడుకుంది.

ఆశ్చర్యం! ఆమె అలా ప్రార్థిస్తూ ఉండగానే దూరాన ఉన్న కొండలమీద ఒక మెరుపు తళుక్కుమని మెరిసింది. వెన్నెలొలికే చిరునవ్వు నవ్వుతూ ఆ మెరుపులో ఒక చంటి బిడ్డ ముఖం కనిపించింది.

"ఏమండీ, ఏమండీ! త్వరగా రండి!" అంటూ భర్తని పిలిచింది. భర్త కంగారుగా లోపలినించి వచ్చాడు. దూరాన మంచుకొండ మీద చంటిబిడ్డ తనకేసి చూసి చిరునవ్వు నవ్వుతూ ఉందని చెప్పింది భర్తతో.

"అదంతా నీ భ్రమ పిచ్చిదానా!" అన్నాడు భర్త. అయినా కొండమీద వెలుగు చూసేసరికి అతనికి కూడా కొంచెం అనుమానం కలిగింది. "సరేలే.

వెళ్ళి చూసివస్తాను," అంటూ మంచుకొండవైపు బయలుదేరాడు.

ఆ వెలుగువైపు చూసుకుంటూ అడివి దారి పట్టిపోయాడు. చివరికి ఆ మంచు కొండని చేరుకున్నాడు. ఆ కొండల దగ్గర ఉన్న ఒక చెట్టు కొమ్మకు ఒక ఉయ్యాల వేలాడుతోంది. ఆ ఉయ్యాలలో ఒక అందాలగుమ్మ ఉంది. చందమామలా వెన్నెలలు విరజిమ్ముతూ ఉంది. అంత అందమయిన చంటిపిల్లని ఇదివరకు ఎప్పుడూ చూడలేదు.

"ఓ వెలుగుపాపా! ఎవరునువ్వు?" అన్నాడు ఆశ్చర్యంగా. అతనికి మరింత ఆశ్చర్యం కలిగేటట్లు ఆ వెలుగు పాప మాట్లాడింది కూడా. "నేను 'చంద్రకాంత'ని. నేను చంద్రమండలంనించి వచ్చాను. నీ భార్యకి ఆనందాన్ని కలగచేయమని నా తల్లి నన్ను ఇక్కడికి పంపింది," అని అతని ప్రశ్నకి సమాధానం ఇచ్చింది.

"అయితే చంద్రకాంతా, నిన్ను నా భార్య దగ్గరకి తీసుకుని వెళతాను," అన్నాడు ఆత్రుతగా. ఎంతో జాగ్రత్తగా ఆ పాపాయిని ఎత్తుకుని ఇంటికి తీసుకుని వచ్చాడు. ఆనందం పట్టలేక భార్యని పిలిచాడు. "చూడు! నీ కోసం చంద్రరాణి ఈ పసిపాపను పంపింది," అన్నాడు.

చంద్రమ్మ ఆనందానికి మేరలేదు. పసిపాప కోసం పలవరించిపోతున్న ఆమె చంద్రకాంతని ఎత్తుకుని తనివితీరా ముద్దాడి, గట్టిగా కౌగలించుకుంది. ఎన్నాళ్ళనుంచో కోరుతున్న కోరిక ఫలించినందుకు ఆవిడికి ఎంతో సంతృప్తి కలిగింది.

కొన్ని సంవత్సరాలు గడిచాయి. చంద్రకాంత రాకతో వెంకన్న ఇల్లు వెలుగుతో, ఆనందంతో నిండి పోయింది. వారికి ఇక విచారమన్న మాటేలేదు. రోజు రోజుకీ చంద్రకాంత అందం ఎక్కువవుతోంది. ఆమె వెలుగు మరింత ఎక్కువ అవుతోంది. ఆమె జుట్టు చీకటి, ఆమె ముఖం చంద్రబింబం! చిరునవ్వులో వెన్నెలలు! ఆమెను ప్రేమించని వాళ్ళు లేరు.

ఒక రోజున ఏమయింది! రాజకుమారుడు ఆ అడవికి వేటకి వచ్చినప్పుడు చంద్రకాంతని చూశాడు. చంద్రకాంత మీద ప్రేమ పుట్టింది. తనతో తన రాజ

భవనానికి తీసుకుపోదామనుకున్నాడు. కానీ చంద్రకాంత ఒప్పుకోలేదు. తనని పెంచుతున్న తల్లిదండ్రుల దగ్గరే ఉంటాను అంది. దాంతో చంద్రకాంత పెద్దదయ్యే వరకూ వెంకన్నా, చంద్రమ్మల ఇంట్లోనే ఉంది. ఇక చంద్రకాంత చంద్రమండలానికి తిరిగి వెళ్ళిపోయే రోజులు వచ్చాయి.

"నువ్వు మమ్మల్ని విడిచి పోవద్దు!" అని రాజకుమారుడు, తల్లిదండ్రులు కూడా ఎంతో విలపించారు. అయినా కాని "వీలులేదు" అంది చంద్రకాంత.



చంద్రకాంతని ఎవ్వరూ తీసుకుపోకుండా రాజకుమారుడు కొంతమంది సిపాయిల్ని వెంకన్న ఇంటి చుట్టూ కాపలా పెట్టాడు.

ఒక రాత్రి ఏమయింది! పున్నమి చంద్రుడు తన కాంతినంతా లోకంలో వెదజల్లుతున్నాడు. ఒక చంద్రకిరణం చంద్రమండలానికీ, భూలోకానికీ మధ్య వంతెనలా ఏర్పడింది. దాన్ని చూస్తూ రాజకుమారుడు నియమించిన సిపాయిలు అలాగే రాతి విగ్రహాల్లా నిస్సహాయులై నిలబడిపోయారు.

చంద్రరాణి ఆ వంతెన మీదనుంచి వచ్చింది. చంద్రకాంతని తిరిగి ఎన్నాళ్ళకు కలుసుకుంది! ప్రేమతో గట్టిగా కౌగలించుకుంది. నెమ్మదిగా ఆ చంద్రకిరణం మీదనుంచి నడిపించి చంద్ర మండలానికి తీసుకుపోయింది.

తిరిగి తన స్వస్థలానికి వెళుతున్నందుకు చంద్రకాంతకు సంతోషంగా ఉన్నప్పటికీ, తనని పెంచి పెద్దచేసిన భూలోకంలోని తల్లిదండ్రుల్ని విడిచిపెట్టవలసి వచ్చినందుకు ఎంతో చింతించింది.

చంద్రకాంత కార్చిన కన్నీళ్ళు రెక్కలు కట్టుకుని ఆమె ప్రేమ సందేశాన్ని రాజకుమారుడికీ, పుల్లలు కొట్టుకునే వెంకన్నకీ, అతని భార్య చంద్రమ్మకీ అందించాయి.

(జపాన్ దేశపు జానపద గాథ)

# బుద్ధిబలం

అనగా అనగా ఒక ఊళ్ళో ఒక ముసలమ్మ ఉండేది. ఆవిడకి ఇద్దరు కొడుకులు. వాళ్ళది బీద సంసారం. ఒకసారి పెద్దకొడుకు తల్లితో "అమ్మా! నేను దేశాటనం పోయి డబ్బు సంపాదించుకుని వస్తాను," అన్నాడు.

"సరే నాయనా!" అంది తల్లి. ఇంట్లో ఉన్న పప్పు, బియ్యంతో ఒక రొట్టెముక్క కాల్చింది. కొడుకుని పిలిచి "నాయనా! ఈ రొట్టెముక్క అంతా ఇవ్వనా? కొంచెం చాలునా?" అని అడిగింది. ఇంట్లో తల్లికీ, తమ్ముడికీ తినడానికి ఏదైనా ఉందోలేదో అని కించిత్తయినా ఆలోచించకుండా "చాలా దూరం ప్రయాణం చెయ్యాలి కదమ్మా, అంతా మూటకట్టి ఇయ్యి," అన్నాడు తల్లితో. తల్లి మనస్సులో నవ్వుకుంది.

వెళ్ళేటప్పుడు తమ్ముడిని పిలిచి ఒక కత్తి ఇచ్చాడు పెద్దవాడు. "తమ్ముడూ! ఈ కత్తి ఎప్పుడైతే తుప్పు పట్టిపోతుందో అప్పుడు నేను కష్టాల్లో ఉన్నానని అర్థం చేసుకో," అన్నాడు.

తల్లి మూటకట్టి ఇచ్చిన రొట్టెముక్కను తీసుకుని దేశాటనకు బయలుదేరాడు. వెళ్ళగా వెళ్ళగా ఒక ముసలమ్మ ఎదురైంది. ఈ బాటసారిని చూడగానే "నాయనా, ఆకలితో నా కడుపు దహించుకు పోతోంది. నీ దగ్గర ఏదైనా ఆహారం ఉంటే కొంచెం నాకు పెట్టు బాబూ!" అంది నీరసంగా.

ఆ ముసలమ్మ మాటలు విని ఆ కుర్రవాడు "అవ్వా, నా దగ్గర ఉన్నదే చిన్న రొట్టెముక్క. నేను చాలా దూరం ప్రయాణం చెయ్యాలి. అయినా ఏదో నువ్వంత దీనంగా అడుగుతున్నావు కాబట్టి ఇస్తున్నాను," అంటూ మూట విప్పాడు.

"అయ్యో నాయనా, నాకా సంగతి తెలియదు... ఈ దారిని అనేకమంది పోతూ ఉంటారు ఇంకెవరినైనా అడుగుతాలే," అంది ఆ ముసలమ్మ. ఆ మాటలకి కుర్రవాడికి చాలా సంతోషం కలిగింది. "అయితే సరే!" అంటూ రొట్టెముక్క అవ్వకు పెట్టకుండానే తన దారిన తను పోయాడు.

మరునాడు మధ్యాహ్నం తోవలో ఒక ముసలయ్య కనిపించాడు. అతను ఒక గొర్రెల కాపరి. ఆ ముసలయ్యని చూసి కుర్రవాడు "ఎవరివి ఈ గొర్రెలు?" అని అడిగాడు. "ఇవి మూడుతలల రాక్షసుడివి," అని గొర్రెల కాపరి సమాధానం చెప్పాడు. వెంటనే విచారకరంగా ఒక పాటపాడటం మొదలు పెట్టాడు.

ఆ పాటలోని భావం: అనగా అనగా ఒక రాజు... ఆ రాజుకి ఒక కూతురుంది... ఆ అమ్మాయి అందాన్ని చూసి మోహించి మూడుతలల రాక్షసుడు ఆ అమ్మాయిని ఎత్తుకుని వచ్చేశాడు. పెళ్ళి చేసుకోవడానికి నిరాకరించిందని రోజూ ఆమెను నానాహింసలూ పెడుతున్నాడు... పాపం... ఆమెకు విడుదల ఎప్పుడో.

ఈ పాటను అంతగా పట్టించుకోలేదు ఆ కుర్రవాడు. తనదారిన తను పోతున్నాడు. కొన్ని గజాలదూరం పోయాడో, లేదో ఒక్కసారిగా భయంకరమయిన అడవిమృగాలు గుంపులు గుంపులుగా వచ్చిపడ్డాయి.

అవి రెండుతలల ఎద్దులు. ఒక్కొక్క తలకు నాలుగేసి కొమ్ములు! కళ్ళు చింతనిప్పుల్లా ఉన్నాయి. వాటిని చూసీ చూడక మునుపే ఆ కుర్రవాడు పరుగు లంకించుకున్నాడు. ఆ మృగాలన్నీ కుర్రవాణ్ణి తరమడం ప్రారంభించాయి.

కుర్రవాడు భయంతో బలాన్నంతా ఉపయోగించి పరిగెత్తాడు. పరిగెత్తి, పరిగెత్తి చివరికి వాటిని ఎలాగో తప్పించుకుని ఒక పెద్ద భవనం కనిపిస్తే అందులోకి దూరాడు. సరాసరి వంటింటిలోకి పరిగెత్తాడు. ఒగుర్చుకుంటూ, వణికిపోతూ ఒక మూలగా నిలబడ్డాడు. పొయ్యిదగ్గర ఒక ముసలమ్మ కూర్చుని వంటచేస్తోంది. కొంచెం సేపటికి తేరుకుని, ఆ రాత్రికి పడుకునేందుకు ఆ భవనంలో తనకు కాస్త చోటు ఇమ్మని ఆ ముసలమ్మని అడిగాడు.

అందుకు ఆ ముసలమ్మ "నాయనా, నువ్వు ఇక్కడ పడుకోవడానికి నాకు అభ్యంతరం ఏమీలేదు. కానీ ఇది అంత సురక్షితమయిన స్థలంకాదు. ఇది మూడుతలల రాక్షసుడి భవనం. అతడు సామాన్యుడు కాదు... మానవమాత్రులను ఎవ్వరినీ బతకనివ్వడు," అని చెప్పింది. ఏం చెయ్యాలో అర్థం కాలేదు ఆ

కుఱ్ఱవాడికి. భవనంనుంచి వెళ్ళిపోతే మళ్ళీ ఆ క్రూర మృగాలు వెంటబడతాయేమోనని భయం. భవనంలోనే ఉండిపోతే రాక్షసుడు చంపేస్తాడేమోనని భయం.

అతనికి ఆ సమయంలో బుఱ్ఱ పనిచెయ్యడం లేదు. చివరికి భవనంలోనే ఆ రాక్షసుడి కంట పడకుండా ఎక్కడైనా మూల దాక్కుందామని నిశ్చయించుకున్నాడు. తనకి ఏదైనా రహస్య స్థలం చూపించమని ఆ ముసలమ్మని బతిమలాడాడు. సరే అంటూ ఆ ముసలమ్మ ఆ రాత్రికి వంటింట్లో ఉన్న బీరువా వెనుక అతన్ని తలదాచుకోమని అంది.

అతను బీరువా వెనుక దూరాడోలేదో "నరవాసన, నరవాసన!" అంటూ రాక్షసుడు రంకెలు వేసుకుంటూ వచ్చేశాడు. వంటిల్లంతా క్షణంలో గాలించి, బీరువా వెనుక దాగిన కుఱ్ఱవాణ్ణి బరబరా బయటికి ఈడ్చాడు.

కుఱ్ఱవాడి జుట్టు పిడికిట్లో బిగించి "నేను అడిగే మూడు ప్రశ్నలకి సమాధానం చెప్పు... లేకపోతే నీ ప్రాణాలమీద ఆశ వదులుకో!" అని గర్జించాడు. అతడు అడిగిన మూడు ప్రశ్నలు ఇవి:

"కొనలు లేని వస్తువు ఏది?"

"చిన్నది అయినకొద్దీ అపాయకరం ఏమిటది?"

"సజీవుల్ని మోసే నిర్జీవులు ఎవరు?"

"ఈ మూడు ప్రశ్నలకూ సమాధానం చెప్పు," అంటూ మరోసారి ఉరిమాడు.

కుఱ్ఱవాడు ఏం చెపుతాడు? అతనికి తెలిస్తేగా! నోరు పెగలలేదు వెంటనే వికటట్టహాసం చేస్తూ ఆ మూడుతలల రాక్షసుడు కుఱ్ఱవాడిని ఒక శిలా ప్రతిమగా మార్చేశాడు.

ఇంటివద్ద తమ్ముడు లేచి చూసేసరికి అన్న ఇచ్చిన కత్తి బాగా తుప్పు పట్టిపోయి ఉంది. అన్న అప్పుడే కష్టాల్లో చిక్కుకున్నాడని గ్రహించాడు. "అమ్మా,

అన్నయ్యని రక్షించి తీసుకు వస్తాను. నేను వెళతాను," అన్నాడు తల్లితో.

అతడు వెళ్ళేటప్పుడు వెనుకటిలాగే తల్లి ఒక రొట్టెముక్క కాల్చి కొడుకుకి ఇచ్చింది. అది చూసుకుని కుర్రవాడు "అదేమిటమ్మా రొట్టె అంతా నాకే ఇచ్చేశావు. ఇంక నువ్వు ఏంతింటావు?" అంటూ సగం చేసి తల్లికి ఇచ్చేశాడు. తల్లి కొడుకుని ఆశీర్వదించి పంపింది. అన్న వెళ్ళిన తోవనే తమ్ముడు కూడా ప్రయాణం సాగించాడు. వెనకటి ముసలమ్మ ఈ కుర్రవాడికి కూడా ఎదురయింది. "ఆకలికి నా కడుపులో మండుతోంది నాయనా, కాస్త ఏమైనా పెడుదూ," అంది.

ఆ ముసలమ్మను చూస్తే తన తల్లి గుర్తుకి వచ్చింది. ఆ కుర్రవాడు వెంటనే మూటవిప్పి తన దగ్గర ఉన్న రొట్టె ముక్కలో సగం తీసి ముసలమ్మకి ఇచ్చాడు. ముసలమ్మ కుర్రవాడి మంచితనాన్ని ఎంతో మెచ్చుకుంది. తన దగ్గరున్న 'మంత్ర దండాన్ని' ఆ కుర్రవాడికి ఇచ్చి మాయమైపోయింది.

మళ్ళీ నడక సాగించాడు ఆ కుర్రవాడు. కొంతదూరం పోయేసరికి గొర్రెల కాపరి పాడుతున్న పాటను శ్రద్ధగా విని మూడు తలల రాక్షసుడి కథ తెలుసుకున్నాడు. ఎలా అయినా సరే, ఆ రాక్షసుడి చేతుల్లో బాధ పడుతున్న ఆ రాజకుమార్తెను రక్షించాలని నిశ్చయించుకున్నాడు.

మరికొంత దూరం పోయేసరికి క్రూరమృగాలు గుంపులు గుంపులుగా అతని వెనక పడ్డాయి. అతను ఎంత మాత్రం బెదరలేదు. నడకమాని నిశ్చలంగా నిలబడ్డాడు. అప్పుడు ఆ మృగాలు అతని దగ్గరికి రావడం మానేసి తిరుగుముఖం పట్టాయి. ఆ కుర్రవాడు తిరిగి యథాప్రకారంగా, నిర్భయంగా నడక సాగించాడు.

మరికొంత దూరంలో ఒక కొండమీద భవనం కనిపించింది. ఎవరిదో తెలుసుకుందామని భవనాన్ని సమీపించాడు. వీధి తలుపులు తెరిచే ఉన్నాయి. అయినా లోపలికి పోలేదు. "లోపల ఎవరు ఉన్నారు?" అని కేక వేశాడు.

వంటింట్లో ఉన్న ముసలమ్మ సావిట్లోకి వచ్చింది. "లోపలికి రావచ్చునా?" అని వినయంగా అడిగాడు కుర్రవాడు. "రావచ్చు. కాని ఇది మంచి ప్రదేశంకాదు ఇది రాక్షసుని ఇల్లు," అంది ముసలమ్మ.

ఆ మాటలు అంటూ ఉండగానే, "నరవాసన, నరవాసన!" అంటూ గొంతుకు చించుకుని అరుస్తూ వచ్చాడు రాక్షసుడు. ఆ రాక్షసుడికి మూడు తలలు ఉన్నప్పటికీ, వంద మంది మనుషులకుండే శరీరబలం ఉన్నప్పటికీ కుర్రవాడు భయపడలేదు. ఆ కుర్రవాడి నిశ్చలతకి రాక్షసుడు కొంతసేపు నిర్ఘాంతపోయిన మాట వాస్తవం.

"నేను అడిగే మూడు ప్రశ్నలకూ జవాబులు చెప్పాలి. లేకపోతే నీ ప్రాణాలమీద ఆశ వదులుకోవాలి," అన్నాడు రాక్షసుడు.

"ఓ, అలాగే అడుగు!" అన్నాడు ధీమాగా.



"కొనలులేని వస్తువేది?" అని మొదటి ప్రశ్న అడిగాడు రాక్షసుడు.

"బంతి!" అన్నాడు చటుక్కున ఆ కుర్రవాడు. ఆశ్చర్యంతో ఒక్క అడుగు వెనక్కి వేశాడు రాక్షసుడు.

"చిన్నది అయినకొద్దీ అపాయకరం, ఏమిటది?" అని రెండవ ప్రశ్న వేశాడు.

"వంతెన!" అన్నాడు కుర్రవాడు ఆలస్యం చెయ్యకుండా. రాక్షసుడు మరింత ఆశ్చర్యంతో మరో అడుగు వెనక్కి వేశాడు.

"సజీవుల్ని మోసే నిర్జీవులు అంటే అర్థం ఏమిటి?" అని గర్జించాడు ఉక్రోషంతో.

కుర్రవాడు తడుముకోకుండా "నీటిలో మనుషుల్ని మోసే నావ!" అన్నాడు.

ఈ సారి రాక్షసుడు భయంతో వెనుకంజ వేశాడు. ఒక్క క్షణంలో మొలలోని కత్తినితీసి రాక్షసుడి మూడు తలలనూ నరికిపారేశాడు కుర్రవాడు.

అప్పుడా ముసలమ్మ సంతోషంతో ఆ కుర్రవాడిని అనేక గదుల్లోనించి తీసుకుపోయింది. చివరికి ఒక గది తలుపు తీసింది. లోపల ఆ రాజకుమారి ఉంది. కృతజ్ఞతతో రాజకుమారి ఆ యువకుడికి నమస్కరించింది.

ముగ్గురూ కలిసి మళ్ళీ వంటింట్లోకి వెళ్ళారు. అక్కడ ఉన్న శిలా విగ్రహాన్ని ఆ ముసలమ్మ అతనికి చూపించింది. దారిలో కనిపించిన ముసలమ్మ ఇచ్చిన మంత్రదండంతో ఆ శిలా ప్రతిమను ముట్టుకునే సరికి ఆ ప్రతిమకి ప్రాణం వచ్చింది. తమ్ముడిని చూసి ఒక్కసారిగా కౌగలించుకున్నాడు. అన్నగారినీ, రాజకుమార్తెనీ తీసుకుని రాజకుమార్తె రాజ్యానికి బయలుదేరాడు ఆ యువకుడు.

ఆ దేశపు రాజు తన కూతుర్ని తిరిగి చూడగలిగినందుకు ఎంతో ఆనందించాడు. ఆ భాగ్యం తనకి తిరిగి కలగచేసినందుకు ఆ యువకుడిని తన అల్లుడుగా చేసుకున్నాడు.

(ఇంగ్లాండు దేశపు జానపద గాథ)

# అసలు రహస్యం

అనగా అనగా ఇద్దరు అన్నదమ్ములు ఉండేవారు. అన్నయ్య చాలా ధన వంతుడు. తమ్ముడు బీదవాడు. తరుచు తమ్ముడు అన్నయ్య ఇంటికి వెళ్ళి ధనసహాయం చెయ్యమని కోరుతూ ఉండేవాడు. అన్నయ్య కూడా తమ్ముడి మీద ప్రేమ కొద్దీ అడిగినప్పుడల్లా కాస్తో కూస్తో డబ్బు ఇస్తూ ఉండేవాడు.

ఒకసారి సంక్రాంతి పండగ వచ్చింది. పండగనాడు పిండివంటలు చేసుకోవడం మాట అటుంచి, కడుపునిండా భోజనం చెయ్యడానికి కూడా తమ్ముడి ఇంట్లో ఏమీలేదు. పండగపూట పస్తుండటం ఏమిటని అన్నయ్య ఇంటికి బయలుదేరాడు. సహాయం చేసి చేసి విసిగిపోయాడు అన్నయ్య.

ఈ సారి ఎలా అయినా తమ్ముడిని తప్పించుకోవాలని అనుకున్నాడు. కాని, తీరా పండగపూట వచ్చి అడుగుతూ ఉంటే సొంత తమ్ముడిని ఎలా కాదనడం? తమ్ముడిని చూసి "పండుగ కదా అని ఇవ్వాళ ఏదో ఇస్తున్నాను. ఇక ఈ రోజు మొదలుకొని నా ఇంటి గడప తొక్కడానికి వీలులేదు," అంటూ కాసిని బియ్యం, కాస్త పప్పు, ఉప్పు, నాలుగు కూరలు ఇచ్చి పంపించాడు. చేసిన సహాయానికి అన్నయ్యకి తన కృతజ్ఞత తెలిపి, ఇంటికి బయలుదేరాడు.

దారిలో ఒక ముసలయ్య కనిపించాడు. అతను చాలా చిక్కిపోయి అన్నానికి మొహం వాచినట్లుగా కనిపిస్తున్నాడు. అన్నగారి ఇంటినుంచి వస్తున్న రంగన్నని చూసి "బాబూ! నీకు పుణ్యం ఉంటుంది. నాకు తినేందుకు ఏదైనా పడెయ్యి బాబూ... పండగపూట," అన్నాడు వాడు.

రంగన్న నవ్వుతూ "బాగానే ఉంది 'ముష్టిలోముష్టి వీరముష్టి' అన్నట్లు నేనే మా అన్నయ్యని అడిగి తెచ్చుకున్నాను," అంటూ మూటవిప్పి రెండు అరటిపళ్ళు ఆ ముసలయ్యకి ఇచ్చాడు.

"ఇక్కడికి కొంత దూరంలో ఒక భూతగృహం ఉంది. అందులో రకరకాల

వింత మనుషులు ఉంటారు. వాళ్ళు ఎప్పుడూ బయటికిరారు. నువ్వు ఆ భవనంలోకి పోగానే వాళ్ళు నీ దగ్గరున్న ఆహార పదార్థాలని కొంటామంటారు. వాళ్ళ దగ్గర ఒక 'మాయ యంత్రం' ఉంది. నువ్వు ఏది కోరుకుంటే దాన్ని ఆ యంత్రం ఇస్తుంది.

ఆ యంత్రాన్ని వాళ్ళు ఎక్కడో రహస్యంగా దాచారు. ఆ యంత్రాన్ని తీసుకుని మళ్ళీ నా దగ్గరికి రా. ఆ యంత్రాన్ని నడపడం ఎలాగో చెప్తాను," అన్నాడు ముసలయ్య. అతను ఇచ్చిన సలహాకి కృతజ్ఞత తెలిపి రంగన్న కొండవైపు బయలుదేరాడు.

ఆ కొండమీదనే వింత మనుషులుండే భూతగృహం ఉంది. ఆ ఇంట్లోకి వెళ్ళాడు రంగన్న. ఆ ముసలతను చెప్పినట్లుగానే వింత మనుషులు వచ్చి రంగన్న చుట్టూ మూగారు. ఎవరిమట్టుకు వాళ్ళే రంగన్నని అతను తెచ్చిన సరుకులను అమ్మమని అడుగుతున్నారు.

"అసలు ఈ బియ్యం అవీ నేను ఇంటికి తీసుకెళ్ళాలి. కానీ పండగపూట మీరందరూ అమ్మమని అడుగుతున్నారు కాబట్టి నేను అమ్ముతున్నాను. అయితే ఒక్క విషయం... మీ దగ్గరున్న మాయయంత్రాన్ని నాకిస్తేనే నా దగ్గరున్న బియ్యాన్ని మీకు అమ్ముతాను," అన్నాడు రంగన్న.

ఈ బేరానికి మొదట ఆ వింతమనుషులు ఒప్పుకోలేదు. రంగన్నతో ఎంతో వాదించారు. అయితే, రంగన్న కొంచెంకూడా మెత్తబడలేదు. చివరికి యంత్రాన్ని రంగన్నకి ఇవ్వడానికే ఒప్పుకున్నారు.

రంగన్న సంతోషంతో కొండదిగి మళ్ళీ ఆ ముసలయ్య కనిపించిన చోటికి వెళ్ళాడు. అతను రంగన్నకి ఆ యంత్రాన్ని నడిపే పద్ధతిని బోధించాడు. రంగన్న ఇంటికి చేరేసరికి మధ్యాహ్నం పన్నెండు గంటలైంది.

భర్త ఎప్పుడువస్తాడా, ఎప్పుడు బియ్యం అవీ తెస్తాడా, ఎప్పుడు వంటచేద్దామా అని ఎదురుచూస్తోంది రంగన్న భార్య. తీరా చూస్తే భర్త చేతిలో ఏదో పెట్టెలాంటిది ఉంది. బియ్యం అవీ ఉన్న జాడలేదు.

"చూడు ఏం తెచ్చానో!" అంటూ రంగన్న తను తెచ్చిన యంత్రాన్ని నేలమీద పెట్టాడు. ముందు ఆ పూటకి భోజనానికి కావలసిన వస్తువులను కోరుతూ యంత్రాన్ని నడిపాడు. వెంటనే ఆ యంత్రంలోనించి ఆ వస్తువులన్నీ బయటపడ్డాయి. రంగన్న భార్య ఆశ్చర్యానికీ, ఆనందానికీ మేరలేదు.

ఆ తరువాత రంగన్న ధనవంతుల ఇళ్ళల్లో ఉండే వస్తువులను అన్నింటినీ వరసగా కోరుకున్నాడు. అన్నీ ఒక్క నిమిషంలో వచ్చేశాయి. తమకి ఆ అదృష్టం కలిగినందుకు రంగన్న భార్య ఎంతో సంతోషించింది. "ఈ యంత్రం మీకు ఎలా లభించిందండీ?" అని భర్తని అడిగింది. ఏమీ చెప్పకుండా "ఉన్నదానితో సంతోషించు," అన్నాడు రంగన్న.

సంక్రాంతి మూడో రోజున ఇరుగుపొరుగు వాళ్ళనీ బంధువుల్నీ, స్నేహితుల్నీ అందరినీ విందుకి పిలిచాడు రంగన్న. నిన్న మొన్నటి దాకా కూటికి మొహంవాచిన రంగన్న ఇంత మందిని విందుకి ఎలా పిలిచాడా అని అందరూ ఆశ్చర్యపోయారు.

ముఖ్యంగా రంగన్న అన్న మరీ ఆశ్చర్యపోయాడు. పండగ మొదటి రోజుల్లో ఇంత ధనం ఎలా సంపాదించాడో అతనికి అర్థం కాలేదు. అతనికి తమ్ముడుమీద అసూయకూడా కలిగింది. "ఇంత అకస్మాత్తుగా ఇంత ధనాన్ని ఎలా సంపాదించావు?" అని తమ్ముడిని అడిగాడు.

"కొండమీదనుంచి పట్టుకొచ్చాను," అని సమాధానం ఇచ్చాడు రంగన్న. అంతకంటే వివరంగా చెప్పదలుచుకోలేదు. కానీ, కొంత సేపటికి ఉత్సాహంగా కబుర్లు చెపుతూ చెపుతూ, ఆ రహస్యాన్ని వెల్లడించేశాడు. గదిలో దాచిన యంత్రాన్ని తీసుకొచ్చి అందరికీ చూపించాడు. అంతే కాకుండా, ఆ యంత్రం మహత్తునికూడా చూపించాడు. వచ్చిన మిత్రులంతా ఆ దృశ్యాన్ని చూసి రంగన్నని అభినందించారు.

రంగన్న అన్నయ్య మాత్రం ఎలా అయినా ఆ యంత్రాన్ని తను తీసుకోవాలని అనుకున్నాడు. పంటలు కోతకి వచ్చినప్పుడు ఒకసారి తనకి ఆ యంత్రాన్ని ఇమ్మని తమ్ముడిని అడిగాడు. సరే అన్నాడు రంగన్న. ఏడాదికి సరిపడే

తిండి వస్తువుల్ని, తక్కిన వస్తువులన్నీ యంత్రం సహాయంతో సంపాదించి నిలవ చేసుకున్నాడు రంగన్న.

పంటలు కోతకి రాగానే, రంగన్న అన్నయ్య వచ్చి యంత్రాన్ని అడిగి తీసుకుపోయాడు. యంత్రం తన చేతికి చిక్కింది అన్న ఉత్సాహంలో యంత్రాన్ని నడిపే పద్ధతిని అడిగి తెలుసుకోవడం మరిపోయాడు.

మరునాడు ఉదయమే భార్యని పిలిచి "నువ్వు ఇవ్వాళ పొలానికి వెళ్ళి కూలీలతో గడ్డి కోయించు. నువ్వు మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి భోజనం సిద్ధం చేస్తాను," అన్నాడు. భార్య పొలానికి వెళ్ళిపోయింది. యంత్రాన్ని వంటింట్లోకి తీసికెళ్ళి ఒక బల్లమీద పెట్టాడు. తను దాని ముందు ఒక కుర్చీలో కూర్చున్నాడు. "మంచి అరటిపళ్ళు, పాయసం కావాలి...తొందరగా కావాలి," అన్నాడు మచ్చుకి చూద్దామని.

ముందు పళ్ళాలు, తర్వాత గిన్నెలు, తర్వాత బిందెలు... తర్వాత వంటిల్లంతా పళ్ళతోను, పాయసంతోను నిండిపోయింది. అతను ఎన్ని విధాల ప్రయత్నించినా యంత్రం పని చెయ్యడం మానలేదు. ఇంకా వస్తున్నాయి, ఇంకా వస్తున్నాయి. వంటింట్లోంచి బయటికి కూడా పొర్లిపోతున్నాయి.

ఎలాగో తప్పించుకుని వంటింట్లోంచి బయటపడ్డాడు రంగన్న అన్నయ్య. సావిడిగది అంతాకూడా నిండిపోయింది. వీధిలోకి రాకుండా సావిడితలుపు మూయాలని అనుకున్నాడు. తలుపు దగ్గరికి వెళ్ళాడో లేదో దడదడా రోడ్డుమీదకి పళ్ళు వచ్చిపడ్డాయి, పాయాసం ప్రవహిస్తోంది.

అదే సమయానికి భర్త ఏం తయారుచేశాడో తిందామనుకుంటూ భార్య పొలంనుంచి వచ్చింది. రాగానే పళ్ళతో ఇళ్ళు నిండిపోవడం చూసింది. భర్త వీధిలోకి పరుగుతీశాడు. ఇంటిముందన్నీ పళ్ళే. అతని భార్యకూడా పరుగు తీసింది.

ఇద్దరూ రోడ్డుమీద పరిగెత్తుతున్నారు. వారి వెనక పాయసం ప్రవాహం! పాయసంలో పళ్ళు లెక్కలేకుండా కొట్టుకొస్తున్నాయి. "తినండి... తాగండి... అందులో మాత్రం మునిగిపోకండి," అంటూ కేకలు వేసుకుంటూ పరిగెత్తుతున్నాడు

రంగన్న అన్నగారు. అతని వెనక గుండెలు బాదుకుంటూ భార్య! చుట్టుపక్కల జనం అంతా కూడా పరుగుతీయవలసి వచ్చింది.



యంత్రం ఒక్కగంటసేపు ఇంకా అలా పని చేసిందంటే ఊరంతా పాయసంతో మునిగిపోతుంది. లబోలబోమంటూ రంగన్న ఇంటివైపు పరిగెత్తాడు అన్నగారు. దారిలోనే ఎదురయ్యాడు రంగన్న. రంగన్న సంగతంతా విన్నాడు.

"నీ యంత్రాన్ని నువ్వే తీసుకో బాబూ, నీకు పుణ్యముంటుంది," అన్నాడు రంగన్నతో అన్నగారు. రంగన్న ఏం మాయచేశాడో గాని ఒక్క క్షణంలో ప్రవాహాన్ని అరికట్టాడు. యంత్రాన్ని తిరిగి తీసుకున్నాడు.

ఆ యంత్రం సహాయంతో ఒక బంగారు భవనాన్ని కట్టించి, అందులో హాయిగా ఉంటున్నాడు రంగన్న. ఆ భవనం పక్కనే పొలంకూడా ఉంది. ఆ పొలానికి దగ్గరగా సముద్రం ఉంది.

ఒకసారి ఆ సముద్రంలో ప్రయాణం చేస్తున్న వర్తకుడు ఒకడు రంగన్న అదృష్టాన్ని గురించి విన్నాడు. దూరంనుంచి ధగధగా మెరిసిపోతూ కనిపిస్తోంది రంగన్న బంగారు మేడ.

ఆ యంత్రం తనకి కూడా ఉంటే ఎంత బాగుండును అనుకున్నాడు వర్తకుడు. తనింకా స్వయంగా ఉప్పు తీసుకుని ఓడమీద సముద్రంలో ప్రయాణం చెయ్యనక్కర్లేదు. యంత్రంతో బోలెడు ఉప్పు సంపాయించి నౌకర్లను పంపి వర్తకం చేయించవచ్చు అని ఆలోచించాడు. హాయిగా కాలుమీద కాలేసుకుని కాలం గడపాలని అతని ఆశయం.

ఓడ ఒడ్డుకి చేరిన తర్వాత, ఆ బంగారు భవనానికి వెళ్ళి రంగన్నని కలుసుకున్నాడు. ఒకసారి తనకి ఆ యంత్రాన్ని ఇమ్మన్నాడు. రంగన్న ఇప్పుడు బాగా ధనవంతుడు అయ్యాడు. అంచేత తనకి ఇంకా యంత్రం అవసరం లేదుకదా అని ఆ యంత్రాన్ని ఆ వర్తకుడికి ఇచ్చేశాడు.

అయితే ఆ వర్తకుడు కూడా అనుకోకుండా పట్టిన అదృష్టానికి మురిసిపోతూ యంత్రాన్ని ఎలా నడపాలో తెలుసుకోకుండానే వెళ్ళిపోయాడు.

వర్తకుడు తిరిగి సముద్రంలో ప్రయాణం చేస్తున్నాడు. దారిలో యంత్రాన్ని

పైకి తీసి "మంచి ఉప్పుని త్వర త్వరగా తయారు చెయ్యాలి," అన్నాడు.

యంత్రంలోనించి ఉప్పు రావడం మొదలు పెట్టింది. నీళ్ళలా ఒకటే ధారగా వస్తోంది ఉప్పు. వద్దన్నా ఆగడం లేదు.

ఒక గంటలో ఓడంతా ఉప్పుతో నిండిపోయింది. చివరికి యంత్రంతో సహా ఓడ సముద్రంలో మునిగిపోయింది. నీటి అడుగున మట్టిలో శాశ్వతంగా ఉండిపోయింది యంత్రం. అందుకే సముద్రం నీరు ఉప్పగా తయారైంది. అదీ అసలు రహస్యం! ! !

(నార్స్ జానపద గాథ)



# మంచి పుస్తకం

## తెలుగు, ఇంగ్లీషు భాషల్లో కథలు

సెట్–1 : రంగుల్లో పిల్లల బొమ్మల కథలు: 4 పుస్తకాలు

ఎలుకకు దొరికిన పెన్సిలు

పడవ ప్రయాణం

మూడు పిల్లిపిల్లలు

నేను కూడా

సెట్–2 : 4 రంగుల కథల పుస్తకాలు

భలే బాతు

ఎవరు మ్యావ్ అన్నారు?

పుట్టగొడుగు కింద

రకరకాల బండి చక్రాలు

ఈసోపు కథలు : 4 రంగుల కథల పుస్తకాలు

టాల్‌స్టాయ్ ఈసోపు కథలు – 1

టాల్‌స్టాయ్ ఈసోపు కథలు – 2

టాల్‌స్టాయ్ ఈసోపు కథలు – 3

టాల్‌స్టాయ్ ఈసోపు కథలు – 4

బొమ్మల కథలు (రంగుల్లో)

తెలుగులో రంగుల కథల పుస్తకాలు

నక్కా, కుందేలు

బుల్లిమట్టి ఇల్లు

పారిపోయిన బండిచక్రం

మహాగిరి

గుణపాఠం నేర్చుకున్న ఎలుక

జూలో బాతు

అజంతా అపార్ట్‌మెంట్స్ (8 పుస్తకాలు - సెట్)
అల్లరి జ్యోతి
పాత కుందేలు
జ్యోతి, పక్కింటి మనిషి
పుట్టినరోజు బొమ్మ
మంచి మిత్రులు
హస్మినా గాలిపటం
మదన్, సయిూఫ్
గణేష్, సయిూఫ్ వేటకు వెళ్ళారు
జీవిత కథలు : 4 పుస్తకాలు
లూయిూ బ్రేల్
మేరీ క్యూరీ
జార్జి వాషింగ్టన్ కార్వర్
చేయూతనిచ్చే చేతులు
బాలల కథలు

## తత్వశాస్త్రం

పరుసవేది

## సైన్సు

సెట్-1 : ఎలా తెలుసుకున్నాం : 4 పుస్తకాలు
భూమి గుండ్రంగా ఉంది
రోదసి
సముద్రపు లోతుల్లో సజీవ ప్రపంచం
సూక్ష్మక్రిములు
సెట్-2 : ఎలా తెలుసుకున్నాం : 4 పుస్తకాలు
అంటార్కిటికా
చమురు
భూకంపాలు
విద్యుత్తు

# అనగా అనగా కథలు

వివిధ దేశాల జానపద కథలు

అబ్బూరి ఛాయాదేవి

జానపద కథలంటే పిల్లలు చెవి కోసుకుంటారు. కొన్ని వందల సంవత్సరాలు ప్రజల నాల్కల మీద నిలిచిన కథలు ఇప్పుడు ఎక్కువగా పుస్తకాలుగా వస్తున్నాయి. 'మౌఖిక సంస్కృతి' నుంచి 'లిఖిత సంస్కృతి' వైపు పయనాన్ని ఇది సూచిస్తుంది. కొన్ని దశాబ్దాల క్రితమే అబ్బూరి ఛాయాదేవి గారు వివిధ దేశాల జానపద కథలను తెనిగించారు. వాటికి బొమ్మలు వేయించి మళ్ళీ మీ ముందుకు తీసుకు రావడం మాకు సంతోషంగా ఉంది.

మంచి చెడులు, ధైర్య సాహసాలు, అసూయా ద్వేషాలు, కుట్రలూకుతంత్రాలు, మాయా మర్మాలు ఏ దేశ జానపద కథలలోనైనా ఉంటాయి. ఇలాంటి కథలే మనదేశ జానపద సాహిత్యంలోనూ ఉన్నయి.

జానపద కథలు పిల్లలకు అద్భుత ఊహా ప్రపంచానికే కాకుండా, అంతరంగ చిత్రాలకు కూడా తలుపులు తెరుస్తాయి. తామేమిటో, ఈ లోకం ఏమిటో, ఈ లోకంలో తమ స్థానం, పాత్ర ఏమిటో అర్థం చేసుకోటానికి పిల్లలకు ఇలాంటి కథలు దోహదపడతాయి.

ఈ పుస్తకం పిల్లలకు ఇవ్వటమంటే అద్భుత ప్రపంచాలను వాళ్ళ చేతుల్లో ఉంచటమే.

రూ. 40/-

ISBN 978-81-906522-0-9